మంగళవారం
18•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 234
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

## అపర భగీరథుడికి
# హరిత కానుక



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం ప్రగతిభవన్‌లో ఆయనకు మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రైతు సమన్వయసమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్ తదితరులు కూడా ఉన్నారు.

- వాడవాడలా పండుగలా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు
- ఊరూరా మొక్కలునాటి శుభాకాంక్షల వెల్లువ
- నిండు నూరేండ్లు జీవించాలని ఆలయాల్లో పూజలు
- జలవిహార్‌లో 66 కిలోల కేక్ కట్‌చేసిన ప్రజాప్రతినిధులు
- పలుచోట్ల అన్నదానాలు, రక్తదాన శిబిరాలు

**ఆకుపచ్చ** తెలంగాణను ఆకాంక్షించిన జననేత కలను తెలంగాణ సమాజం సాకారంచేసింది. సోమవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు 66వ పుట్టినరోజున లక్షలకొద్దీ మొక్కలునాటి ప్రకృతినే పరవశింపజేసింది. పట్నం పల్లెలన్న తేడా లేకుండా.. కర్మాగారాలు.. కళాకేంద్రాలు, కార్యాలయాలు.. కారాగృహాలు.. గుడిలో.. బడిలో.. మడిలో.. తెలంగాణ భూభాగంలోని ప్రతి అణువునా మొక్కలు నాటుకున్నాయి. సామాన్యుడి నుంచి అమాత్యుల వరకు.. కార్మికుల నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరు ఈ మహా హరితయాగంలో భాగస్వాములయ్యారు. అపరభగీరథుడి జన్మదినాన్ని పచ్చని పర్వదినంగా తెలంగాణ జరుపుకొన్నది. తెలంగాణ జాతిపితకు యావత్‌దేశం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రితోపాటు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. పలు రాష్ట్రాల మంత్రులు.. అనేక మంది రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. దాదాపు నలభై దేశాల్లో సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎక్కడికక్కడ కేక్‌లు కట్‌చేసి, రక్తదానాల వంటి అనేక సేవాకార్యక్రమాలు చేపట్టారు. తమ నేత నిండునూరేళ్లు జీవించాలని ఆలయాల్లో పూజలు చేశారు. ప్రగతిభవన్‌లో పలువురు ప్రముఖులు సీఎంను స్వయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

వివరాలు 2,3 పేజీల్లో

## ఆర్మీలో మహిళా కమాండర్లు



- శారీరక లక్షణాల ఆధారంగా మహిళలపై వివక్ష తగదు
- మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ హోదా కల్పించండి
- కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు
- వారు కమాండింగ్ విధులను సమర్థంగా నిర్వహించగలరు
- స్త్రీల పట్ల ఆలోచనావిధానాన్ని మార్చుకోవాలని హితవు
- తీర్పుపై మహిళా సైనికాధికారుల హర్షం

5




# వరల్డ్ వ్యాక్సిన్ క్యాపిటల్

### ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడోవంతు తెలంగాణలోనే తయారు: మంత్రి కేటీఆర్



సోమవారం హెచ్‌ఐసీసీలో ప్రారంభమైన బయో ఏషియా సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- కణ, జన్యు ఆధారిత చికిత్సలు అందించేందుకు ప్రపంచస్థాయి సంస్థ
- జీనోమ్ వ్యాలీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు
- హెచ్‌ఐసీసీలో బయోఏషియా సదస్సు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కణ, జన్యు ఆధారిత చికిత్సలు అందించేందుకు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి వైద్యసంస్థను ఏర్పాటుచేయనున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ప్రకటించారు. సీసీఎంబీ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటుచేస్తామని తెలిపారు. తెలంగాణ వరల్డ్ వ్యాక్సిన్ క్యాపిటల్‌గా మారిందని.. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడోవంతు రాష్ట్రంలోనే తయారవుతున్నాయని చెప్పారు. హెచ్‌ఐసీసీలో సోమవారం నుంచి మూడురోజులపాటు జరుగనున్న బయోఏషియా-2020 ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మక జీనోమ్ వ్యాలీ అవార్డును కార్ల్‌జూన్‌కు అందించారు. అనంతరం మాట్లాడుతూ లైఫ్‌సైన్సెస్ రంగానికి హైదరాబాద్ హబ్‌గా నిలిచిందని, ప్రపంచస్థాయి కంపెనీల ఏర్పాటుకు కేంద్రంగా మారిందని చెప్పారు. జాతీయసగటు ఫార్మా ఉత్పత్తుల్లో హైదరాబాద్‌లోనే 35% తయారవుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 800కుపైగా ఫార్మా, బయోటిక్, మెడికల్ టెక్నాలజీ కంపెనీలు ఉన్నాయని, వీటిద్వారా 50 బిలియన్ డాలర్ల విలువైన వ్యాక్సిన్లు ఉత్పత్తి అవుతున్నాయని అన్నారు. రెండు బిలియన్

మిగతా 4వ పేజీలో

## మద్దతు ధరకు కందులు కొంటాం

### రైతులు ఆందోళన చెందవద్దు

- సరిహద్దు జిల్లాల్లో నిఘా పెంచండి
- దళారులకు సహకరిస్తే అధికారులు జైలుకే
- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కంది పంటను రాష్ట్రప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని.. రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. కంది రైతుల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా.. కొనుగోలుకు అభయం ఇచ్చారని వెల్లడించారు. కంది కొనుగోళ్ల కోసం దాదాపు రూ.200 కోట్లు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని తెలిపారు. సోమవారం మంత్రుల నివాస సముదాయంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి, పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ బండారు భాస్కర్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. కంది కొనుగోలు కోటాను పెంచాలని లేఖరాసినా కేంద్రం స్పందించలేదని చెప్పారు. కంది దిగుబడిపై వ్యవసాయశాఖ వద్ద సమగ్ర సమాచారం ఉన్నదని, దళారులు అక్రమంగా తెచ్చి అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళారులకు

మిగతా 4వ పేజీలో

**• నిర్భయ దోషులకు తాజా డెత్ వారంట్**

## మార్చి 3న ఉరి!

చట్టపరమైన అవకాశాల వినియోగానికి ముగిసిన హైకోర్టు గడువు

శిక్ష అమలు వాయిదాకు దోషుల కొత్త ఎత్తులు

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 54.00 | రిటైల్ లైవ్ | 76.00 |
| డ్రెస్డ్ | 110.00 | స్కిన్‌లెస్ | 125.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 385.00 | రంగారెడ్డి | 385.00 |
| మెదక్ | 385.00 | కరీంనగర్ | 388.00 |
| వరంగల్ | 388.00 | డజన్ ధర | 60.00 |

## నిరసన తెలుపండి కానీ..

ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు

షాహీన్‌బాగ్ నిరసనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

5




SAATCHI & SAATCHI
epaper.ntnews.com



సోమవారం పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆశీర్వదిస్తున్న వేదపండితుడు ఫణి శశాంకశర్మ. చిత్రంలో సీఎం సతీమణి శోభ కూడా ఉన్నారు.





సీఎం కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంటరీ నేత కే కేశవరావు, రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో పర్యాటకశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు.





ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు చెప్తున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.. సీఎం కేసీఆర్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

# సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

మరిన్నేండ్లు ప్రజాసేవలో కొనసాగాలి.. ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్ష

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ ఫోన్.. ట్విట్టర్‌లో ప్రధాని, పలు రాష్ర్టాల సీఎంల విషెస్

ప్రగతిభవన్‌కు పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులు





ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పూల మొక్కలు అందజేస్తున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్



సీఎం కేసీఆర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్. చిత్రంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సోమవారం సీఎం కేసీఆర్ 66వ పుట్టినరోజు సందర్భంగా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, వివిధరంగాల ప్రముఖులు, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో నిండు జీవితం గడపాలని ఆకాంక్షించారు. మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని కోరుకొన్నారు. మరికొందరు శుభాకాంక్షలు తెలిపేందుకు సోషల్‌మీడియాను వేదికగా చేసుకున్నారు. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసినవారిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, సమాచార హక్కు ప్రధాన కమిషనర్ రాజాసదారామ్, కమిషనర్ బుద్దా మురళి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే రోజా తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని పాతబస్తీలోని చార్మినార్ వద్ద 'వీ లవ్ కేసీఆర్' అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్థానిక టీఆర్‌ఎస్ నాయకులు

## రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓమ్ ప్రకాశ్ బిర్లా, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సోమవారం ఫోన్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి సీఎం కేసీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పశ్చిమబెంగాల్, మేఘాలయ, ఏపీ, తమిళనాడు సీఎంలు మమతాబెనర్జీ, కే సంగ్మా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పళనిస్వామి, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, అనసూయ ఉయికె, వీపీసింగ్ బద్నోర్, టీడీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు, వైఎస్సార్సీపీ రాజ్యసభనేత విజయసాయిరెడ్డి, టీడీపీ నేత లోకేశ్ తదితరులు సీఎం కేసీఆర్‌కు ఫోన్లలో, ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్తున్న టీఆర్‌ఎస్ నాయకుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి. చిత్రంలో కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి కూడా ఉన్నారు.



సీఎమ్మార్‌ఎఫ్‌లో జమచేసేందుకు దాదాపు రూ.60 లక్షల విలువైన 1400 చెక్కులను సీఎంకు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి



తన కుమారులు డాక్టర్ ప్రణీత్, ఆర్థికవేత్త ప్రణయ్‌తో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్



సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి



ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ దంపతులను సత్కరిస్తున్న జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్రపటం బహూకరిస్తున్న రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నేత రావుల శ్రవణ్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళా ఐఏఎస్ అధికారులు ప్రియాంకవర్గీస్, శాంతికుమారి, అలుగు వర్షిణి, యోగితా రాణా, క్రిస్టినా జెడ్ చోంగ్తూ, దివ్య దేవరాజన్, శ్వేతా మొహంతి, టీకే శ్రీదేవి, నీతూకుమారి ప్రసాద్ తదితరులు

## తల్లిని కన్న తనయుడికి శుభాకాంక్షలు

- మంత్రి కేటీఆర్ ట్వీట్

'బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రజల గుండెల్లో గూడుకట్టుకొన్న నేత, ధీశాలి, పోరాటయోధుడు, డైనమిక్ లీడర్.. ఆయనే మా తండ్రి కేసీఆర్ అని గర్వంగా చెప్పుకోగలను' అంటూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు ట్వీట్‌చేశారు. 'తల్లిని కన్న తనయుడికి జన్మదిన శుభాకాంక్షలు' అని ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు.

## ఈ నేలకు మీరే శ్రీరామరక్ష

ట్విట్టర్‌లో మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు

'తెలంగాణ మీ స్వప్నం, ఈ రాష్ట్రం మీ త్యాగఫలం. ఈ అభివృద్ధి మీ దక్షతకు నిదర్శనం, ఈ నేలకు మీరే శ్రీరామరక్ష, తెలంగాణ జాతిపిత కేసీఆర్ శతవసంతాలు చూడాలని మనసారా కోరుకుంటూ..' అని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.





సీఎం కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి



ఖమ్మం జిల్లా కారేపల్లి పీహెచ్‌సీలో భవానికి పండ్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

## వాళ్లింట్లో కేసీఆర్ పుట్టాడు!

**కారేపల్లి:** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం ఎర్రబోడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బయ్యా వీరబాబు భార్య భవానికి మగ శిశువు జన్మించాడు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేసి, శిశువుకు కేసీఆర్ అని నామకరణం చేశారు. వైద్యులు భవానికి కేసీఆర్ కిట్ అందించారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజున తమకు బాబు పుట్టాడని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.



సీఎం కేసీఆర్‌తో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ రాజాసదారాం, కమిషనర్ బుద్ధా మురళి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి, జూలూరు గౌరీశంకర్



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పూల మొక్క అందజేస్తున్న ప్రగతిభవన్ సిబ్బంది



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసేందుకు సోమవారం ప్రగతిభవన్‌లో బారులుతీరిన టీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు



సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వీ మమత



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, నాయకులు మామిళ్ల రాజేందర్, రేచల్ తదితరులు



సోమవారం ప్రగతిభవన్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సతీమణి శోభ, మంత్రి కే తారకరామారావు, కేటీఆర్ సతీమణి శైలిమ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత



నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో మామిడి మొక్కనాటి నీరు పోస్తున్న రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, టీఆర్‌ఎస్ నాయకుడు తలసాని సాయికిరణ్ కూడా ఉన్నారు.



నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో కేక్‌కట్‌చేస్తున్న టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, సెక్రటరీ జనరల్ కే కేశవరావు. చిత్రంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, పార్టీ నాయకుడు తలసాని సాయికిరణ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



అసెంబ్లీలో కేక్‌కట్‌చేసి తినిపించుకొంటున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి పుష్ప, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సతీమణి అరుంధతి. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



హైదరాబాద్ వెంగళరావునగర్‌లోని శిశువిహార్‌లో కేక్‌కట్‌చేసిన అవిభక్త కవలలు వీణావాణిలకు తినిపిస్తున్న సీఎం కేసీఆర్ మనుమడు హిమాన్షు. చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు

# జననేతకు మొక్కలు కానుక

వాడవాడలా పండుగలా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

- ఊరూరా మొక్కలునాటి శుభాకాంక్షల వెల్లువ
- నిండు నూరేండ్లు జీవించాలని ఆలయాల్లో పూజలు
- జలవిహార్‌లో 66 కిలోల కేక్ కట్‌చేసిన ప్రజాప్రతినిధులు
- పలుచోట్ల అన్నదానాలు, రక్తదాన శిబిరాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర సాధకుడు, జననేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను సోమవారం వాడవాడలా పండుగలా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, టీజీవోలు, టీఎన్జీవోలు, గులాబీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు, సంస్థలు, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులు, సిబ్బంది, ప్రభుత్వ కార్యాలయాల్లో, దవాఖానల్లో సిబ్బంది సీఎం కేసీఆర్‌కు కానుకగా తలా ఒక మొక్కనాటారు. కేక్ కట్‌చేసి, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. జలవిహార్‌లో 66 కిలోల కేక్ కట్‌చేశారు. సీఎం కేసీఆర్ జీవిత చిత్రాల ఫొటో ప్రదర్శనను ఏర్పాటుచేశారు. గులాబీ శ్రేణులు పలుచోట్ల ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. కేసీఆర్ నిండు నూరేండ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రధాన దేవాలయాలతోపాటు మొత్తం 12,265 ఆలయాల్లో సీఎం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు చీరలు పంపిణీచేశారు. తెలంగాణభవన్‌లో దివ్యాంగులకు 66 వీల్‌చైర్లు, అంధులకు 55 జతల బట్టలను పంపిణీచేశారు. టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు మొక్కలునాటారు.

శాసన, శాసనమండలి సభ్యుల సౌకర్యార్థం అసెంబ్లీలో ఏర్పాటుచేసిన ఫిట్‌నెస్ సెంటర్‌ను స్పీకర్, మండలి చైర్మన్ ప్రారంభించారు. తెలంగాణ ఉభయ సభల సభ్యుల సమగ్ర వివరాలతో కూడిన డైరీని ఆవిష్కరించారు. ఏపీ టీఆర్‌ఎస్ నేత ఆదినారాయణ ఆధ్వర్యంలో విజయవాడ దుర్గగుడిలో ప్రత్యేక పూజలుచేసి, పేదలకు చీరలు పంపిణీచేశారు. ఢిల్లీలో కేసీఆర్ అభిమాని ఆంజనేయులు అంధుల పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్‌కట్‌చేసి, పండ్లు పంపిణీచేసి, భోజనం ఏర్పాటుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికవాడల్లో 1.32 లక్షల మొక్కలనునాటారు. అమెరికా, ఇంగ్లాండ్, యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, డెన్మార్క్, మలేషియా, ఆస్ట్రియా, లాట్వియా, పెరూ, కెనడా, బెహ్రయిన్, సౌత్‌ఆఫ్రికా, ఖతార్, కువైట్, టాంజానియా వంటి 40 దేశాల్లో మొక్కలునాటి వేడుకలు జరుపుకొన్నారు. వ్యవసాయ వర్సిటీలో వీసీ ప్రవీణ్‌రావు, బషీర్‌బాగ్‌లోని లోకాయుక్త కార్యాలయ ప్రాంగణంలో లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు, ఉపలోకాయుక్త నిరంజన్‌రావు మొక్కలు నాటారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా 'మియావాకి' పద్ధతిలో అటవీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో ఎంపీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ సమావేశమందిరంలో బార్ కౌన్సిల్ సభ్యుడు గండ్ర మోహన్‌రావు కేక్ కట్‌చేశారు.

తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ కార్యాలయం ఆవరణలో అధ్యక్షుడు ప్రభాకర్‌రావు మొక్కలు నాటారు. క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాటిన మొక్కలను సంరక్షిస్తున్న తీరును తెలుసుకొనేందుకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. దీనిని ఆ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మొక్కలునాటి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణ కూడా చూడాలని కోరారు. హరితహారంలో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గంలోని వీర్నపల్లి అటవీ ప్రాంతం డ్రోన్‌ల ద్వారా విత్తనాలు చల్లినట్టు కేటీఆర్ ట్వీట్‌చేశారు.

## మొక్కలునాటిన 'నమస్తే' సిబ్బంది

నమస్తే తెలంగాణ దినపత్రిక కుటుంబం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్లలో మొక్కలు నాటింది. మండల నియోజకవర్గ కేంద్రాల్లోనూ సిబ్బంది మొక్కలు నాటారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మం డలం దేవరయాంజాల్‌లోని పత్రిక ప్రింటింగ్ ప్రెస్‌లో సీఎండీ దామోదర్‌రావు మొక్కలునాటారు.



సిద్దిపేట సుడా కార్యాలయం ఎదుట మొక్క నాటి నీరుపోస్తున్న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు



తెలంగాణభవన్‌లో దివ్యాంగుల కార్పొరేషన్ తొలి చైర్మన్ కే వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు 66 వీల్‌చైర్లు, అంధులకు 55 జతల బట్టలు అందజేశారు. చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎన్జీవో నాయకురాలు ఫాతిమా బేగం, దివ్యాంగుల నాయకులు మున్నా, రాజ్యలక్ష్మి ఉన్నారు.



సూర్యాపేట మండలం టేకుమట్ల నుంచి మూసీకి వెళ్లే మార్గంలో మొక్కనాటుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. అనంతరం ఈ రోడ్డుకు కేసీఆర్ మార్గ్‌గా నామకరణంచేశారు.




హైదరాబాద్ పాతనగరంలోని సిటీ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో మొక్క నాటుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీపీ అంజనీకుమార్, ఐజీ మల్లారెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా తదితరులు



కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో కేక్‌కట్‌చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ సునీల్‌రావు తదితరులు



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో కేక్‌కట్‌చేసిన మంత్రి ఈటల రాజేందర్.. టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్‌కు తినిపిస్తున్న దృశ్యం.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రింటింగ్ ప్రెస్‌లో మొక్కనాటుతున్న సీఎండీ దామోదర్‌రావు. చిత్రంలో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రామారావు, చీఫ్ ఆఫ్ న్యూస్ బ్యూరో సతీశ్‌కుమార్, ఆపరేషన్స్ సీజీఎం సీహెచ్ శ్రీనివాస్, సర్క్యులేషన్ డీజీఎం రాంరెడ్డి, ఏడీవీటీ డీజీఎంలు విజయ్‌కులకర్ణి, ప్రవీణ్‌కుమార్, ఫైనాన్స్ మేనేజర్లు రాఘవరావు, సోమకిష్టయ్య, హెచ్‌ఆర్ మేనేజర్ మధు, ప్రొడక్షన్ ఏజీఎంలు మనోజ్‌కుమార్ రాథోడ్, విజయ్‌కుమార్, చీఫ్ మేనేజర్ జీఎస్‌పీ కుమార్, డీ వెంకటేశ్వరావు, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, ముజాఫర్ ఉన్నారు.



హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్క్‌లో మొక్కనాటి నీరుపోస్తున్న సీఎస్ సోమేశ్‌కుమార్. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ. చిత్రంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యకార్యదర్శులు రజత్‌కుమార్, వికాస్‌రాజ్, సునీల్ శర్మ, జగదీశ్వర్, అర్వింద్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, జలమండలి ఎండీ దానకిశోర్, పురపాలకశాఖ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతి తదితరులు ఉన్నారు.



రంగారెడ్డి జిల్లా నార్సింగి సబ్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్ జే శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్ స్వామిరెడ్డి, జీ పర్వతం, కే రాములు, సైబర్‌సిటీ సర్కిల్ ఎస్సీ వెంకన్న, ఇబ్రహీంబాగ్ డివిజన్ డీఈ గోపాలకృష్ణ, కొండాపూర్ డీఈ నరేందర్‌రెడ్డి, గచ్చిబౌలి డీఈ నరసింహ్మారెడ్డి తదితరులు



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో రక్తదానంచేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు కూడా ఉన్నారు.



కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్ వద్ద కేక్‌కట్ చేస్తున్న వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్. చిత్రంలో వీ ప్రకాశ్, ఈఎన్సీ నల్లా వెకటేశ్వర్లు తదితరులు

# సీఏఏపై నిర్ణయం చారిత్రాత్మకం

## సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

## ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తంచేస్తూ.. సీఎం కే చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఏఏ సవరణను రద్దుచేయాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సూచించడం స్వాగతించదగిన పరిణామమని చెప్పారు. కేరళలో మాదిరిగా ఎన్పీఆర్ ప్రక్రియను నిలిపివేసేలా నిర్ణయం తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ జామియా మిలియా వర్సిటీలో విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జి జరిపిన పోలీసులపై కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్రమంగా వర్సిటీలోకి ప్రవేశించడమే కాకుండా విద్యార్థులతో దౌర్జన్యంగా వ్యవహరించడాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు. బయటకు వెళ్తామని విద్యార్థినులు బతిమిలాడినా లాఠీలతో కొట్టడంపై ఆందోళన వ్యక్తంచేశారు.

### మంత్రివర్గ తీర్మానం హర్షణీయం: సీపీఐ

సీఏఏను రద్దుచేయాలని క్యాబినెట్ సమావేశంలో తీర్మానించడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పౌరసత్వం విషయంలో మతపరమైన వివక్ష తగదని పేర్కొనడాన్ని సీపీఐ స్వాగతిస్తున్నదని చెప్పారు. అసెంబ్లీలోనూ తీర్మానం చేయాలనే నిర్ణయం మంచిదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ మొండిగా వ్యవహరిస్తున్నందున సీఏఏకు వ్యతిరేకంగా తెలంగాణలో లౌకిక పార్టీలతో కలిసి ఉద్యమించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు.

# 20న ఎడ్‌సెట్ నోటిఫికేషన్

- మే 23న ప్రవేశపరీక్ష
- ఓరియంటల్ లాంగ్వేజీ ఉత్తీర్ణులకూ అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీఈడీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎడ్‌సెట్ నోటిఫికేషన్ ఈ నెల 20వ తేదీన విడుదలకానున్నది. మే 23వ తేదీన సీబీటీ పద్ధతిలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈసారి ఓరియంటల్ లాంగ్వేజీలో డిగ్రీ ఉత్తీర్ణులైనవారికి కూడా అవకాశం కల్పించాలని సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన ఎడ్‌సెట్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి షెడ్యూల్‌ను విడుదలచేశారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నర్సంపేట, నిజామాబాద్, ఖమ్మం, సత్తుపల్లి, కోదాడ, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సిద్దిపేటతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, కర్నూల్‌లో పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు పరీక్షఫీజుగా రూ.650 చొప్పున.. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.450 చెల్లించాలి. రూ.ఐదొందల ఆలస్యరుసుంతో ఏప్రిల్ 25వ తేదీ వరకు, రూ.1,000 ఆలస్యరుసుంతో ఏప్రిల్ 30, రూ.రెండువేల ఆలస్యరుసుంతో మే 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 11న ఫలితాలు విడుదలచేస్తారు. సమావేశంలో ఎడ్‌సెట్ కమిటీ కన్వీనర్ మృణాళిని, విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



## 20న స్కూల్ అసిస్టెంట్లకు సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పోస్టులకు అర్హత సాధించిన 64 మంది పీహెచ్ అభ్యర్థులకు 20వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ సోమవారం తెలిపింది. అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు నాంపల్లిలోని ప్రతిభభవన్‌లో అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించింది.

## ఇస్రో యంగ్‌సైంటిస్ట్ ప్రోగ్రాంకు దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 24వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేసవి సెలవుల్లో రెండువారాలపాటు నిర్వహించనున్న యంగ్‌సైంటిస్ట్ కార్యక్రమానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు సోమవారం ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులు. 8వ తరగతిలో సాధించిన మార్కులు, ఇతర యాక్టివిటీల ఆధారంగా ప్రతి రాష్ట్రం నుంచి ముగ్గురిని ఎంపికచేస్తారు. ఆసక్తి గల విద్యార్థులు www.isro. gov.in ద్వారా ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

## బీసీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల్లో ఇంగ్లిష్ మీడియం 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి మల్లయ్యభట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## డిగ్రీలో డాటా సైన్స్, బిజినెస్ ఎనలిటికల్ కోర్సులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీలో డాటా సైన్స్, బీకాంలో బిజినెస్ ఎనలిటికల్ కోర్సులను పరిచయంచేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సిలబస్, విధివిధానాల తయారీకి ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేశారు. ఔత్సాహిక ప్రైవేట్ కాలేజీలతోపాటు కొన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఈ కోర్సులకు అనుమతులు ఇస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.42 గంటలకు

సూర్యాస్తమయం: 6.11 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం దశమి మధ్యాహ్నం 2.33 వరకు, తదుపరి కృష్ణ, నక్షత్రం: జ్యేష్ఠ ఉదయం 5.14 వరకు, తదుపరి ఏకాదశి, మూల బుధవారం ఉదయం 6.07 వరకు, అమృత ఘడియలు: రాత్రి 11.29 నుంచి బుధవారం రాత్రి 1.09 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.45 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.00 నుంచి 9.46 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.22 నుంచి 3.07 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 1.32 నుంచి 3.11 వరకు.

# వరల్డ్ వ్యాక్సిన్ క్యాపిటల్

మొదటిపేజీ తరువాయి...

డోస్ వ్యాక్సిన్లు అంటే.. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్‌ల్లో మూడోవంతు తెలంగాణలో తయారవుతున్నాయని వివరించారు. తెలంగాణకు చెందిన భారత్ బయోటెక్ కంపెనీ గతంలో తయారుచేసిన టైఫాయిడ్ వాక్సిన్‌ను ఇటీవలే డబ్ల్యూహెచ్‌వో ఆమోదించిందన్నారు. ఇదే కంపెనీకి చెందిన టైఫాయిడ్ అడ్వాన్స్‌డ్ వ్యాక్సిన్ ఈరోజే (సోమవారం) ఆవిష్కరించినట్టు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ విభాగంలో చాలా లక్ష్యాలను చేరుకుంటున్నదని గర్వంగా చెప్పుకొంటున్నామన్నారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో ప్రస్తుతమున్న 50 బిలియన్ డాలర్ల లక్ష్యం నుంచి రాబోయే రోజుల్లో 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని.. వచ్చే పదేండ్లలో ఈ రంగాల్లో నాలుగులక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

### జీనోమ్ వ్యాలీ అభివృద్ధికి ప్రణాళికలు

లైఫ్‌సైన్సెస్ రంగంలో కీలకమైన ఏసియాలోనే అతి పెద్దదైన జీనోమ్ వ్యాలీ క్లస్టర్ 2.0ను మరింత అభివృద్ధిపర్చడానికి ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి కేటీఆర్ తెలిపారు. జీనోమ్ వ్యాలీ క్లస్టర్‌లో తాజాగా సిన్‌జిన్ సంస్థ రూ.170 కోట్లతో ప్రారంభమైందని.. ఈ సంస్థ బెంగళూరు తర్వాత రెండోసెంటర్‌ను ఇక్కడే ఏర్పాటుచేసిందని చెప్పారు. సిన్‌జిన్ సంస్థను ఇక్కడ ఏర్పాటుచేయడంవల్ల లైఫ్‌సైన్సెస్‌లో ప్రపంచవ్యాప్త పరిశోధనరంగ హబ్‌గా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. జీవీకే బయో, సాయి లైఫ్‌సైన్సెస్ కంపెనీలు ఇప్పటికే విస్తరిస్తున్నాయన్నారు. 2017లో బయోఏషియా సదస్సు సందర్భంగా రూ.300 కోట్ల పెట్టుబడితో బయోలాజికల్-ఈ సంస్థకు శంకుస్థాపన చేశానని.. దానిని సోమవారం ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నానని, గర్వంగా ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. దీని ద్వారా 1000 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్‌ను 276 ఎకరాల్లో ఏర్పాటుచేశామని, రెండేండ్లలోనే ఇక్కడ 20 కంపెనీలు తమ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్‌అండ్‌డీ యూనిట్లను ఏర్పాటుచేశాయని, అతి త్వరలో కంపెనీలు వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించనున్నాయని తెలిపారు. మెడికల్ డివైజెస్ పార్క్‌లో సహజానంద్ మెడికల్ టెక్నాలజీ సంస్థ ఆసియాలోనే అతిపెద్ద స్టంట్‌ల యూనిట్ తయారీకేంద్రాన్ని ఏర్పాటుచేసిందన్నారు. జీనోమ్ వ్యాలీలో బీ హబ్‌ను ఏర్పాటుచేస్తామని గతంలో ప్రకటించామని, దీని ఏర్పాటులో కేంద్రప్రభుత్వ బయోటెక్నాలజీ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం కావడానికి ముందుకొచ్చిందని తెలిపారు. రాబోయే రెండునెలల్లో ఈ ప్రాజెక్టు ప్రారంభమవుతుందని చెప్పారు.



కార్ల్‌హెచ్ జూన్‌కు జీనోమ్‌వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును అందజేస్తున్న మంత్రి కేటీఆర్



సోమవారం హెచ్‌ఐసీసీలో బయోఏషియా-2020 సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ప్రొఫెసర్ పీటర్‌పియట్, కిరణ్‌మజుందార్‌షా, జయేశ్‌రంజన్, మహిమా దాట్ల

### కీలకం కానున్న ఫార్మా సిటీ

లైఫ్‌సైన్సెస్ గ్రిడ్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వ అత్యంత కీలకమైన అంశాల్లో హైదరాబాద్ ఫార్మాసిటీ ఒకటని మంత్రి కేటీఆర్ తెలిపారు. హెచ్‌పీసీ గ్లోబల్ బెంచ్‌మార్క్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఫార్మాసిటీకి అవసరమైన అనుమతులన్నీ ఇప్పటికే వచ్చాయని.. కేంద్రం నిమ్జ్ హోదాను ఇచ్చిందని తెలిపారు. హెల్త్‌కేర్ రంగంలో డిజిటల్ మెడిసిన్ విధానంలో హైదరాబాద్‌కు మంచి అవకాశాలున్నాయని.. ఈ రంగంలో నోవార్టిస్ సంస్థ ముఖ్యపాత్ర పోషిస్తున్నదని అన్నారు. ఈ సంస్థకు హైదరాబాద్ ముఖ్యమైన ప్రాంతంగా ఉన్నదని, ఇక్కడ దాదాపు 5 వేల మంది పనిచేస్తున్నారని తెలిపారు. భారత్‌లో స్విట్జర్లాండ్ రాయబారి అండ్రూస్ బావుమ్ మాట్లాడుతూ బయోఏషియా సదస్సులో అధికారిక భాగస్వామి కావడం గర్వంగా ఉన్నదన్నారు. ఇన్నోవేషన్‌రంగంలో తెలంగాణ విశేషకృషి చేస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ బిర్యానీ తిన్నానని, చాలా బాగున్నదని ప్రశంసించారు. సిన్‌జన్ సంస్థ హైదరాబాద్ ఫెసిలిటీ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. బయోఏషియా సదస్సు నివేదికను విడుదలచేశారు. కార్యక్రమంలో బయోఏషియా అడ్వైజరీ బోర్డు సభ్యుడు బాలసుబ్రమణ్యం, బయోఏషియా అంతర్జాతీయ అడ్వైజర్ అజిత్‌శెట్టి, బయోకాన్ ఇండియా చైర్మన్ కిరణ్ మజుందార్‌షా, రెడ్డిల్యాబ్స్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, సుబోధ్ దేశ్‌ముఖ్, పీటర్ పియట్, అజిత్‌శెట్టి, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, బయోఏషియాసీఈవో శక్తినాగప్పన్ పాల్గొన్నారు.

### జీనోమ్ వ్యాలీలో మొక్కలు నాటిన కేటీఆర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/శామీర్‌పేట:** ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ శామీర్‌పేట మండలం తుర్కపల్లి సమీపంలోని జీనోమ్ వ్యాలీలో మొక్కలు నాటారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లి సమీపంలోని జీనోమ్ వ్యాలీలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీ, టైఫాయిడ్ అడ్వాన్స్ వ్యాక్సిన్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బయోలాజికల్ ఈ. లిమిటెడ్ (బీఇ) మేనేజింగ్ డైరెక్టర్ మహిమా దట్ల తదితరులు పాల్గొన్నారు.

### స్విట్జర్లాండ్ వర్సిటీతో వీహబ్ ఒప్పందం

బయోఏషియా సదస్సు ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం రాష్ట్రానికి చెందిన వీహబ్.. స్విట్జర్లాండ్‌లోని పురాతన బేసన్ వర్సిటీ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, ఫార్మా, హెల్త్‌కేర్ తదితరరంగాల్లో ఇరు దేశాలకు చెందిన మహిళలు చేపట్టిన స్టార్టప్‌లకు సహకారం అందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందంపై మంత్రి కేటీఆర్ సమక్షంలో.. వీహబ్ సీఈవో దీప్తి రావుల, బేసల్‌వర్సిటీ హెడ్ క్రిస్టియన్ ఎలియాజ్ స్నేడర్ సంతకాలు చేశారు. స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం, ఉత్పత్తులకు విశ్వవ్యాప్త మార్కెటింగ్ కల్పించడం, ప్రత్యేక శిక్షణ ద్వారా ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడం, అత్యుత్తమ ప్రమాణాలను అందిపుచ్చుకోవడంపై కలిసి పనిచేస్తాయి. కార్యక్రమంలో స్విట్జర్లాండ్ రాయబారి ఆండ్రియాస్ బామ్, కాన్సులేట్ జనరల్ సెబాస్టియన్ హగ్, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, బయోకాన్ ఇండియా చైర్మన్ కిరణ్ మజుందార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడ్రోజులపాటు పొడి వాతావరణం

స్వల్పంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వాయవ్యం నుంచి ఆగ్నేయం వైపు పవనాల దిశ మారడంతో గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పగటిపూట ఎండలు తీవ్రమవుతున్నప్పటికీ, రాత్రిపూట చలిగాలులు వీస్తున్నాయి. రాగల మూడ్రోజుల వరకు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. సోమవారం సాయంత్రం 5.30 గంటల వరకు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 33.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.5 డిగ్రీలు, గాలిలో తేమ 31శాతంగా నమోదైంది.

## మార్చి 6 నుంచి డీఎల్ఈడీ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ) ప్రథమ సంవత్సరం లెసన్ టీచింగ్ ప్రాక్టీస్ 2019-21 బ్యాచ్ పరీక్షలను మార్చి ఆరో తేదీ నుంచి 21 వరకు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇందుకు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఏర్పాట్లుచేయాలని సూచించారు.

## నేడు చర్లపల్లిలో శాటిలైట్ టెర్మినల్‌కు శంకుస్థాపన

హాజరుకానున్న రైల్వే మంత్రి పీయూష్‌గోయల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద శాటిలైట్ టెర్మినల్ నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. యర్రగుంట్ల- నంద్యాల స్టేషన్, గుంతకల్లు- కల్లూరు లైన్ల విద్యుద్దీకరణ పనులను రిమోట్ ద్వారా ప్రారంభించనున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని 427 రైల్వేస్టేషన్లలో నెలకొల్పిన ఫ్రీ వైఫై సౌకర్యాన్ని జాతికి అంకితం చేయనున్నారు.

## అథర్‌సిన్హా బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హాను రాష్ట్ర ప్రభుత్వం బదిలీచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయనను జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాల్లో పేర్కొన్నారు.

## జీవోల అందుబాటుపై కౌంటర్ దాఖలుచేయండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ నెల 28వ తేదీలోగా కౌంటర్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం హైకోర్టు ఆదేశించింది. గతంలోనే కౌంటర్ దాఖలుచేయాలని సూచించినా ఆలస్యం కావడంపై అసహనం వ్యక్తంచేసింది.

## మార్చి 15న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏఐవైఎఫ్ 16వ జాతీయ మహాసభలను హైదరాబాద్‌లో మార్చి 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్ తిరుమలై రామన్ వెల్లడించారు. సోమవారం మహాసభల పోస్టర్లను రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తదితరులతో కలిసి తిరుమలై రామన్ ఆవిష్కరించారు.

# బడి కోసం 70 లక్షల విరాళం



సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌కు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న పార్టీ శ్రేణులు

## ఉదారత చాటుకొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

**బాలానగర్:** శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన పునర్నిర్మాణానికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ భూరి విరాళం అందజేశారు. నిర్మాణపనులు చేపట్టేందుకు తన జేబు నుంచి రూ.70 లక్షలు అందజేసి ఉదారత చాటుకొన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొన్నది. పాత భవనం స్థానంలో కొత్తది నిర్మించే పనులకు స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీనగర్‌లో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌ను కోరగా.. సానుకూలంగా స్పందించి రూ.70 లక్షలు కేటాయించడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం తీసుకొంటున్న సాహసోపేతమైన నిర్ణయాలకు తాను కూడా కట్టుబడి ఉన్నానని చెప్పారు.

# విద్యార్థులకు 'హెల్త్ ప్రొఫైల్' కార్డులు

- టీఆర్‌ఎస్ నేత రాజశేఖర్‌రెడ్డి వినూత్న కార్యక్రమం
- ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు అభినందనీయం
- ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మేడ్చల్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హెల్త్‌కార్డులను అందజేస్తున్న ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, టీఆర్‌ఎస్ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

**మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం రోజున టీఆర్‌ఎస్ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మేడ్చల్‌లోని 49 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ హెల్త్‌ప్రొఫైల్ కార్డులను అందజేశారు. సోమవారం మేడ్చల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, మంత్రి మల్లారెడ్డి విద్యార్థులకు హెల్త్‌ప్రొఫైల్ కార్డులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, 36 అంశాలపై హెల్త్‌ప్రొఫైల్‌ను రూపొందించి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమ వివరాలను త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి వివరిస్తానని చెప్పారు. కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఆధునాతన సాంకేతికతతో తక్కువ సమయంలోనే ఎక్కువ పరీక్షలను పటిష్ఠంగా చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. 70 సెకన్లలో 7-8 రకాల వైద్యపరీక్షలు చేసే వీలున్నదన్నారు. మేడ్చల్ ప్రభుత్వ పాఠశాల దేశంలోనే ప్రప్రథమంగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కలిగిన పాఠశాలగా కీర్తిపొందుతుందని పేర్కొన్నారు. మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్డు ద్వారా విద్యార్థి మెడికల్ రికార్డును ఒక్కక్లిక్‌తో తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, డీఈవో విజయకుమారి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికలకు కసరత్తు

- 9 డీసీసీబీ, 9 డీసీఎంఎస్‌లకు జరుగనున్న ఎన్నిక
- 20న నోటిఫికేషన్.. 28, 29 తేదీల్లో ఎన్నికలు?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్యాక్స్ ఎన్నికలు ముగియడంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల ఎన్నికల నిర్వహణపై సహకారశాఖ కసరత్తు ప్రారంభమైంది. ఓటర్ల జాబితా రూపకల్పనకు అనుసరించాల్సిన విధానాలపై జిల్లా సహకారశాఖ అధికారులతో సమావేశమైన సహకారశాఖ కమిషనర్ పలు సూచనలు చేసినట్టు సమాచారం. రాష్ట్రంలోని 9 డీసీసీబీ, 9 డీసీఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. అంతా సవ్యంగా సాగితే ఈ నెల 28, 29 తేదీల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది. ప్రతి డీసీసీబీలో 20 మంది డైరెక్టర్లు, డీసీఎంఎస్‌లో 10 మంది డైరెక్టర్లు ఉంటారు. డీసీసీబీలో 14 మంది డైరెక్టర్లను ప్యాక్స్ చైర్మన్లు ఎన్నుకోగా.. మరో ఆరుగురిని ఇతర సహకార సంఘాల చైర్మన్లు ఎన్నుకుంటారు. డీసీఎంఎస్‌లో ఆరుగురిని ప్యాక్స్ చైర్మన్లు, నలుగురిని ఇతర సహకార సంఘాల చైర్మన్లు ఎన్నుకుంటారు. డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్మన్లు టెస్కాబ్, మార్క్‌ఫెడ్ చైర్మన్లను ఎన్నుకుంటారు.

# శివరాత్రికి అందుబాటులో కాళేశ్వర గంగ

ఈ నెల 21 వరకు బరాజ్‌లో 99 మీటర్ల మేర నిల్వ నిర్వహణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ బరాజ్ (మేడిగడ్డ) నుంచి కొనసాగుతున్న గోదావరి జలాల ఎత్తిపోత ఇంకా కొనసాగుతున్నది. మూడ్రోజుల కిందట పూర్తిస్థాయిలో 11 మోటర్లను నడిపిన అధికారులు.. తాజాగా వాటిని ఐదింటికి తగ్గించారు. సరస్వతి బరాజ్ (అన్నారం) నిండుకుండలా మారింది. ఈ నెల 21న మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం లక్ష్మీ బరాజ్‌లో 99 మీటర్ల స్థాయిలో నీటి నిల్వను నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. మరోవైపు సరస్వతి బరాజ్‌లోనూ నిల్వ పూర్తిస్థాయికి చేరుకొన్నది. దీంతో సరస్వతి పంపుహౌజ్ (సిరిపురం) ద్వారా పార్వతి బరాజ్‌కు (సుందిల్ల) తరలించనున్నారు. పార్వతి పంపుహౌజ్ (గోలివాడ)లోనూ మోటర్లను ప్రారంభించి జలాలను ఎల్లంపల్లి జలాశయానికి తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.

### లోకం పోకడ




మా చుట్టూ ఇంత పెద్ద గోడ కట్టే రిస్కు ఎందుకు సారూ? ట్రంప్ వచ్చాక ఆయన చుట్టే ఓ గోడ కట్టేస్తే చాలు గదా!

# మద్దతు ధరకు కందులు కొంటాం

మొదటిపేజీ తరువాయి...



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

సహకరించే అధికారులకు జైలు తప్పదని హెచ్చరించారు. సరిహద్దు రాష్ట్రాల వద్ద నిఘా పెంచాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజైన ఫిబ్రవరి 17ను రైతు పర్వదినంగా భావిస్తూ.. రాష్ట్రంలో రైతులు సంబురాలు చేసుకుంటున్నారని మంత్రి చెప్పారు. దేశంచూపుమొత్తం తెలంగాణ రైతువైపు, తెలంగాణ వ్యవసాయం వైపు ఉన్నదని.. కేసీఆర్ చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయాల అమలే ఇందుకు కారణమన్నారు. కృష్ణా, గోదావరి జలాలను బీడుభూములకు మలిపి రైతాంగానికి సాగునీరు అందించారని చెప్పారు. కందిని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రం మద్దతు కోరినట్టు తెలిపారు. రూ.5,800 క్వింటాల్ చొప్పున 47,500 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు నాఫెడ్ అనుమతించిందన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్రం ప్రగల్భాలు పలుకుతున్నదని ఎద్దేవాచేశారు. విదేశీ మారకద్రవ్యం పెంచుకునే పసుపుపంటకు ప్రత్యేక బోర్డును ఏర్పాటులో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రైతు సానుకూల నిర్ణయాలతో ముందుకువెళ్తున్న తెలంగాణకు కేంద్రం సహకరించడంలేదని మండిపడ్డారు. సహకార ఎన్నికల్లో స్ఫూర్తిదాయక తీర్పునిచ్చిన తెలంగాణ రైతాంగానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నామన్నారు.

## 25 నుంచి వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేద పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు తిరుమలలో అఖిల భారత వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుపతి, తిరుమల దేవస్థానం (టీటీడీ) ప్రకటించింది. ఈ సదస్సులో 54 వేద శాఖలకు సంబంధించిన పరీక్షలు ఉంటాయని, ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనవారికి 5 గ్రాముల బంగారు డాలర్, ద్వితీయశ్రేణిలో నిలిచినవారికి 10 గ్రాముల వెండి డాలర్‌ను బహూకరిస్తామని టీటీడీ పేర్కొన్నది.

### 20న మహా సరస్వతియాగం

ధర్మ ప్రచారంలో భాగంగా టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్, విద్యా విభాగం సంయుక్తంగా ఈ నెల 20వ తేదీన తిరుపతిలో మహాసరస్వతియాగం నిర్వహిస్తున్నట్టు టీటీడీ ప్రకటించింది. 10 వేల మంది విద్యార్థులతో ఈ యాగం జరుగుతుందని వివరించింది.

# విద్యార్థుల జీవితాలతో ఆటలా?

- గుర్తింపులేని కాలేజీలపై చర్యలు తీసుకోండి
- ఇంటర్‌బోర్డు అధికారులకు హైకోర్టు ఆదేశాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అఫిలియన్‌లేని జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లకు అవకాశమిచ్చి, విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని హైకోర్టు వ్యాఖ్యానించింది. అఫిలియేషన్ లేకుండానే ప్రవేశాలు కల్పించిన కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుండా కాలేజీలు కొనసాగిస్తున్నాయని దాఖలైన పిల్‌పై చీఫ్‌జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కళాశాలల్లో తనిఖీలు చేపట్టినట్టు నివేదికను హైకోర్టుకు ఇంటర్ బోర్డు సమర్పించింది. నారాయణ, శ్రీచైతన్యకు చెందిన 45 కాలేజీలకు గుర్తింపు లేదని తెలిపారు. ఫైర్ ఎన్వోసీలేదని, నిబంధనలు పాటించకుండా తరగతులు కొనసాగిస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది అనుముల జగన్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. గుర్తింపు లేకుండా ప్రవేశాలకు ఎలా అనుమతి ఇచ్చారని, 45 కాలేజీల్లోని పదివేల మంది భవిష్యత్ ఏమిటని, వారి సర్టిఫికెట్లు ఎలా చెల్లుబాటవుతాయని ప్రశ్నించింది. అనుమతులు లేకుండా ప్రవేశాలు కల్పించిన ఓ కేసులో ఒక్కొక్క విద్యార్థికి రూ.పదిలక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేసింది. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే కాలేజీలపై చర్యలకు సంబంధించిన ఆధారాలతో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదావేసింది.

### ముందస్తు అడ్మిషన్లు వద్దు: ఇంటర్‌బోర్డు

ఇంటర్ నోటిఫికేషన్ విడుదలకాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపట్టవద్దని ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ సోమవారం ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే, అడ్మిషన్లు చెల్లవని స్పష్టంచేశారు. గుర్తింపు పొందిన కాలేజీల జాబితాలు విడుదలకాకముందే అడ్మిషన్లు తీసుకోవద్దని విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచించారు.

# కశ్మీర్‌లో కార్మికుల సమ్మె

- వేతన బకాయిల కోసం 11 రోజులుగా సమ్మెలో ఆరోగ్య సిబ్బంది

**జమ్ము, ఫిబ్రవరి 17:** జమ్ముకశ్మీర్ అంటే.. నిత్యం ఉగ్రవాదులు.. తీవ్రవాదుల దాడులు.. ఎన్‌కౌంటర్లు.. ఉద్రిక్త పరిస్థితులు..ఇవే కనిపిస్తుంటాయి.. వినిపిస్తుంటాయి. కానీ అక్కడ కూడా డిమాండ్ల సాధన కోసం కార్మికులు సమ్మె బాట పట్టారు. వివిధ డిమాండ్లను పరిష్కరించాలని జమ్ముకశ్మీర్‌లోని ప్రజా ఆరోగ్య ఇంజినీరింగ్ (పీహెచ్‌ఈ) శాఖలోని దినసరి కార్మికులు సమ్మె చేస్తున్నారు. వారి సమ్మె సోమవారానికి 11వ రోజుకు చేరుకున్నది. తమ పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించి, ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో వారు సమ్మె చేస్తున్నారు. ఆందోళనకారులను ఉద్దేశించి సీపీఎం సీనియర్ నేత యూసుఫ్ తరిగామి మాట్లాడుతూ తమ పూర్తి మద్దతు ప్రకటించారు. సమస్యల పరిష్కారానికి లెఫ్టినెంట్ గవర్నర్ జీఎస్ ముర్ము జోక్యం చేసుకోవాలన్నారు.

# పర్యావరణానికి హాని లేని అభివృద్ధి

- వలస వచ్చే వన్యప్రాణుల పరిరక్షణలో పరస్పర సహకారం
- కాప్ సదస్సునుద్దేశించి ప్రధాని మోదీ ఉద్ఘాటన



**న్యూఢిల్లీ/గాంధీనగర్:** తమ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. పారిస్ వాతావరణ ఒప్పందానికి అనుగుణంగా చర్యలు తీసుకునే అతికొద్ది దేశాలలో భారత్ కూడా ఒకటని తెలిపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో సోమవారం వలస జాతుల వన్యప్రాణుల పరిరక్షణపై కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) 13వ సదస్సును ఉద్దేశించి మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానం, హరిత అభివృద్ధి వంటి విలువల ఆధారంగా వాతావరణ మార్పుల సవాళ్లను భారత్ ఎదుర్కొంటున్నదని చెప్పారు. వలస వచ్చే వన్యమృగాలు లేక పక్షులు ఖండాలను అనుసంధానం చేస్తాయని, అందరూ కలిసి వాటిని ఆహ్వానించాలన్నారు. భారత్‌లోని అనేక రక్షిత ప్రాంతాలు ఇతర దేశాల సరిహద్దులతో కలిసి ఉన్నాయని, ఆయా ప్రాంతాలలో వన్యజీవుల పరిరక్షణలో పరస్పర సహకారం వల్ల సానుకూల ఫలితాలు వెలువడవచ్చని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోలీసు కస్టడీలో రువాండా విప్లవ కవి మృతి



**కిగాలి:** ప్రభుత్వ నిషేధానికి గురైన ప్రఖ్యాత రువాండా విప్లవ కవి, గాయకుడు కిజిటో మిహిగో పోలీసు కస్టడీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే, అతను ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని ఆ దేశ పోలీసులు సోమవారం పేర్కొన్నారు. కిజిటో మిహిగో కవి, విప్లవ గాయకుడు. రువాండా అధ్యక్షుడు పాల్ కగామే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు గీతాల్ని ఆలపించేవాడు. దీంతో ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలతో అక్కడి ప్రభుత్వం ఆయన్ని 2015 లో జైలుకు పంపించింది. 2018 లో జైలు నుంచి బయటకొచ్చిన మిహిగోని... దేశం విడిచి పారిపోతున్నాడన్న కారణంతో మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో కస్టడీలో ఉన్న మిహిగో ఆత్మహత్యకు పాల్పడ్డట్టు పోలీసులు తెలిపారు.



# భూసార కార్డులతో అధికాదాయం



- పంటను బట్టి ఎకరాకు రూ.30,000 వరకు..
- తగ్గిన పెట్టుబడి.. పెరిగిన ఉత్పాదకత
- కేంద్ర ప్రభుత్వ అధ్యయనంలో వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** భూసార కార్డుల (సాయిల్ హెల్త్ కార్డ్) వినియోగంతో రైతుల ఆదాయం గణనీయంగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ కార్డుల వినియోగం వల్ల పెట్టుబడి వ్యయం భారీగా తగ్గి, ఉత్పాదకత పెరుగడం వల్ల రైతులకు పంటను బట్టి ఎకరాకు రూ.30,000 వరకు ఆదాయం పెరిగినట్లు తేలింది. జాతీయ ఉత్పాదకత మండలి (ఎన్‌పీసీ) దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లోని 76 జిల్లాల్లో ఈ అధ్యయనం నిర్వహించింది. భూసార కార్డుల పంపిణీ పథకాన్ని ప్రారంభించి ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా అధ్యయన ఫలితాలను తాజాగా విడుదల చేసింది. సంబంధిత నేలలో భూసార పరీక్షల అనంతరం ఆ నేల ఏ పంటకు అనువుగా ఉంటుంది, భూసారం పెరుగాలంటే ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలి అన్న వివరాలు భూసార కార్డులో ఉంటాయి. భూసార కార్డులు లేనప్పుడు తాము తగిన మోతాదులో ఎరువులు వాడక పోవడం వల్ల ఉత్పాదకతపై ప్రభావం పడినట్లు రైతులు తెలిపినట్లు ఆ అధ్యయనం వెల్లడించింది. భూసార కార్డుల వినియోగం వల్ల కంది పంటపై ఎకరాకు రూ.25,000-30,000, పత్తిపై 12,000, వరిపై 4,500, బంగాళదుంపపై 3,000 ఆదాయం పెరిగినట్లు తెలిపింది. భూసార కార్డుల్లో సిఫార్సు చేసిన మేరకు ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గినట్లు అధ్యయనంలో తేలింది. వరిపై 16-25 శాతం, పప్పులపై 10-15 శాతం, నూనెగింజలపై 10-15 శాతం, పత్తిపై 25 శాతం వ్యయం తగ్గినట్లు తెలిపింది. అలాగే వరి దిగుబడులు 10-20 శాతం పెరుగగా, గోధుమ, జొన్నలు 10-15 శాతం, పప్పులు 10-30 శాతం, నూనె గింజలు 40 శాతం, పత్తి 10-20 శాతం ఉత్పాదకత పెరిగినట్లు వెల్లడించింది.

# ఆర్మీలో 'షీ' కమాండర్స్



- శారీరక లక్షణాల ఆధారంగా సైన్యంలో మహిళలపై వివక్ష తగదు
- వారు కమాండ్ విధులను సమర్థంగా నిర్వహించగలరు
- మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ హోదా కల్పించండి
- కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు
- స్త్రీల పట్ల ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని హితవు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: అన్ని రంగాల్లో ఆకాశమే హద్దుగా ఎదుగుతున్న మహిళలు.. సైన్యంలోనూ అత్యున్నత స్థానానికి చేరుకునే సమయం వచ్చింది. భారతదేశం మహిళల సారథ్యంలో అంగారకుడి వరకు ఉపగ్రహాన్ని పంపినా.. ఆర్మీలో మాత్రం సమాన అవకాశాలు అందని దుస్థితి. పైగా కమాండర్లుగా పనిచేయడానికి వారి శారీరక సామర్థ్యం సరిపోదంటూ అవమానాలు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ లింగవివక్షకు సుప్రీంకోర్టు చరమగీతం పాడింది. సైన్యంలో మహిళలు పురుషులతో సమానంగా అత్యున్నత స్థాయికి ఎదిగేలా కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల్లోగా 'శాశ్వత కమిషన్' హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**మూడు నెలల్లోగా హోదా ఇవ్వండి**

సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్ కల్పిస్తూ 2010లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సోమవారం జస్టిస్‌లు డీవై చంద్రచూడ్, జస్టిస్ అజయ్ రస్తోగితో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. శారీరక పరిమితులు, సామాజిక నిబంధనల వల్లే మహిళలను కమాండ్ పోస్టుల్లో నియమించడం లేదని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది. ఈ వాదనపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. మహిళా అధికారుల పట్ల ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని కేంద్రానికి హితవు పలికింది. సైన్యంలో లింగవివక్షకు చరమగీతం పాడాలని స్పష్టం చేసింది. మహిళలను కమాండ్ పోస్టుల్లో నియమించకుండా చట్టబద్ధమైన నిషేధమేమీ లేదని గుర్తుచేసింది. విధానపరమైన నిర్ణయం తీసుకుంటే సరిపోతుందని తెలిపింది. కోర్టులు ఇచ్చిన తీర్పును అమలుచేయడంపై కేంద్ర ప్రభుత్వం దశాబ్దకాలంగా అశ్రద్ధ చూపిందని అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఢిల్లీ హైకోర్టు తీర్పుపై ఎలాంటి స్టే ఇవ్వబోమని సుప్రీంకోర్టు 2011 సెప్టెంబర్ 2న స్పష్టం చేసింది. అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులకు తగిన గౌరవం ఇవ్వలేదు' అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. సైన్యంలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు ఇవ్వడం ఒక కీలక పరిణామమని, కేంద్రం వెంటనే ఢిల్లీ హైకోర్టు తీర్పును అమలు చేయాలని సూచించింది. ప్రస్తుతం సైన్యంలో 1,653 మంది మహిళా అధికారులు ఉన్నారని, ఇది సైన్యంలోని మొత్తం అధికారుల్లో 3.89 శాతమని పేర్కొన్నది. సర్వీస్‌తో సంబంధం లేకుండా అర్హులందరికీ శాశ్వత కమిషన్ కల్పించాలని ఆదేశించింది. ఇందుకు మూడు నెలలు గడువు విధించింది.

**సైన్యానికి గొప్ప గౌరవం తీసుకొచ్చారు**

స్వాతంత్ర్యం అనంతరం గత 70 ఏండ్లుగా ఎంతో మంది మహిళలు సైన్యంలో పనిచేశారని, దేశానికి గొప్ప గౌరవం తీసుకొచ్చారని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొన్నది. వారు సమర్థంగా విధులు నిర్వహించి ఎన్నో పతకాలను గెలుచుకున్నారని, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళంలో పనిచేసినందుకు అవార్డులను సైతం అందుకున్నారని గుర్తుచేసింది. శారీరక లక్షణాల ఆధారంగా వారిపై వివక్ష చూపడం, అవకాశాలను దూరం చేయడం తప్పు అని వ్యాఖ్యానించింది.

**సామర్థ్యం సరిపోదు.. మేము సమర్థులమే!**

అంతకుముందు.. కేంద్ర ప్రభుత్వం, మహిళా సైనికాధికారులు తమ వాదనలను లిఖిత పూర్వకంగా సుప్రీంకోర్టుకు సమర్పించాయి. కమాండర్ పోస్టుల్లో మహిళలను నియమించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరణ ఇచ్చింది. శారీరక సామర్థ్యం, సామాజిక పరిమితులతోపాటు అనేక కారణాలు అడ్డంకులుగా మారాయని పేర్కొన్నది. అంతేకాకుండా మహిళలను అధికారులుగా అంగీకరించడానికి సైన్యంలోని కొందరు పురుషులు సిద్ధంగా లేరని పేర్కొన్నది. దీనిపై మహిళా సైనికాధికారులు కౌంటర్ దాఖలు చేశారు. కేంద్రం వాదనలు తిరోగమనాన్ని సూచిస్తున్నాయని, గణాంకాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. దాదాపు 28 ఏండ్లుగా తాము ఆయుధాలు చేపట్టి పోరాడుతూ, శక్తిసామర్థ్యాలను నిరూపించుకున్నామన్నారు. తమకు అప్పగించిన ఏ పనిలోనూ వెనుకంజ వేయలేదని గుర్తుచేశారు.

సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే కోర్టు బయట ఉన్న పలువురు మహిళా సైనికాధికారులు సంబురాలు చేసుకున్నారు. ఈ తీర్పు దేశంలోని మహిళలందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. న్యాయవాది మీనాక్షి లేఖి తమ తరపున ఉచితంగా వాదనలు వినిపించి గెలిపించారని కొనియాడారు.



సుప్రీంకోర్టు ఎదుట విజయసంకేతం చూపుతున్న మహిళా సైనికాధికారులు

## ఏమిటీ శాశ్వత కమిషన్?

సైన్యంలో చేరే సమయంలో రెండు ఆప్షన్లు ఉంటాయి. అవే పర్మనెంట్ కమిషన్ (పీసీ) లేదా శాశ్వత కమిషన్, షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ). శాశ్వత కమిషన్‌లో చేరేవారికి పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ లేదా డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ, గయలోని ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీలో శిక్షణ ఇస్తారు. వీరు కనీసం 20 ఏండ్లు సైన్యంలో పనిచేయాలి. 60 ఏండ్ల వయసు వచ్చే వరకు కొనసాగవచ్చు. వయసు, విద్యార్హత, అనుభవం ఆధారంగా పదోన్నతులు ఉంటాయి. సైన్యాధిపతి, రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) స్థాయి వరకు చేరుకునే అవకాశం ఉంటుంది.

**ఎస్ఎస్‌సీలో..**

ఎస్ఎస్‌సీలో చేరేవారు కనీసం పదేండ్లు సైన్యంలో పనిచేయాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 14 ఏండ్లు మాత్రమే సర్వీస్‌లో ఉంటారు. ఆ తర్వాత తప్పనిసరిగా పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. వీరు గరిష్ఠంగా బ్రిగేడియర్ స్థాయి వరకు మాత్రమే చేరుకోవచ్చు. ఇంకా సైన్యంలో కొనసాగాలనుకుంటే.. పదేండ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత శాశ్వత కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మహిళలకు సైన్యంలో ఎస్ఎస్‌సీలో మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. దీంతో వారు ఉన్నత స్థానాలకు చేరుకోలేకపోతున్నారు.

# చిన్నప్పుడు సంగీతం టీచర్ వేధించాడు!

- అమెరికా నుంచి వచ్చి ఫిర్యాదు

**ముంబై:** పదేండ్ల కిందట తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఒక యువతి చేసిన ఫిర్యాదుమేరకు ముంబైలో 55 ఏండ్ల వయసున్న సంగీతం టీచర్‌ను పోలీసులు అరెస్టుచేశారు. 2007 నుంచి 2010 మధ్యకాలంలో ముంబై శివారుప్రాంతమైన అంధేరిలోని బాలిక నివాసంలో ఆమెకు నిందితుడు సంగీత పాఠాలు నేర్పేవాడు. అప్పుడు ఆమె వయసు తొమ్మిదేండ్లు. ఆమెపై నిందితుడు లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. 12 ఏండ్ల వయసులో బాలిక ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లింది. ప్రస్తుతం ఆమెకు 21 ఏండ్లు. ఆదివారం స్వదేశానికి వచ్చిన ఆమె.. నిందితుడిపై ఫిర్యాదు చేశారు. దీంతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసి నిందితుడిని ఆదివారం అరెస్టు చేశామని ఓషివారా ఇన్‌స్పెక్టర్ దయానంద్ బంగర్ తెలిపారు. నిందితుడికి స్థానిక న్యాయస్థానం సోమవారం బెయిల్ మంజూరు చేసిందన్నారు. అతడు మిగతా పిల్లలపైనా వేధింపులకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# నిరసన తెలుపండి.. కానీ..

- ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు
- షాహీన్‌బాగ్ నిరసనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను వ్యతిరేకిస్తూ ఢిల్లీ షాహీన్‌బాగ్‌లో చేపడుతున్న నిరసనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'నిరసన తెలియజేయడం ప్రజల ప్రాథమిక హక్కు. అయితే రోజుల తరబడి రోడ్లను ఆక్రమించి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఉండకూడదు. ఈ విషయంలో సమతూకం అవసరం. ప్రజలు రోడ్లపై నిరసనలు తెలుపడం మొదలెడితే ఏం జరుగుతుందో ఆలోచించండి. అభిప్రాయాలను వ్యక్తీకరించడం ద్వారానే ప్రజాస్వామ్యం పనిచేస్తుంది. కానీ, అందుకు కొన్ని హద్దులు కూడా ఉంటాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. సీఏఏను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని షాహీన్‌బాగ్ ప్రాంతంలో గత రెండు నెలలుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. షాహీన్‌బాగ్ రోడ్లపై నిరసన తెలుపుతున్న ఆందోళనకారులను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని, వారు ఇతర ప్రాంతానికి వెళ్లేలా చర్చలు జరుపాలని దాఖలైన పిటిషన్లను జస్టిస్ ఎస్కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా షాహీన్‌బాగ్ నిరసనకారులతో మాట్లాడేందుకు సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సాధన రామచంద్రన్‌ను మధ్యవర్తులుగా సుప్రీంకోర్టు నియమించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగని చోట నిరసన తెలిపేలా నిరసనకారులను ఒప్పించాలని సూచించింది. ఒకవేళ ఫలితం కనిపించనిపక్షంలో నిర్ణయాధికారం అధికారులకే వదిలేస్తామని ధర్మాసనం పేర్కొన్నది.

## సైన్యంలో భారీ సంస్కరణలు!

- రెండు నుంచి ఐదు థియేటర్ కమాండ్స్ ఏర్పాటు
- సీడీఎస్ బిపిన్ రావత్ వెల్లడి



**న్యూఢిల్లీ:** పశ్చిమ, ఉత్తర సరిహద్దుల్లో భవిష్యత్తులో ఎదురయ్యే భద్రతా సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు రెండు నుంచి ఐదు థియేటర్ కమాండ్లను ఏర్పాటు చేయనున్నట్లు రక్షణ బలగాల అధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్- సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ సోమవారం వెల్లడించారు. 2022నాటికి తొలి థియేటర్ కమాండ్ అందుబాటులోకి రానుందని తెలిపారు. మిలిటరీలో చేపట్టబోయే భారీ సంస్కరణల ప్రణాళికలను ఆయన ఆవిష్కరించారు. జమ్ము కశ్మీర్‌లో భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా ఒక థియేటర్ కమాండ్‌ను నెలకొల్పనున్నట్లు చెప్పారు. నౌకాదళ తూర్పు, పశ్చిమ కమాండ్లను విలీనం చేసి కొత్తగా 'ద్వీపకల్ప కమాండ్'ను ఏర్పాటు చేయనున్నామని, 2021 చివరినాటికి దీనికి ఒక రూపు వచ్చే అవకాశం ఉన్నదని రావత్ తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఎదురయ్యే సవాళ్లను ఈ కమాండ్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతిపాదిత ఎయిర్ డిఫెన్స్ కమాండ్ వచ్చే ఏడాది మధ్యనాటికి రూపుదిద్దుకోనుందన్నారు. అమెరికా తరహాలో ప్రత్యేక శిక్షణ కమాండ్, అలాగే త్రివిధ దళాల్లో రవాణా తదితర అవసరాలకు కూడా మరో కమాండ్ ఏర్పాటుచేసేందుకు యోచిస్తున్నట్లు వివరించారు.

# మార్చి 3న ఉరి!



- నిర్భయ దోషులకు తాజా డెత్ వారంట్ జారీ
- చట్టపరమైన అవకాశాల వినియోగానికి ముగిసిన గడువు
- శిక్ష అమలు వాయిదాకు దోషుల కొత్త ఎత్తులు
- నిరాహారదీక్షకు దిగిన వినయ్, క్యురేటివ్ పిటిషన్ వేస్తానన్న పవన్, మళ్లీ క్షమాభిక్ష కోరుతానంటున్న అక్షయ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** నిర్భయ కేసులో దోషులకు మరణశిక్ష అమలుచేసేందుకు కోర్టు తాజాగా మరోమారు డెత్ వారంట్ జారీచేసింది. మార్చి 3న ఉదయం 6 గంటలకు నలుగురు దోషులను ఉరితీయాలని అదనపు సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా సోమవారం పేర్కొన్నారు. దోషులు ముఖేశ్‌కుమార్ సింగ్ (32), పవన్ గుప్తా (25), వినయ్‌కుమార్ శర్మ (26), అక్షయ్ కుమార్ (31)పై కోర్టు డెత్ వారంట్ జారీచేయడం ఇది మూడోసారి. శిక్షను వాయిదా వేయించేందుకు దోషులు పలు రకాల ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. చివరి నిమిషంలో ఒక కొత్త పిటిషన్ దాఖలు చేస్తుండటంతో శిక్ష అమలు వాయిదా పడుతూ వస్తున్నది.

దోషులకు డెత్ వారంట్లు జారీ చేయాలని కోరుతూ నిర్భయ తల్లిదండ్రులు, ఢిల్లీ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్లపై ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా దోషుల్లో ఒకడైన ముఖేశ్.. తన తరపున న్యాయవాది వృందా గ్రోవర్ వాదించరాదని చెప్పాడు. దీంతో న్యాయస్థానం న్యాయవాది రవి ఖాజీని నియమించింది. మరో దోషి వినయ్ తీహార్ జైలులో నిరాహారదీక్ష చేస్తున్నాడని అతని తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. జైలులో వినయ్‌పై దాడి జరిగిందని, తలకు గాయమైందని, దీంతో అతడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని చెప్పారు. అందువల్ల అతనికి మరణశిక్షను అమలు చేయరాదని అన్నారు. ఈ నేపథ్యంలో వినయ్ విషయంలో చట్టం ప్రకారం వ్యవహరించాలని తీహార్ జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. ఇక పవన్ తరపు న్యాయవాది మాట్లాడుతూ, సుప్రీంకోర్టులో క్యురేటివ్ పిటిషన్, రాష్ట్రపతి వద్ద క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేయాలనుకుంటున్నామని చెప్పారు. నలుగురు దోషుల్లో పవన్ మాత్రమే ఇంతవరకు క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేయలేదు, రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరలేదు. రాష్ట్రపతిని తాము మరోసారి క్షమాభిక్ష కోరనున్నామని అక్షయ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

**ముగిసిన గడువు**

ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన వారం రోజుల గడువు ముగిసిందని, దోషులకు సంబంధించి ఎటువంటి పిటిషన్ ఏ కోర్టులోనూ పెండింగ్‌లో లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీవ్ మోహన్ కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రయల్ కోర్టు మార్చి 3న నలుగురిని ఉరితీయాలని తాజా డెత్ వారంట్లు జారీ చేసింది.



మీడియాతో మాట్లాడుతున్న ఆశాదేవి

## ఈసారైనా ఉరితీస్తారని నమ్ముతున్నాం

- నిర్భయ తల్లిదండ్రుల ఆశాభావం

**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో దోషులను వచ్చే నెల 3న ఉరితీయాలంటూ ఢిల్లీలోని స్థానిక కోర్టు డెత్‌వారెంట్ జారీ చేయడంపై నిర్భయ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు. దోషులను ఈ సారైనా ఉరితీస్తారన్న నమ్మకం తమకు ఉన్నదన్నారు. నిర్భయ తల్లి ఆశాదేవి మాట్లాడుతూ ఉరిశిక్షపై మళ్లీ ఎలాంటి పిటిషన్లు దాఖలైనా వాటిని కోర్టు అనుమతించవద్దని విజ్ఞప్తి చేశారు. నిర్భయ తండ్రి బద్రినాథ్ సింగ్ స్పందిస్తూ డెత్ వారెంట్ జారీ కావడంపై సంతోషంగా ఉన్నదని, అయినా దోషులను ఉరితీసే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## 25 కిలోల బంగారం చోరీ

**లుధియానా:** పంజాబ్‌లోని లుధియానాలో ఐఐఎఫ్ఎల్ బ్యాంకు నుంచి దొంగలు దాదాపు 25-30 కిలోల బంగారం దోచుకెళ్లారు. సోమవారం ఉదయం ఐదుగురు దుండుగులు కారులో బ్యాంకుకు వచ్చారు. నలుగురు ముసుగులతో లోపలికి ప్రవేశించి సిబ్బందిని తాళ్లతో బంధించారు. వారి వద్ద నుంచి తాళాలు తీసుకొని 20 నిమిషాల్లో బంగారం మూటగట్టుకొని పరారయ్యారు.

## బ్రిటన్ ఎంపీ అడ్డగింత

**న్యూఢిల్లీ:** ఆర్టికల్ 370ని రద్దుచేయడాన్ని తప్పుబట్టిన బ్రిటన్ ఎంపీ డెబ్బీ అబ్రహం భారత్‌లో అడుగుపెట్టకుండా విమానాశ్రయ అధికారులు అడ్డుకున్నారు. తాను దుబాయ్ నుంచి ఢిల్లీకి రాగానే.. మీ వీసా రద్దయిందంటూ అధికారులు అడ్డుకున్నారని ఆమె ట్వీట్ చేశారు. తన వీసా గడువు ఈ ఏడాది అక్టోబర్ వరకు ఉన్నదని చెప్పారు.

## కుట్రతోనే సీఏఏ నిరసనలు

- రాష్ట్రపతికి ప్రముఖుల లేఖ

**న్యూఢిల్లీ:** సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌పై కొందరు తప్పుడుప్రచారం చేస్తున్నారని, ఇదంతా ఓ పథకం ప్రకారం సాగుతున్నదని 154 మంది ప్రముఖులు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. వీరిలో పలు రాష్ట్రాలకు చెందిన హైకోర్టుల మాజీ జడ్జీలు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మాజీ లెఫ్టినెంట్ జనరల్స్ ఉన్నారు. నిరసనలపై కేంద్రం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నార్సీ, ఎన్పీఆర్ అనేవి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉన్నాయని, సీఏఏను ఇప్పుడు తీసుకొచ్చారని చెప్పారు. వీటిని అమలు చేయాలని కోరారు.

## తొక్కిసలాటలో 20 మంది మృతి

**నియామి:** ఆఫ్రికాలోని నైజర్ దేశంలో జరిగిన తొక్కిసలాటలో 20 మంది మరణించారు. నైజర్ ఆగ్నేయ ప్రాంతంలోని శరణార్థులకు డిఫా పట్టణంలో సోమవారం ఆహారం, డబ్బు పంపిణీ చేస్తుండగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 20 మంది మరణించగా, 10 మంది గాయపడ్డారు.

## కశ్మీర్‌లో ఎన్నికలకు కసరత్తు

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిపే దిశగా కేంద్రం ముందడుగు వేసింది. అసెంబ్లీ నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరించేందుకు ఉన్నత స్థాయి కమిటీని నియమించనున్నది. సుప్రీంకోర్టు మాజీ జడ్జీ నేతృత్వంలోని ఈ కమిటీలో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ), జమ్ముకశ్మీర్ ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఈసీఐ తరపున ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్ర ఖరారయ్యారు. కశ్మీర్‌లో ప్రస్తుతం 107 నియోజకవర్గాలు ఉండగా.. విభజన చట్టం ప్రకారం 114కు పెంచాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో కొత్త నియోజకవర్గాల గుర్తింపు, హద్దుల నిర్ధారణ జరుపాలని కేంద్రం నిర్ణయించింది.

# బుర్కినాఫాసోలో హత్యాకాండ

- పాస్టర్ సహా 24 మంది కాల్చివేత

**ఔగాడౌగు, ఫిబ్రవరి 17:** పశ్చిమాఫ్రికా దేశం బుర్కినా ఫాసో యాఘా రాష్ట్రం పన్సీ పట్టణ పరిధిలో తీవ్రవాదులు మరోసారి హింసాకాండకు దిగారు. ఒక చర్చి పాస్టర్, కిడ్నాపైన ముగ్గురు వ్యక్తులతోపాటు 24 మందిని దారుణంగా కాల్చి చంపారు. చర్చికి నిప్పంటించారు. సుమారు 20 మంది సాయుధులు ఈ హత్యాకాండలో పాల్గొన్నారు. ప్రొటెస్టెంట్ చర్చికి సమీపంలో మహిళలు, పురుషులను వేరు చేసిన తర్వాత కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. అంతకుముందు దుకాణాల్లోని బియ్యం, వంట నూనెలను లూటీ చేశారని బౌండోర్ మేయర్ సిహన్రీ ఒసాంగోలా బ్రిగేడ్ వెల్లడించారు. తీవ్రవాదులు క్రైస్తవులను, ముస్లింలను మట్టుబెట్టారని భద్రతా అధికారులు తెలిపారు.

# చైనాకు భారత్ చేయూత

- ఔషధాలు, వైద్య పరికరాలతో వుహాన్‌కు త్వరలో వెళ్లనున్న విమానం
- తిరుగు ప్రయాణంలో భారతీయులతోపాటు పొరుగు దేశాల పౌరుల తరలింపు



ఐటీబీపీ కేంద్రం నుంచి విడుదలవుతున్న కరోనా అనుమానితులు

**బీజింగ్/హాంకాంగ్:** కరోనా వైరస్ (కోవిడ్-19)తో అల్లాడుతున్న చైనాకు వైద్య సాయం అందించేందుకు భారత్ ముందుకు వచ్చింది. చైనాలో కరోనా వైరస్ తీవ్రంగా ఉన్న వుహాన్ నగరానికి ఔషధాలు, వైద్య పరికరాలతో కూడిన ప్రత్యేక సహాయ విమానాన్ని పంపనుంది. ఈ విమానం తిరుగు ప్రయాణంలో భారతీయులతోపాటు ఇరుగుపొరుగు దేశాల వారినీ తీసుకు రానున్నట్లు భారత రాయబార కార్యాలయం సోమవారం తెలిపింది. తాజాగా ఆదివారం 105 మంది మృతితో చైనాలో కరోనాతో మొత్తం 1,770 మంది మరణించారు. కొత్తగా 2,048 మందికి ఈ వైరస్ సోకింది. దీంతో కోవిడ్-19తో బాధపడుతున్న వారి సంఖ్య 70,548 మందికి చేరింది. మరోవైపు హాంకాంగ్‌లో తాజాగా ఒకరి మృతితో మొత్తం మరణాల సంఖ్య 50కి చేరింది. కరోనా వైరస్ వల్ల టాయిలెట్ పేపర్ కొరత ఏర్పడనున్నదన్న వదంతుల నేపథ్యంలో ఒక సాయుధ ముఠా.. ఓ సూపర్ మార్కెట్ నుంచి టాయిలెట్ రోల్స్‌ను ఎత్తుకెళ్లారు. అయితే వాటిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జపాన్ తీరంలో నిలిపి ఉన్న క్రూయిజ్ నౌకలో మరో 99 మందికి కరోనా వైరస్ సోకినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయింది. దీంతో డైమండ్ ప్రిన్సెస్ నౌకలోని 454 మంది నావికులకు వైరస్ సోకినట్లు తేలింది.

## 40 ఏండ్లనాటి నవలలో 'కరోనా' ప్రస్తావన!

**న్యూఢిల్లీ:** చైనాతో పాటు ప్రపంచ దేశాలను వణికిస్తున్న ప్రాణాంతక కరోనా వైరస్ గురించి 40 ఏండ్ల కిందటే ఓ నవలా రచయిత ఊహించారు! అమెరికా రచయిత డీన్ కూంట్జ్ 1981లో రచించిన 'ది ఐస్ ఆఫ్ డార్క్‌నెస్' అనే థ్రిల్లర్ నవలలో వుహాన్ వైరస్ ప్రస్తావన ఉన్నది. దీన్ని ఒక జీవాయుధంగా చైనా శాస్త్రవేత్తలు వుహాన్ నగరంలోని ల్యాబొరేటరీలో సృష్టించినట్లు ఆయన తన నవలలో రాశారు. ఆ వైరస్‌కు వుహాన్-400గా పేరుపెట్టారు. ఇది మనుషులకు మాత్రమే వ్యాపించే ప్రమాదకర వైరస్ అని అందులో పేర్కొన్నారు. ఒక నగరాన్ని లేదా దేశాన్ని తుడిచిపెట్టేసేందుకు చైనా వుహాన్-400ను ఉపయోగించొచ్చని వివరించారు. డారెన్ ప్లైమౌత్ అనే నెటిజన్ ఆ నవలలోని పేజీని ట్విట్టర్‌లో షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది. కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ కూడా ఆ పేజీ ట్వీట్‌చేశారు.

# 2 కోట్ల పరిహారం ఇప్పించండి!

- కోర్టును ఆశ్రయించిన బాధిత జామియా విద్యార్థి
- స్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా గత డిసెంబర్ 15న ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీలో చేపట్టిన ఆందోళనల్లో భాగంగా పోలీసులు జరిపిన దాడుల్లో తాను గాయాలపాలయ్యానని, ఇందుకుగానూ తనకు రూ 2 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ జామియా వర్సిటీకి చెందిన షాయాన్ ముజిబ్ అనే విద్యార్థి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కోర్టు.. బాధితునికి పరిహారం అందించే విషయంలో తమ స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర సర్కారుతో పాటు, ఆమ్‌ఆద్మీ ప్రభుత్వం, ఢిల్లీ నగర పోలీసులను సోమవారం ఆదేశించింది. సీఏఏకి వ్యతిరేకంగా జామియా వర్సిటీ విద్యార్థులు డిసెంబర్ 15వ తేదీ నాడు చేపట్టిన ఆందోళన కార్యక్రమం చివరికి విద్యార్థులు, పోలీసులకు మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో వర్సిటీ పాత రీడింగ్ హాల్‌లోకి ప్రవేశించిన పోలీసులు విద్యార్థులను విచక్షణారహితంగా కొడుతున్న వీడియో ఒకటి తాజాగా వెలుగుచూసింది. పోలీసులు కొట్టడంతో తన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని, అందుకుగానూ ప్రభుత్వం నుంచి తనకు రూ. 2 కోట్ల పరిహారం ఇప్పించాలని ముజిబ్ కోర్టును కోరారు. మరోవైపు, జామియా ఘటనలో బీజేపీ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిందని కాంగ్రెస్ విమర్శించగా.. ఈఘటనకు కాంగ్రెస్ రాజకీయ రంగు పులుముతున్నదని, దేశ వ్యతిరేక శక్తులకు ఆ పార్టీ మద్దతిస్తున్నదని బీజేపీ ఆరోపించింది.



బాబులాల్ మరాండి బీజేపీలోకి తిరిగిరావడం ఆనందాన్ని కలిగించింది. 2014లో నేను పార్టీ అధ్యక్షుడిగా ఉన్న అతడిని పార్టీలోకి తిరిగి తీసుకురావడానికి కృషిచేశాను. గిరిజన నాయకుడైన మరాండి బీజేపీలో తగిన గౌరవం, బాధ్యతలు పొందుతారు.

**అమిత్ షా, కేంద్ర హోం మంత్రి**

నేను ప్రజా సేవకుడిని. నా ప్రాంతంలో ప్రజా సమస్యలపై పోరాటమే నా మతం. మేము ఏడాదిపాటు సహనంతో ఉంటాం. ఆ తర్వాత మ్యానిఫెస్టోలోని వాగ్దానాలను నెరవేర్చకపోతే మేము రోడ్లపైకి రావడానికి కూడా వెనుకాడము.

**జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ నేత**



**చరిత్రలో నేడు**



1861

ఇటలీ మొదటి రాజుగా విక్టర్ ఎమ్మాన్యుయేల్ II.

1879

అమెరికా స్వేచ్ఛా విగ్రహంపై పేటెంట్ పొందిన విగ్రహ రూపశిల్పి ఫ్రెడరిక్ అగస్టీ బర్తోల్డీ.





1884

టాల్‌స్టాయ్ రచన 'వాట్ ఐ బిలివ్ ఇన్' పుస్తకాలను జప్తు చేసిన పోలీసులు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని, నిరసన తెలిపే హక్కును కోల్పోవద్దని సుప్రీంకోర్టు న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పిలుపునిచ్చారు. గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ 10వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులు ప్రశ్నించే తత్వంతోనే సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలన్నారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనను జాతి వ్యతిరేకమైనదిగా ముద్రవేస్తున్న తరుణంలో చంద్రచూడ్ ఈ విధంగా పిలుపునివ్వటం గమనార్హం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల పిల్లల పుస్తకాల బ్యాగులు తక్కువ బరువు ఉండేట్లు చర్యలు తీసుకోవటంలో విఫలమయ్యాయని కేరళ హై కోర్టు ఆగ్రహించింది. ఈ విషయంపై కేంద్ర మానవాభివృద్ధి శాఖ 2018లోనే చట్టం చేసినా ప్రభుత్వాలేవీ పాటించటం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. చేసిన చట్టాలన్నీ కాగితాలకే పరిమితమైతే పాలన, చట్టాలు ఎందుకని కేంద్ర,రాష్ట్ర, ప్రభుత్వాలను నిలదీసింది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# ప్రజాస్వామ్యం-నిరసన

దేశంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం, నిరసన హక్కులపై అర్థవంతమైన చర్చ సాగడం హర్షణీయం. షాహీన్‌బాగ్‌లో రెండు నెలలకుపైగా సాగుతున్న నిరసనపై సుప్రీంకోర్టు శనివారం ఇచ్చిన ఆదేశాలు గమనార్హమైనవి. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలకు ఊతం ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయితే ఈ నిరనసన ప్రదర్శన రాకపోకలకు ఆటంకంగా మారిందనే విషయమై అభ్యంతరాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో పరమోన్నత న్యాయస్థానం నిరసన తెలిపే హక్కును గుర్తిస్తూనే, ఇతరులకు ఆటంకం కలుగకుండా చూడాలని సూచించింది. రాకపోకలకు అంతరాయం కలుగుతున్నందు వల్ల నిరసన ప్రదర్శకులను తొలిగించాలని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నిరసనహక్కును ప్రాథమికహక్కుకు భంగం కలుగకుండా, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా పరిష్కారం సాధించాలని భావించింది. ఇందుకు మధ్యవర్తులను నియమించింది. దేశవ్యాప్తంగా ఐదు వేల షాహీన్‌బాగ్‌లు పుట్టుకొస్తాయి అంటూ ఒకరు నిరసన ఉద్యమకారుడు చేసిన వ్యాఖ్యను ప్రస్తావించినప్పుడు, ' ఐదు వేల నిరసనలు తలెత్తినా సమస్య లేదు. రహదారులపై ఆటంకం కలుగకూడదనే కోరుకుంటున్నాం... నిరసన తెలుపడం ప్రాథమికహక్కు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాసనానికి వ్యతిరేకంగా నిరసన తెలుపడానికి అనుమతించాల్సిందేనని అంటూ, నిరసనలలోనే అభిప్రాయం రూపుదిద్దుకుంటుందని ధర్మాసనం వివరించింది. అయితే హక్కుతో పాటు బాధ్యత కూడా ఉంటుందని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా రహదారులపై కాకుండా, నిర్దేశిత స్థలంలో నిరసన ప్రదర్శనలు జరుపాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి చంద్రచూడ్ ఇటీవలే అహ్మదాబాద్‌లో ఇచ్చిన ఒక ప్రసంగంలో నిరసనలపై వెల్లడించిన అభిప్రాయాలు పరిశీలించదగినవి. నిరసనలు ప్రజాస్వామ్యంలో 'సేఫ్టీవాల్వ్' వంటివని అంటూ అసమ్మతిని దేశ వ్యతిరేకమైనదిగా, ప్రజాస్వామ్య విరుద్ధమైనదిగా ముద్ర వేయకూడదని హితవు చెప్పారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం అభివృద్ధికి, సామాజిక సమన్వయానికి అవకాశం కల్పిస్తుందనీ, అయినప్పటికీ బహుళ సమాజంలోని అస్తిత్వాలు విలువలపై గుత్తాధిపత్యాన్ని నెరుపలేదని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. రాజ్యాంగయంత్రాంగంతో అసమ్మతిని అణిచివేయ యత్నిస్తే, భావ వ్యక్తీకరణ చేయలేని భయానక పరిస్థితి ఏర్పడుతుందని కూడా అన్నారు. అసమ్మతికి తావు లేకుండా చేస్తే రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికి, సామాజిక అభివృద్ధికి ప్రాతిపదికలు ధ్వంసం అవుతాయని కూడా ఆయన హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, హక్కు లు, నిరసన మొదలైన అంశాలపై గత శతాబ్దంలోనే విపులమైన చర్చ సాగింది. పార్లమెంటులో మెజారిటీ నిర్ణయాలు, పాలన మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. సమాజంలోని అన్నివర్గాల గొంతు ను ప్రభుత్వం వినాలె. పార్లమెంటు బయట కూడా తమ ఆవేదనను వినిపించి న్యాయం పొందే అవకాశం భిన్నవర్గాలు ఉండాలనేది ప్రజాస్వామిక సూత్రం. అయితే నిరసనలు తెలుపడమే లక్ష్యం కాదు. ప్రజలు తమ అసమ్మతిని వినిపించడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి నిరసన తెలుపడం ఒక సాధనం మాత్రమే. నిరసనలు చేయడానికి అవకాశం ఇవ్వడమే కాదు, సమాజంలోని బలహీనవర్గాలు తమ గొంతును ఎంత మెల్లగా వినిపించినా దానికి స్పందించే సున్నితత్వం ప్రభుత్వానికి ఉండటమే ప్రజాస్వామ్య లక్షణం. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్టు ప్రజలు నిరసన తెలుపుతున్నప్పుడు, మధ్యలో సమీక్షించుకోవడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. పౌరసత్వ సవరణ చట్టంపై పెల్లుబుకుతున్న నిరసనల విషయంలో కేసీఆర్ ఈ వ్యాఖ్య చేశారు.

సుప్రీంకోర్టు నిరసన హక్కును, ఇతరుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సమతుల్యం సాధించే ప్రయత్నించింది. ఈ క్రమంలో షాహీన్‌బాగ్‌లో నిరసనలు కొనసాగించే అంశంపై చర్చ మొదలైంది. అయితే రెండు నెలలకు పైగా సాగుతున్న షాహీన్‌బాగ్ నిరసన నేపథ్యం, ప్రభావం, ప్రాధాన్యం విస్మరించలేనిది. గత ఆరేండ్ల కాలంలో దేశంలో మూకదాడులు జరుగుతుండటం పట్ల ఆందోళన పెరిగిపోతున్నది. సోషల్ మీడియాలో విద్వేష ప్రచారం కూడా కొన్ని సామాజికవర్గాలకు భయాందోళనలను సృష్టిస్తున్నది. ఈ క్రమమే మహిళలు ముందుకు వచ్చి ప్రదర్శనలు జరిపే పరిస్థితికి దారి తీసింది. షాహీన్‌బాగ్ దాడి దేశవ్యాప్త నిరసనలకు స్ఫూర్తినిచ్చింది. ఇది రాజకీయంగానే కాదు, సామాజికంగా కూడా ఆయావర్గాలలో మార్పుకు దోహదపడవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఏ సాధారణంగా సమాజంలోనైనా భిన్నత్వం ఉంటుంది. ఇక మన దేశంలోనైతే భిన్నత్వం గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రభుత్వం శాసనాలు చేసే ముందు భిన్నవర్గాల ఆకాంక్షలను, ఆందోళనలను దృష్టిలో పెట్టుకోవాలె. ప్రభుత్వం చేసిన శాసనమే కాదు, పరిపాలనా విధానం కూడా ఆందోళనలకు దారి తీయవచ్చు. నిరసనలు షాహీన్‌బాగ్‌లో జరుగుతాయా, మరోచోటనా అనేది కాదు, నిరసనల పట్ల ప్రభుత్వం ఏమేర స్పందిస్తుందనేది ప్రధానం.

**సుప్రీంకోర్టు నిరసన హక్కును, ఇతరుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సమతుల్యం సాధించే ప్రయత్నించింది. ఈ క్రమంలో షాహీన్‌బాగ్‌లో నిరసనలు కొనసాగించే అంశంపై చర్చ మొదలైంది. అయితే రెండు నెలలకు పైగా సాగుతున్న షాహీన్‌బాగ్ నిరసన నేపథ్యం, ప్రభావం, ప్రాధాన్యం విస్మరించలేనిది. గత ఆరేండ్ల కాలంలో దేశంలో మూకదాడులు జరుగుతుండటం పట్ల ఆందోళన పెరిగిపోతున్నది. సోషల్ మీడియాలో విద్వేష ప్రచారం కూడా కొన్ని సామాజికవర్గాలకు భయాందోళనలను సృష్టిస్తున్నది. ఈ క్రమమే మహిళలు ముందుకు వచ్చి ప్రదర్శనలు జరిపే పరిస్థితికి దారి తీసింది.**

విశ్లేషణ



**కాలువ మల్లయ్య**

# ప్రజాహితానికే పట్టం

కేసీఆర్‌పై వ్యతిరేకత ఉందని ఎంత ప్రచారం జరిగినా జాతీయపార్టీలు ఎన్ని అభాండాలు వేసినా రెండోసారి ఎన్నికల్లో ఓడించడానికి బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఎంత ప్రయత్నించినా ఓడించలేకపోయారు. ఆయా పార్టీలకు రాష్ట్రంలో చిరునామాలు కూడా లేని విజయపరంపరను కొనసాగిస్తున్న నేత కేసీఆర్. అందుకు కారణం జాతీయపార్టీలు ఆరోపిస్తున్నట్లు ధనప్రవాహం కానే కాదు. విమర్శలతో గెలువాలని చూసిన కాంగ్రెస్, మతం సెంటిమెంట్‌తో గెలువాలని చూసిన బీజేపీ బొక్కబోర్లాపడ్డాయి.

కేజ్రీవాల్ దేశ రాజధాని నగరమైన ఢిల్లీ రాష్ట్రానికి మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. అతని సిద్ధాంతం అవినీతిరహిత ఢిల్లీ, తద్వారా భారత్. అతని బలం, బలగం అవినీతిరహిత సమాజం. సామాన్య ప్రజలు బక్కచిక్కిన అతి సామాన్యుడైన కేజ్రీవాల్ ఉత్తర భారతానికే కాదు, మొత్తం దేశానికే గుండెకాయ లాంటిదైన ఢిల్లీ రాష్ట్ర సింహాసనాన్ని అధిష్ఠించడం సామాన్యమైన విషయం కాదు. ఢిల్లీకే పరిమితమైన ఓ ప్రాంతీయపార్టీ వంద పాతికేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్‌ను, దేశాన్నేలుతున్న జాతీయపార్టీ బీజేపీని ఢిల్లీలో చిరునామాల్లేకుండా ఓడించడం అసమానం.

సాధారణంగా ఐదేండ్లు పాలించిన పార్టీపై వ్యతిరేకత ఏర్పడటం సహజం. కానీ కేజ్రీవాల్‌పై ఏ మాత్రం వ్యతిరేకత ఏర్పడలేదు. అందుకు కారణం ఆయన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం. కులం, మతం, ప్రాంతం అని కాకుండా సామాన్య మానవుడికి, మధ్యతరగతి మనిషికి ఏం కావాలో అవి నెరవేర్చడం. డబ్బు, మద్యం ఏరులై పారిస్తున్న జాతీయపార్టీలకు భిన్నంగా, తానుచేసిన పనులకు ఓట్లడగడం గమనార్హం. అవినీతిరహిత పాలన అనే ఒకేఒక నినాదంతో, ఆచరణతోనూ ఎన్నికలు గెలువవచ్చని రుజువుచేసిన ధీరోదాత్తుడు కేజ్రీవాల్. ఒంటిచేత్తో ధనబలం, మీడియా బలం, మాఫియా బలం ఏవీ లేకుండా నిజాయితీతో మనిషి కోసం మంచి పాలనను అందిస్తే గెలుపు సాధ్యమేనని రుజువుచేసిన అసామాన్య రాజకీయవేత్త మన కేజ్రీవాల్.

దేశానికి రెండవ రాజధాని కాగల అన్నీ అర్హతలున్న ఒకేఒక మహానగరం అని అంబేద్కర్‌తో చెప్పబడిన తెలంగాణ రాజధాని హైదరాబాద్ కూడా మినీ ఇండియా లాంటిదే. వివిధ రాష్ర్టాల జనమే కాకుండా ప్రపంచదేశాల ప్రజలూ ఇక్కడున్నారు. బక్కచిక్కిన శరీరధారియైన కేసీఆర్ రాజకీయ మానసిక సింహబలుడై ఒంటిచేత్తో తెలంగాణ సాధించాడు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన దాదాపు అన్నీ ఎన్నికల్లోనూ జాతీయపార్టీలుగా చెప్పుకోబడే కాంగ్రెస్, బీజేపీ పార్టీలన్నింటినీ ఓడించి రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు కేసీఆర్. తెలంగాణ ఆత్మగౌరవం, స్వయంపాలన, ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని అదే చేశారు కేసీఆర్. మొదటిసారి అధికారంలోకి వచ్చినపుడు తెలంగాణ సెంటిమెంట్ ఉపయోగపడిందనుకున్నా ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ఘన విజయం కేసీఆర్‌కు ఎలా సాధ్యమైంది. ఐదేండ్లు పాలన చేసిన తర్వాత ఏ పార్టీకైనా సాధారణంగా వ్యతిరేకత వస్తుంది. కానీ కేసీఆర్ ఐదేండ్ల పాలన జరిగిన తర్వాత జరిగిన ఎన్నికల్లో మొదటిసారి కంటే ఎక్కువ ఓట్లను, సీట్లను పొంది విజేతగా నిలిచారు. అందుకు కారణం కేజ్రీవాల్‌లా కేసీఆర్ కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం, నూటికి నూరుపాళ్లు హామీలు నెరవేర్చడం. ఇంతవరకు తెలంగాణాను పాలించిన పార్టీల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ హామీలు నెరవేర్చి ప్రజోపయోగకర పనులు చేయడం.

కేసీఆర్‌పై వ్యతిరేకత ఉందని ఎంత ప్రచారం జరిగినా జాతీయ పార్టీలు ఎన్ని అభాండాలు వేసినా రెండోసారి ఎన్నికల్లో ఓడించడానికి బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఎంత ప్రయత్నించినా ఓడించలేక పోయారు. ఆయా పార్టీలకు రాష్ట్రంలో చిరునామాలు కూడా లేని విజయ పరంపరను కొనసాగిస్తున్న నేత కేసీఆర్. అందుకు కారణం జాతీయపార్టీలు ఆరోపిస్తున్నట్లు ధనప్రవాహం కానే కాదు. విమర్శలతో గెలువాలని చూసిన కాంగ్రెస్, మతం సెంటిమెంట్‌తో గెలువాలని చూసిన బీజేపీ బొక్కబోర్లా పడ్డాయి. వారు కోట్లాదిమంది తెలంగాణ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గమనించలేదు. తెలిసినా తెలియనట్టు నటించారు. ఇతర పార్టీల మీదున్న వ్యతిరేక ఓట్లతో కాదు, టీఆర్ఎస్ పార్టీ మీదున్న అనుకూల అభిమాన ఓట్లతో కేసీఆర్ గెలిచాడు. ప్రజలు మెచ్చే పాలనను అందిస్తే గెలుపు సాధ్యమేనని కేజ్రీవాల్ నిరూపించినట్టే కేసీఆర్ నిరూపించాడు.

ఢిల్లీ రాష్ట్రాన్ని కేజ్రీవాల్, తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఒంటిచేత్తో గెలిపించి ఢిల్లీ పాదుషాగా కేజ్రీవాల్, హైదరాబాద్ పాదుషాగా కేసీఆర్ సమున్నతంగా నిలబడినారు. దేశ రాజధాని ఢిల్లీలో, రెండవ రాజధానిగా చెప్పుకోబడే మహానగరం హైదరాబాద్‌లో జాతీయపార్టీలకు స్థానం లేదని నిరూపించిన మహానాయకులు కేజ్రీవాల్, కేసీఆర్. స్వాతంత్ర్యానంతర కాలం నుంచి జాతీయపార్టీలు వివిధ రాష్ర్టాల పట్ల చూపుతున్న వివక్ష, పెంచిపోషిస్తున్న కుల, మత, జాతి వైరుధ్యాలు, ప్రజలను ఓటర్లుగా మాత్రమే చూడటం లాంటి పనులతో వాటిపట్ల ఏవగింపు కలిగేట్లు చేశా యి. ఢిల్లీ, తెలంగాణలో మాత్రమే కాదు, దేశంలోని అనేక స్టాల్లో ప్రాంతీయపార్టీలు బలపడటానికి, అవే తమ సమస్యలు తీర్చే పార్టీలని ప్రజలు భావించడానికి, జాతీయపార్టీల బాధ్యతారాహిత్య ప్రవర్తనే కారణం.

మధ్యతరగతి, సామాన్య స్థితిగతుల నుంచి వచ్చి అసామాన్య రాజకీయవేత్తలుగా ఎదిగి, అసంఖ్యాక ప్రజల హృదయాలను గెలిచి విజేతలుగా నిలిచారన్నది వాస్తవం. ఎన్నికల్లో అఖండ విజయం సాధించడం మాత్రమే కాదు ప్రజల హృదయాలను గెలిచిన నేతలు కేసీఆర్, కేజ్రీవాల్.

వీళ్లకి ప్రజల్లో అపూర్వ ఆదరణ ఎలా సాధ్యమైంది? పాలకులుగా వాళ్లు చేసిన పనులు ఓట్ల కోసం ప్రజలను చేరుకునే ప్రచార సరళితోనే ఇది సాధ్యమైంది. బీజేపీ లా కేజ్రీవాల్ తన పార్టీ గెలుపు కోసం మతం, ధనం లాంటి విషయాలపై ఆధారపడలేదు. కేసీఆర్ తన గెలుపు కోసం కాంగ్రెస్‌లా ఎదుటివారి ఫెయిల్యూర్స్ పైన్నో, ఆరోపణలపైన్నో, ఆధారపడలేదు, బీజేపీలా హిందుత్వాన్ని మతతత్వాన్ని రెచ్చగొట్టలేదు. వీరిరువు రూ తాముచేసిన పనుల గురించే చెప్పారు. చేయబోయే పనుల గురించే చెప్పి ఓట్లడిగారు. తమ ఇదివరకటి హామీలు నెరవేర్చి, చేస్తున్న హామీల ను నెరవేర్చగలమని నమ్మకం ఓటర్లలో కలిగించారు.

కేజ్రీవాల్ ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేట్ పాఠశాలల కంటే గొప్పగా తీర్చిదిద్దారు. నాణ్యమైన విద్యను అందించారు. ప్రభుత్వరంగ విద్యను బలోపేతం చేశారు. ఢిల్లీలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సౌకర్యం కల్పించారు. ఉచిత విద్యుత్తు ఇస్తూనే ఢిల్లీ ప్రజల నీటి సమస్య తీర్చారు. ఢిల్లీ ఆర్థికస్థితిగతులను బాగుపరుచడమే కాకుండా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి విశేషంగా కృషిచేశారు. అదే సమయంలో ప్రధాన ప్రత్యర్థి బీజేపీ ముస్లిం వ్యతిరేకతను, పాకిస్థాన్ వ్యతిరేకతను రెచ్చగొడుతూ మతసామరస్యాన్ని దెబ్బతీసే పనులు చేశారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క విషయాన్ని పట్టించుకోకుండా మందిర్, మసీదు సమస్యను, సీఏఏ, ఎన్నార్సీలను సమర్థిస్తూ కేజ్రీవాల్‌ను కూడా పాకిస్థాన్ ఏజెంటుగా చిత్రించారు. కేజ్రీవాల్ చర్యల ముందు బీజేపీ రెచ్చగొట్టే చర్యలేమీ పని చేయలేదు.

తెలంగాణలోనూ బీజేపీ హిందుత్వ చర్యలు కేసీఆర్ ప్రజల అవసరాలను తీర్చే పథకాల ముందేం పనిచేయలేదు. రాష్ట్రంలో కేసీఆర్ వ్యవసాయాధారంగా బతికే కోట్లాదిమందిని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి నమూనా తయారుచేశారు. దశాబ్దాలుగా నీటి కొరతతో తల్లడిల్లుతున్న తెలంగాణ రైతాంగానికి నీరందించడానికి మిషన్ కాకతీయ, కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టి చాలావరకు పూర్తిచేశారు. ప్రతి ఇంటికీ తాగు నీరందించడానికి మిషన్‌భగీరథ పథకంతో మంచినీళ్లం దించారు. రైతుబంధు, వృద్ధాప్య పింఛన్, రుణమాఫీ ఇతర అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేట్టు చేశారు. నిరంతర విద్యుత్తునిచ్చి వ్యవసాయం, పరిశ్రమలను ఆదుకున్నారు. సబ్బండ వృత్తుల వారికి ఆ వృత్తులతో బతికేట్టు చేశారు. విద్య, వైద్యం విషయంలోనూ కేసీఆర్ ప్రజలను ఆదుకున్నారు.

ఇలా కేసీఆర్, కేజ్రీవాల్ తమ రాష్ర్టాలను దేశంలోనే రోల్‌మోడల్స్‌గా తీర్చిదిద్దిన, దిద్దుతున్న ఘనత వారిది. ఢిల్లీ, హైదరాబాద్ పాదుషాలు కేజ్రీవాల్, కేసీఆర్‌లు తమ దృష్టిని జాతీయ రాజకీయాల వైపు కేంద్రీకరిస్తే మంచిదేమో!

**తెలంగాణలోనూ బీజేపీ హిందుత్వ చర్యలు కేసీఆర్ ప్రజల అవసరాలను తీర్చే పథకాల ముందేం పనిచేయలేదు. రాష్ట్రంలో కేసీఆర్ వ్యవసాయాధారంగా బతికే కోట్లాదిమందిని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి నమూనా తయారుచేశారు. దశాబ్దాలుగా నీటి కొరతతో తల్లడిల్లుతున్న తెలంగాణ రైతాంగానికి నీరందించడానికి మిషన్ కాకతీయ, కాళేశ్వరంలాంటి ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టి చాలావరకు పూర్తిచేశారు. ప్రతి ఇం టికీ తాగు నీరందించడానికి మిషన్ భగీరథ పథకంతో మంచినీళ్లం దించారు. రైతుబంధు, వృద్ధాప్య పింఛన్, రుణమాఫీ ఇతర అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేట్టు చేశారు.**

# ఆశ్రితులను ఆదరిద్దాం

జాతీయం



**చందుపట్ల రమణకుమార్‌రెడ్డి**

రోహింగ్యాలు అనగానే ఎవరైనా చెప్పగలిగే మాట వారు ముస్లిం వర్గ ప్రజలు అని. నిజానికి రోహింగ్యా ఒక మతానికి సంబంధించిన పదం కాదు. గత 200 ఏండ్ల కాలంలో నాటి అవిభాజ్య భారత్‌లోని బెంగాల్, అసోం ప్రాంతాల నుంచి కూలీలుగా, రోడ్డు నిర్మాణ కార్మికులుగా, పోర్టర్లుగా వలసపోయి మయన్మార్ (బర్మా)లోని రాఖైన్ (అరకాన్) రాష్ట్రంలో స్థిరపడినవారు. తమను తాము రోహింగ్యాలుగా చెప్పుకోవడంతో అదే వారి జాతినామంగా స్థిరపడిపోయింది. నిజానికి రోహింగ్యాలలో ముస్లింలతో పాటు నాడు వలసపోయిన హిందువులు కూడా ఉన్నారు. కాకపోతే వారి సంఖ్య అత్యల్పం. అందుకే ప్రపంచానికి రోహింగ్యాలంటే ముస్లింలుగా ప్రపంచానికి పరిచయమైంది. 1430లో నాటి స్వతంత్ర అరకాన్ (ప్రస్తుత రాఖైన్ ప్రాంతం) దేశంలోకి మొదలైన భారతీయ బెంగాలీ ముస్లింల వలసలు, బర్మారాజు 1784లో ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకునే వరకు కొనసాగాయి. ఆ తర్వాత 1824లో బ్రిటన్ బర్మాను ఆక్రమించుకొని బ్రిటిష్ ఇండియాలో భాగంగా పరిపాలించింది. ఆ కాలంలో పరిపాలనా సౌలభ్యం కోసం, రోడ్డు నిర్మాణాల కోసం రైతుకూలీలుగా, పోర్టర్లుగా పనిచేసేందుకు నాటి బెంగాల్, అసోం ప్రాంతాల నుంచి వేలాదిమంది భారతీయులను ముఖ్యంగా ముస్లింలను తరలించింది. ఫలితంగా అరాకాన్‌లో ముస్లింల సంఖ్య పెరిగిపోయింది. ఈ వలసలు 1948లో బర్మాకు స్వాతంత్ర్యం ప్రకటించేదాకా కొనసాగాయి. బెంగాల్ నుంచి బర్మా వరకు సాగిన వారి ప్రయాణాన్ని వలస అని కూడా చెప్పలేం, ఎందుకంటే నాడు బెంగాల్, బర్మా రెండూ బ్రిటిష్ ఇండియాలో భాగమే. దేశంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బతుకుదెరువు కోసం పోవడమే.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో తమకు సహకరిస్తే యుద్ధానంతరం ప్రత్యేక ప్రతిపత్తిని ఇస్తామన్న బ్రిటిష్ వాగ్దానాన్ని విశ్వసించి రోహింగ్యాలు బ్రిటిష్ సైన్యానికి అండగా నిలిచారు. బ్రిటిష్ వారు వారి వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు కానీ, రోహింగ్యాల స్వతంత్ర కాంక్ష వారిని బర్మా ప్రజల దృష్టిలో చొరబాటుదారులుగా నిలిపింది. పర్యవసానంగా సాంస్కృతిక విభేదాలు, భూ వివాదాలు పెరిగాయి. వీటన్నింటి ఫలితమే ఇప్పుడు జరిగిన, జరుగుతున్న నరమేధం. 2016-17వరకు మయన్మార్‌లోని రాఖైన్ రాష్ట్రంలో రోహింగ్యాల సంఖ్య 11లక్షలకు పైనే. ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు పరిమితమైంది. వారి జీవితాలు ఛిద్రమయ్యాయని చెప్పడానికి ఈ ఒక్క సాక్ష్యం చాలు. ఐరాస 2018లో చేసిన ప్రకటన ప్రకారం ప్రపంచంలో అత్యంత వివక్షకు గురైన మైనారిటీ వర్గం రోహింగ్యాలు.

మయన్మార్ (బర్మా) జనాభాలో బౌద్ధుల సంఖ్య 88 శాతం, క్రిస్టియన్ జనాభా 6.5 శాతం, రోహింగ్యాలతో కూడిన ముస్లిం జనాభా 4.2 శాతం, హిందువుల సంఖ్య కేవలం 0.5 శాతం. బర్మా 1948లో స్వాతంత్ర్యం పొందిన తరువాత రోహింగ్యాలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఒప్పుకోలేదు. పైపెచ్చు బెంగాలీలు (రోహింగ్యాలు) తమకు తాము ఆపాదించుకున్న రోహింగ్యా జాతిని బర్మా జాతీయులుగా గుర్తించలేదు. 1962లో బర్మాలో మిలిటరీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోహింగ్యాల కష్టాలు రెట్టింపయ్యాయి. ఆపరేషన్ కింగ్ డ్రాగన్ పేరుతో నాడు మిలిటరీ చేసిన అకృత్యాలెన్నో. అప్పుడే బంగ్లాదేశ్‌కు వలసలు మొదలయ్యాయి. ఆ తర్వాత మిలిటరీ చేపట్టిన ఆపరేషన్ క్లీన్ అండ్ బ్యూటిఫుల్ నేషన్ పేరుతో 2 లక్షల మంది రోహింగ్యాలను స్వదేశం వదిలిపారిపోయేలా చేసింది. 2012లో మయన్మార్ లోని శరణార్థి శిబిరంలోకి లక్షా 40 వేల మంది రోహింగ్యాలను తరలించారు. రోహింగ్యాల మీద ప్రభుత్వ/మిలిటరీ దాష్టీకాన్ని బయటపెట్టిన ఇద్దరు బర్మా దేశ విలేకరులకు ఆ దేశ అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంగించారనే నెపంతో ఏడేండ్ల శిక్ష విధించారు. ఇదక్కడి పరిస్థితులకు ఉదాహరణ. అనేక అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు మయన్మార్‌లో కొనసాగుతున్న వివక్షను 1948-1990 మధ్య కాలంలో దక్షిణాఫ్రికా, నమీబియా దేశాల్లో కొనసాగిన అపార్థీడ్ విష సంస్కృతితో పోల్చాయి. అపార్థీడ్ అంటే చట్టబద్ధమైన జాతి వివక్ష. కేవలం తెల్ల జాతీయులకు మాత్రమే ప్రభుత్వ సేవలు, సౌకర్యాలు అందుబాటులో ఉండటం, మిగతావారికి ఆయా సౌకర్యాలు నిషేధం.

బర్మాలోని రాఖైన్ రాష్ట్రం అత్యంత వెనుకబడిన ప్రాంతం. ఆ రాష్ట్రంలోని జనాభాలో 69 శాతం దారిద్ర్యరేఖ దిగువన జీవిస్తున్నవారే. 1974లో మూడు జిల్లాలతో కూడిన ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 5. రాష్ట్ర జనాభా 31 లక్షల పైచిలుకు.

1931 నాటి లెక్కల ప్రకారం బర్మా రాజధాని రంగూన్‌లో భారతీయ హిందువుల జనాభా 55 శాతం. సుమారు 5 లక్షల 70 వేల పైచిలుకు. మయన్మార్ పాలకులు 1963-67 మధ్యకాలంలో మూడు లక్షల మంది హిందువులను, లక్ష మంది చైనీయులను అక్కడి నుంచి తరిమేశారు. 2014 నాటికి రంగూన్‌లో హిందువుల సంఖ్య 2 లక్షల 52 వేలకు పడిపోయింది. 83 ఏండ్ల తర్వాత రెట్టింపు కావలసిన జనాభా సగానికి పడిపోవడాన్ని చూస్తేనే అర్థమవుతుంది అక్కడ జాతుల సమస్య ఎంతతీవ్రంగా ఉన్నదో. జనాభాపరంగా చూస్తే నేడు బంగ్లాదేశ్‌లో 13 లక్షల మంది రోహింగ్యాలు జీవిస్తున్నారు, మయన్మార్‌లో 4 లక్షల మంది, మలేసియాలో లక్షా యాభై వేల మంది, సౌదీ అరేబియాలో లక్షా తొంభై వేల మంది, యూఏఈలో యాభై వేల మంది, పాకిస్థాన్‌లో 3 లక్షల 50 వేల మంది, భారతదేశంలో 40 వేల మంది రోహింగ్యాలు బతుకుతున్నారు. మయన్మార్‌లో ఉన్నవారితో సహా అందరూ శరణార్థులుగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు.

రోహింగ్యాల ప్రధాన సమస్య బర్మాలో వారికి పౌరసత్వం. మొదటి నుంచి బర్మా ప్రభుత్వాలు వారిని బర్మా జాతీయులుగా నిరాకరిస్తూ వస్తున్నారు. వలస కార్మికులుగా షరతులతో కూడిన పౌరసత్వాన్ని ప్రసాదిస్తూ వచ్చారు. 1982లో చేసిన మయన్మార్ పౌరసత్వ చట్టంతో ఆ సమస్య తీవ్రమైంది. రోహింగ్యాలను మినహాయించి బర్మాలో స్థిరపడిన మిగతా 135 జాతులను సహజ పౌరులుగా గుర్తించారు. రోహింగ్యాలకు మాత్రం 2010 వరకు ఇచ్చిన ఓటుహక్కును కూడా రద్దుచేశారు. 2015 నుంచి పౌరసత్వం తిరస్కరించారు. ఆ చట్టం ప్రకారం 1823కు ముందు బర్మాలో ఉన్నజాతులే పౌరసత్వానికి అర్హులు. మిగితావారు అసోసియేటెడ్ పౌరసత్వం, నేచురలైజేషన్ పౌరసత్వం పేరుతో పరిమిత పౌరసత్వానికి మాత్రమే అర్హులు. ప్రభుత్వ ఉద్యోగాలు, పౌరహక్కులు, విద్య, వివాహ స్వేచ్ఛ రోహింగ్యాలకు దూరమయ్యాయి.

ఆ క్రమంలో రోహింగ్యాలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు చేసిన పోరాటాలు తీవ్ర నిర్బంధాలకు బలయ్యాయి. మయన్మార్ పాలకుల దమనకాండలో 6,700 మంది రోహింగ్యాలు హతులయ్యారు, 7 లక్షల మంది దేశం వదిలి బంగ్లాదేశ్‌లో తలదాచుకున్నారు. రోహింగ్యాలతో నిండిన బంగ్లాదేశ్‌లోని కుటుపలంగ్ శరణార్థి శిబిరం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థి శిబిరం.

రెండు శతాబ్దాల సుదీర్ఘ సహజీవనం తర్వాత కూడా ఒక వలస జాతి స్థానిక జాతితో మమేకం కాలేకపోవడానికి కారణాలేమైనా ఉండొచ్చు, అంతమాత్రాన్నే వారి జాతీయతను తిరస్కరించడం అహేతుకం. వారికి కనీస హక్కులు నిరాకరించడం అమానుషం. రోహింగ్యాల 200 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత కూడా స్థానిక రాఖైన్‌లు వారు విదేశీయులుగా, అక్రమ వసలదారులుగా చూడటం అమానవీయం. ఇప్పటికైనా సాటి మనుషులుగా రోహింగ్యాలకు అందరూ అండగా నిలువాలి. వారి హక్కులకు హామీ ఇవాలి.

**రెండు శతాబ్దాల సుదీర్ఘ సహజీవనం తర్వాత కూడా ఒక వలస జాతి స్థానిక జాతితో మమేకం కాలేకపోవడానికి కారణాలేమైనా ఉండొచ్చు, అంతమాత్రాన్నే వారి జాతీయతను తిరస్కరించడం అహేతుకం. వారికి కనీస హక్కులు నిరాకరించడం అమానుషం. రోహింగ్యాల 200 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత కూడా స్థానిక రాఖైన్‌లు వారు విదేశీయులుగా, అక్రమ వసలదారులుగా చూడటం అమానవీయం.**

**జనగళం**

### చెరువులను రక్షించుకోవాలె

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రంలోని చెరువులన్నింటిని పునరుద్ధరిస్తున్నది. ఇప్పటికే వేలాది చెరువులు మరమ్మతులకు కూడా నోచుకున్నాయి. ఈ రకంగా అభివృద్ధి చెందిన చెరువులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలది. కానీ అది సక్రమంగా జరుగడం లేదు. ఈ చెరువుల్లో చెత్త పారేయడం, మాంసం వ్యర్థాలు పడేయడం, కళేబరాలు పారేయడం ద్వారా చెరువులు కాలుష్యం బారిన పడుతున్నాయి. కాబట్టి ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు చెరువుల రక్షణ గురించి పట్టించుకోవాలి.

**- దూలం రాజేశ్, సుభాష్‌నగర్, పెద్దపల్లి**

### సగర్వంగా తిరిగిరావాలె

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా తొలుత అన్ని ట్వంటీ-ట్వంటీ మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. కానీ తర్వాత జరిగిన వన్డే మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. ఇక న్యూజిలాండ్ పర్యటనలో మిగిలింది టెస్టు మ్యాచ్‌లే. ఈ టెస్టుల్లోనైనా పూర్తి ఆధిక్యం ప్రదర్శించి విజయంతో సగర్వంగా స్వదేశానికి తిరిగి రావాలి.

**- జూలపల్లి మోహన్, మానకొండూర్, కరీంనగర్**

### అప్రమత్తంగా ఉండాలి

కరోనా వైరస్ యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న విషయం తెలిసిందే. అయితే కరోనా వైరస్ కేసుల గురించి వదంతులు వస్తున్నాయి. దీంతో ఈవార్తలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ విషయంలో అధికార యంత్రాంగం చెప్పేదాకా అత్యుత్సాహం ప్రదర్శించకూడదు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. కరోనా వైరస్ విస్తరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాయి. ఒకవేళ ఎవరికైనా కరోనా వైరస్ ఉన్నదని తేలితే ఆ వ్యాధిగ్రస్థులకు సకల సదుపాయాలతో ప్రత్యేక వైద్యం అందించడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. వదంతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు.

**- జంపాల అంజయ్య, యాదాద్రిభువనగిరి జిల్లా**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



ఈ నెల 26న నుంచి మార్చి 7 వరకు జరిగే యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు యాదాద్రి ఆలయ ఈవో ఎన్ గీత, ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు చేరుకున్న వీరు స్వామివారి ప్రసాదాన్ని గవర్నర్‌కు అందజేశారు. ఉత్సవాలకు హాజరవుతానని గవర్నర్ చెప్పినట్టు ఈవో పేర్కొన్నారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ

## నేడు గజ్వేల్‌లో రాష్ట్ర ఉన్నతస్థాయి బృందం పర్యటన

**గజ్వేల్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణాభివృద్ధిని క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి రాష్ట్ర ఉన్నతస్థాయి బృందం మంగళవారం రానున్నదని కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలో జరిగిన అభివృద్ధిని వీక్షించేందుకు పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు 33 జిల్లాల కలెక్టర్లు, 50 మంది అదనపు కలెక్టర్లు, 11 మంది మేయర్లు, 141 మంది మున్సిపల్ చైర్మన్‌లు, 141 మంది మున్సిపల్ కమిషనర్లు కూడా వస్తున్నారన్నారు. వీరు పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, వైకుంఠధామంతోపాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన మేరకు పర్యటిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు.

# తెలంగాణ పెద్ద వాటర్ బ్యాంక్

రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్



**కరీంనగర్ ఎడ్యుకేషన్:** తెలంగాణరాష్ట్రం పెద్ద వాటర్ బ్యాంక్ అని రామన్ మెగసెసే అవార్డుగ్రహీత, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో 'గోదావరి మహాయాత్ర' అనే అంశంపై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నదులు మన స్వాతంత్ర్యానికి చిహ్నమనీ, ప్రస్తుతం ఆ నదులు ప్రమాదపుటంచుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నీటిని పొదుపుగా వాడుకోవాలనీ, నదుల ఆరోగ్యమే మన ఆరోగ్యమనీ నదులను కాపాడుకోవడానికి అందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. భూమిపై మూడో ప్రపంచ యుద్ధం వస్తే అది నీటి కోసమేనని తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్ అన్నారు. నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు.





సంగారెడ్డి జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు

## సీసీ రోడ్ల నిర్మాణానికి 500 కోట్లు

వారంరోజుల్లో అన్ని జిల్లాలకు పంపిణీ: ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

**సంగారెడ్డి ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నుంచి ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరుచేసిందని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. వారంరోజుల్లో అన్ని జిల్లాలకు ఈ నిధులను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతి గ్రామానికి ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 24 గంటల విద్యుత్, గురుకుల పాఠశాలలు, మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎంపీలు బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ పాల్గొన్నారు.



కరీంనగర్‌లో నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు ఈటల, గంగుల, కొప్పుల

## చెక్‌డ్యాంలు సకాలంలో నిర్మించాలి

పనుల్లో నాణ్యత పాటించాలి: మంత్రులు ఈటల, గంగుల, కొప్పుల

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సీఎం కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంజూరు చేసిన చెక్‌డ్యాంల పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తిచేయాలని మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా నీటిపారుదలశాఖ అధికారులతో సోమవారం మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే ప్రతి నీటిబొట్టును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ఉమ్మడిజిల్లాలోని వాగులపై సీఎం చెక్ డ్యాంలు మంజూరుచేశారని తెలిపారు. వీటిని జూన్ మొదటి వారానికల్లా పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటికే నీటిహబ్‌గా మారిన కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయితే ఎక్కడ చూసినా నీళ్లే కనిపిస్తాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# కాకతీయ కాల్వలో మరో కారు

- కలకలంరేపిన మూడు మృతదేహాలు
- పెద్దపల్లి ఎమ్మెల్యే సోదరి కుటుంబంగా గుర్తించిన పోలీసులు
- 20 రోజుల క్రితమే కాల్వలో పడి ఉండవచ్చని అంచనా





కరీంనగర్ జిల్లా అల్గునూర్ శివారులో కాకతీయ కాల్వలో పడ్డ కారును బయటికి తీస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) సత్యనారాయణరెడ్డి, రాధ, వినయశ్రీ (ఫైల్)

**కరీంనగర్ క్రైం/తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ శివారులోని కాకతీయ కాల్వ వద్ద మరో కారు ప్రమాదం కలకలం రేపింది. ఆదివారం రాత్రి కాల్వలో బైకు పడిన ఘటనలో మహిళ భౌతిక కాయం కోసం కాల్వకు నీటిని నిలిపేయగా.. సోమవారం కాల్వలో తేలిన ఓ కారులో ముగ్గురి మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వీరంతా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోదరి కుటుంబ సభ్యులుగా గుర్తించిన పోలీసులు వారికి సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి కాకతీయ కాల్వకు అధికారులు నీటిని నిలిపేశారు. ఈక్రమంలో తిమ్మాపూర్ మండలంలోని యాదవులపల్లె సమీపంలో కాల్వలో ఓ కారును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్రేన్‌సాయంతో కారును బయటకు తీశారు. అందులో కుళ్లిన స్థితిలో ఉన్న మూడు మృతదేహాలను గుర్తించారు. కారు నంబర్ ఆధారంగా కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బ్యాంకుకాలనీకి చెందిన నరెడ్డి సత్యనారాయణరెడ్డి(55), ఆయన భార్య రాధ(50), కుమార్తె వినయశ్రీ(25)గా గుర్తించారు. వీరు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోదరి కుటుంబ సభ్యులుగా తెలుసుకున్న పోలీసులు విషయాన్ని ఎమ్మెల్యేకు, బంధువులకు చెప్పారు. దాదాపు 20 రోజుల క్రితమే కారు కాల్వలో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అక్కడికి చేరుకుని తమ సోదరి కుటుంబంగా నిర్ధారించారు. తన సోదరి కుటుంబం మృతిపై దాసరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గత నెల 27న హైదరాబాద్‌కు వెళ్తున్నట్టుగా చెప్పి వెళ్లారనీ, ఎట్లైనా యాత్రలకు వెళ్లారేమోనని అనుకున్నామన్నారు. రాధ కరీంనగర్ సమీపంలోని మల్కాపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, సత్యనారాయణరెడ్డి ఎరువుల దుకాణం నడుపుతున్నారు. కుమార్తె వినయశ్రీ నిజామాబాద్‌లోని మేఘన డెంటల్ కళాశాలలో బీడీఎస్ చదువుతోంది. కారులో మృతదేహాలతోపాటు బ్యాగ్, ఆభరణాలు, సెల్‌ఫోన్ దొరికినట్టు పోలీసులు వివరించారు. కలెక్టర్ శశాంక, పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### వంతెనలపై ఆర్‌సీసీ గోడ కట్టించాలి మంత్రి గంగుల కమలాకర్

మానేరు వంతెన, కాకతీయ కాల్వ వద్ద ఆర్‌సీసీ గోడ కట్టి ప్రమాదాలు నిలువరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రోడ్డు సేఫ్టీపై మంత్రి అధికారులతో సమీక్షించారు. మానేరు వంతెనతోపాటు కాకతీయ కెనాల్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదవశాత్తు కాకతీయ కాల్వలో పడిన వారిని కాపాడేందుకు వీలుగా కెనాల్ బ్రిడ్జి నుంచి వంద మీటర్ల లోపు క్రేన్లను ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## ఏసీబీకి చిక్కిన ఆహారకల్తీ నిరోధక శాఖ ఉద్యోగి



వాజిద్

**మహబూబ్‌నగర్ క్రైం:** మహబూబ్‌నగర్‌లోని ఆహార కల్తీ నియంత్రణశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేటర్ రూ.4 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు పట్టుబడ్డాడు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ కృష్ణాగౌడ్ కథనం ప్రకారం.. గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన చిరువ్యాపారి భీమా భానుప్రకాశ్ బిస్కెట్ల డిస్ట్రిబ్యూషన్ ఉన్నది. ఈ లైసెన్స్ మార్చి 8 వరకు ఉండటంతో రెన్యువల్ చేసుకోవడానికి రెండు నెలలుగా ఆహార కల్తీ నియంత్రణ శాఖ కార్యాలయానికి తిరుగుతున్నాడు. ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న వాజిద్ ఈ నెల 6న భానుప్రకాశ్‌ను కలిసి లైసెన్స్ రెన్యువల్ చేయిస్తానని, రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం మహబూబ్‌నగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో భానుప్రకాశ్ నుంచి వాజిద్ రూ.4వేలు తీసుకొని లైసెన్స్ పత్రాలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొన్నారు.

## ఆటో ఢీకొని యువకుడి మృతి

కొద్ది గంటలముందే లవ్ ఫెయిల్ అంటూ వాట్సాప్‌లో స్టేటస్

**కామారెడ్డిరూరల్:** కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రాజంపేట్‌కు చెందిన ప్రదీప్‌గౌడ్(19) ఉగ్రవాయి నుంచి కామారెడ్డి వైపు ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఆటోను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ప్రమాదానికి కొద్దిగంటల ముందు 'లవ్ ఫెయిల్.. లవ్ ఫెయిల్' అంటూ ఏడ్చుకుంటూ బైక్‌పై వేగంగా వెళ్తున్న సెల్ఫీ వీడియోను ప్రదీప్ గౌడ్ తన స్టేటస్‌గా పెట్టుకున్నాడు. లవ్ ఫెయిల్ అయ్యిందనే మనస్థాపంతోనే తనే ఆటోను ఢీకొట్టాడా, లేదా ప్రమాదం జరిగిందా అనే విషయమై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## రోడ్డు భద్రతా చర్యలు తీసుకోండి

రోడ్ సేఫ్టీ డీజీకి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సూచన



**కార్పొరేషన్, నమస్తేతెలంగాణ:** కరీంనగర్ జిల్లాకేంద్రం శివారుప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ రోడ్ సేఫ్టీ డీజీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సూచించారు. సోమవారం ఆయన కృష్ణప్రసాద్‌తో మాట్లాడుతూ వెంటనే అధికారులను కరీంనగర్‌కు పంపి సమగ్రంగా పరిశీలించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కాకతీయ కాల్వ వెంబడి, అల్గునూర్ జంక్షన్ ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ రవీందర్‌రావు, జాతీయ రహదారుల ఈఎన్సీ గణపతిరెడ్డిలతో కూడా మాట్లాడారు. వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు వినోద్‌కుమార్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

## బాలిక ఆత్మహత్య

**ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గందం పూజిత (17) అనుమానాస్పద స్థితిలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గందం రజీత-రవి దంపతుల కూతురు పూజిత అడవి శ్రీరాంపూర్‌లోని అమ్మమ్మ సునీత రాణి ఇంటి వద్ద ఉంటున్నది. సోమవారం ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా కుటుంబ సభ్యులు వెలిశాలకు తీసుకుపోయారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ లకావత్ కానిస్టేబుల్ సంబశివరావు, శ్రీధర్‌రాజులతో కలిసి టెకుమట్ల ఎస్ఐ సూర్యనారాయణ సహకారంతో శవాన్ని మంథని మార్చురీకి రాత్రి తీసుకువచ్చారు. ఆమె మృతిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

**ఖమ్మంపల్లిలో యువకుడు..** మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన కలవేణి శేఖర్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ లకావత్ తెలిపారు. శేఖర్‌కు పెళ్లి సంబంధాలు వస్తున్నా కుదరడం లేదు. మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించగా మార్గమధ్యలోనే మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు.

## క్రియాశీలకంగా ఆర్టీసీ సంక్షేమ బోర్డు

- ప్రతి మంగళవారం సంక్షేమబోర్డు సమావేశం
- డిపో స్థాయిల్లో సమావేశాల నిర్వహణ
- ఫిర్యాదులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్
- బస్‌భవన్ నుంచి ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- 1,200 సమస్యల్లో 950కిపైగా పరిష్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్ ఆర్టీసీలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సంక్షేమబోర్డు ప్రతి మంగళవారం సమావేశం కానున్నది. గతంలో తమకు ఎదురవుతున్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లడంలో కార్మికులకు అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. యూనియన్ నేతల ద్వారా వెళ్లేందుకు ప్రయత్నిస్తే అది మరో సమస్యకు దారితీసేది. ఇలాంటి సమస్యలేవీ లేకుండా.. ఎప్పుడైనా ఓ ఉద్యోగి తన సమస్యలను, సూచనలను నేరుగా పైఅధికారులకు తెలియజేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమ బోర్డుకు శ్రీకారం చుట్టినవిషయం తెలిసిందే. దీనివల్ల ఆర్టీసీ చరిత్రలో కార్మికుడు, ఉన్నతాధికారులకు మధ్య ఉన్న దూరం పూర్తిగా తగ్గిపోయింది. ప్రతిడిపో నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 202 మంది ఉద్యోగులతో యాజమాన్యం సంక్షేమబోర్డును ఏర్పాటు చేసింది. దాదాపు నెలరోజుల నుంచి ఈ బోర్డు పనిచేస్తున్నది. సమస్యలు, సూచనల కోసం ప్రతి డిపోవద్ద ఈ-బాక్సులను ఏర్పాటుచేసి.. రోజూ సాయంత్రం వాటిని తెరుస్తున్న అధికారులు.. సమస్యలను విభజించి పరిష్కారం చూపుతున్నారు. డీఎం పరిధిలోలేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. ఇక ప్రతివారం బోర్డు తప్పక సమావేశం కావాల్సి ఉండగా.. ఏ రోజు జరపాలన్న దానిపై స్పష్టత లేకపోయింది. ఇకనుంచి ప్రతి మంగళవారం డిపోస్థాయిలో సంక్షేమబోర్డు మీటింగ్ నిర్వహించాలని అధికారులు అన్ని డిపోలకు సూచించారు. ఈ నిర్ణయం వల్ల సమావేశాలు జరుగుతున్న సమయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడంతోపాటు, సమస్యల పరిష్కారానికి జరుగుతున్న కృషిని తెలుసుకునేందుకు దోహదం చేస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు 1200కు పైగా సమస్యలు, సూచనలు రాగా.. వాటిల్లో 950కిపైగా పరిష్కారానికి నోచుకున్నాయని తెలిపారు. డిపోల్లో వస్తున్న ఫిర్యాదులు, వినతులను రోజూ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తుండటంతో.. బస్‌భవన్ నుంచి ఉన్నతాధికారులు సైతం పరిశీలించేందుకు వీలు కలుగుతున్నది.

### ప్రతివారం పక్కాగా మీటింగ్

ఇకనుంచి ప్రతి మంగళవారం తప్పనిసరిగా డిపోమేనేజర్లు అన్ని డిపోల్లో వేల్ఫేర్‌బోర్డు మీటింగ్‌ను నిర్వహించాలని ఆదేశించాం. డీఎం పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని.. వారి పరిధిలోలేని సమస్యలను తక్షణ చర్యకోసం సంబంధిత ఉన్నతస్థాయి అధికారులకు పంపాలని సూచించాం.
**సునీల్‌శర్మ, ఆర్టీసీ ఎండీ**



సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్‌ను వదులుతున్న డ్రోన్




సీడ్‌బాల్స్ ప్రయోగంపై మంత్రి కేటీఆర్ ట్వీట్

# అటవీ విస్తరణకు 'డ్రోన్ సీడింగ్'

- సీఎం కేసీఆర్ పుట్టినరోజున సిరిసిల్లలో ప్రారంభం
- టీ-వర్క్స్ సహకారంతో రూపకల్పన

**హైదరాబాద్ /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా అటవీశాఖ వినూత్న ప్రయోగం చేపట్టింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా డ్రోన్‌తో విత్తనాలను చల్లే విధానాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన మారుత్ సంస్థ తయారుచేసిన డ్రోన్‌తో సిరిసిల్ల సమీపంలోని వీర్నపల్లి గ్రామ శివారులో సోమవారం ఒకేరోజు 15 వేల విత్తన బంతులను చల్లి రికార్డు సృష్టించింది. బంజరు భూములు, బహిరంగ ప్రదేశాల్లో అడవుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలనే సీఎం కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా టీ-వర్క్స్ డ్రోన్ సీడింగ్‌ను అభివృద్ధిచేసింది. భవిష్యత్‌లో రాష్ట్రమంతటా అడవుల పునరుద్ధరణకు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. సిరిసిల్ల జిల్లాలో చేపట్టిన డ్రోన్ సీడింగ్ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. ఈ పద్ధతిలో అడవుల పునరుద్ధరణకు విత్తనాలు చల్లడంపై టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా నిర్వాహకులను అభినందించారు. ఈ ప్రయోగం ద్వారా అటవీ ప్రాంతంలో గంగరావి, వెలగ, గుమ్మడి టేకు, సీమ చింత, రావి, సీతాఫలాలకు సంబంధించిన 15 వేల విత్తన బంతులను చల్లినట్టు మారుత్ సంస్థ సీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీపీ మాలోతు భూల, మారుత్ సంస్థ సీఈవో ప్రేమ్‌కుమార్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఎడ్ల సాగర్, ఏఎమ్సీ వైస్‌చైర్మన్ నీలం రాజేశ్, బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్, టీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, ఎస్సై రామచంద్రం గౌడ్, ఎఫ్బార్వో వేణుగోపాల్, టీఆర్‌ఎస్ మహిళ విభాగం మండల అధ్యక్షురాలు కళ, సర్పంచులు దినకర్, మల్లేశం, శ్రీనివాస్, రవి, ఎంపీటీసీ అరుణ్ తదితర నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం బర్త్‌డే సందర్భంగా మొక్కలు నాటి కేక్ కట్‌చేశారు.

## బాసర ట్రిపుల్ ఐటీతో సీహెచ్‌ఎస్‌ఎస్ ఒప్పందం

**బాసర:** బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీ కళాశాలతో సీహెచ్‌ఎస్‌ఎస్ (సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్) సంస్థ పలు అంశాలపై పరిశోధనలు సాగించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. సోమవారం ట్రిపుల్‌ఐటీ కళాశాలలో వీసీ అశోక్‌కుమార్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ ఒప్పందపత్రాలు తీసుకున్నారు. దేశ, అంతర్జాతీయ భద్రత, ఆహార, నీటి, ఆరోగ్య భద్రత, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి చేపట్టాల్సిన చర్యలు, తీరప్రాంత భద్రత, విదేశీవిధానాలు, మేధస్సు, మిషన్ లర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ తదితర అంశాలపై పరిశోధనలు సాగిస్తుందని వారు తెలిపారు.

## బాలుడి దారుణ హత్య

**కుంటాల:** క్రికెట్ ఆడేందుకు వెళ్లిన ఓ బాలుడు దారుణహత్యకు గురైన ఘటన నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని రాజాపూర్‌లో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాజాపూర్‌కు చెందిన జాదవ్ నితీష్(12) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు రాత్రం తాగాలించారు. సోమవారం ఉదయం పాఠశాల సమీపంలోని మొక్కజొన్న చేనులో రక్తపు మడుగులో పడి ఉన్న నితీష్ మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. నిర్మల్ అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ ఉపేందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌తోపాటు క్లూస్‌టీం బృం దాలతో ఆధారాలు సేకరించారు. హత్యకు ముందు బాలుడు గ్రామానికి చెందిన ఓ యువకుడితో బైక్‌పై వెళ్లినట్టు స్థానికులు చెప్పడంతో పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా దవాఖానకు తరలించారు.


తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, P.R. రీజియన్, కరీంనగర్
ఇ-ప్రొక్యూర్మెంట్ ప్రకటన
eproc. NIT No. 246 to 254/SE/Tenders/2019-20 తేది: 13-02-2020
పనుల సంఖ్య : (09), పనుల పేరు : దిగువ సంతకందారు పరిధిలో 13వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఇబ్రాజ్‌పల్లి నుండి మైసమ్మ గుట్ట వరకు R/F, 2 కల్వర్టుల నిర్మాణం & ప్రతాప్ (H) నుండి నడివీధి గణపతి వరకు CC R/F, హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద గుల్జార్ మాస్క్ B/W మరియు ఇతర అన్ని సివిల్ పనులు, **మొత్తం ECV: రూ. 3.97 కోట్లు. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది & ముగింపు తేది:** 24-02-2020 నుండి 02-03-2020 వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ : **www.tenders.telangana.gov.in** నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, P.R. రీజియన్, కరీంనగర్
DIPR RO No. 2457-DP/CL/Advt/1/2019-20, Dt: 17/02/2020

తెలంగాణ ప్రభుత్వం
S.E. మిషన్ భగీరథ సర్కిల్ కార్యాలయం, వరంగల్ రూరల్
T.N.No. 02,03,04/2019-20 టెండర్ ప్రకటన తేది: 14-02-2020
**పనుల సంఖ్య:** 03, **పనుల పేరు:** దిగువ సంతకందారు పరిధిలో వివిధ గవర్నమెంట్ స్కూల్స్/హాస్టల్స్‌కు నీటి సరఫరా కనెక్షన్ ఏర్పాటు చేయుటకు మిషన్ భగీరథ మెయిన్ గ్రిడ్ పైప్‌లైన్ నుండి పైప్‌లైన్ వేయుట మరియు ఇతర సివిల్ పనులు. మొత్తం ECV: **రూ. 79.40 లక్షలు.** ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండర్ డాక్యుమెంట్ల లభ్యత: **20-02-2020 నుండి 05-03-2020న మ. 3.00 గం.ల వరకు.** టెండర్ల స్వీకరణ తేదీలు: **20-02-2020 నుండి 05-03-2020న సా. 5.00 గం.ల వరకు.** ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేది **06-03-2020న ఉ. 11.30 గం.కు.** తదుపరి వివరాను కార్యాలయం నుండి పొందవచ్చును
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, MB సర్కిల్, వరంగల్ (R)
DIPR R.O.No.2460-DP/CL/Advt/1/2019-20 తేది:17-02-2020

SRI KONDA LAXMAN TELANGANA STATE HORTICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, MULUGU (V&M), SIDDIPET DISTRICT-502279
E-Procurement Tender Notice

| S. No | Notice No | Name of work | Est. Cost | Estimate contract Value | Type of call |
|---|---|---|---|---|---|
| 1 | 04/19-20 | Raising of Compound wall to College of Horticulture, Rajendranagar at Premavathipet side, Rajendranagar. | 28,00,000.00 | 23,08,030.00 | 1st call |
| 2 | 05/19-20 | Construction of Godown for Seed Processing and Storage at VRS, Rajendranagar. | 26,00,000.00 | 21,52,823.00 | 1st call |
| 3 | 06/19-20 | Renovation & extension of First Floor of office building at JVR HRA, Malyal, Mahububabad. | 15,05,000.00 | 12,75,809.00 | 1st call |

Downloading Start Date & Time: 17-02-2020, 5.00 PM
Bid Downloading Last Date & Time: 02-03-2020, 3.00 PM
Submission of Bids Last Date & Time: 02-03-2020, 5.00 PM
Date of Opening of Technical Bid: 03-03-2020, 3.00 PM
Date of Opening of Price Bid: 05-03-2020, 4.00 PM
Contact Officer and Contact Details: Deputy Executive Engineer, 9441540008
For Further Details Please visit: https://tender.telangana.gov.in/
Dr. A. BHAGWAN, REGISTRAR


# మహిళ దారుణహత్య

- వివాహేతర సంబంధమే కారణం
- లొంగిపోయిన నిందితుడు

**హసన్‌పర్తి/దామెర:** వివాహేతర సంబంధం కారణంగా మహిళను దారుణంగా హతమార్చిన ఘటన వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ముచ్చెర్ల శివారులో చోటుచేసుకున్నది. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. కాజీపేట ఏసీపీ రవీంద్రకుమార్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబర్తికి చెందిన చంటి అలియాస్ పున్నంచందర్‌కు భార్యాపిల్లలున్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదేండ్ల క్రితం అతడికి దామెర మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత(32)తో పరిచయమైంది. ఆ తరువాత వివాహేతర సంబంధానికి దారితీసింది. భీమారంలో చదువుకుంటున్న కూతురి వద్దకు వచ్చిన ప్రతిసారి ఆమె.. పున్నం చందర్‌ను కలిసేది. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో పద్ధతిమార్చుకోవాలని ఇద్దరికీ సూచించాడు. ఆదివారం తన కూతురిని కలిసేందుకు బయలుదేరిన ఆమె.. పున్నం చందర్‌కు ఫోన్‌చేసి కేయూ క్రాస్‌రోడ్డుకు పిలిపించుకుని భీమారంలోని తన కూతురి వద్దకు వెళ్లింది. సాయంత్రం 7 గంటల సమయంలో వీరు ఆటోలో ముచ్చెర్ల శివారులోని ఓ మక్కజొన్న చేనులోకి వెళ్లారు. అక్కడఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో పున్నంచందర్ కర్రతో ఆమె తలపై కొట్టడంతో ప్రాణాలు విడిచింది. ఏమిచేయాలో తెలియని అతడు సోమవారం తెల్లవారుజాము వరకు అక్కడే ఉండి అనంతరం పోలీసులకు లొంగిపోయి జరిగిన విషయం చెప్పాడు. ఏసీపీ రవీంద్రకుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రావు, ఎస్సైలు పవన్‌కుమార్, రవీందర్ ఘటన స్థలానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



## అధికారులతీరుపై నిరసన

కలెక్టరేట్ భవనంపైకి ఎక్కి 11 మంది రైతుల ఆత్మహత్యాయత్నం

**నాగర్‌కర్నూల్ క్రైం:** తమకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలుకు చెందిన 11 మంది రైతులు సోమవారం కలెక్టరేట్ భవనంపైకి చేరి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. డీఆర్వో మధుసూదన్‌నాయక్ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా వారు వినలేదు. కలెక్టర్ అక్కడకు చేరుకుని రైతులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యకు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగి వచ్చారు.

## ఎస్సారార్ @ 24.755 టీఎంసీలు

కొనసాగుతున్న ఎత్తిపోతలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ/కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి):** కాళేశ్వరం లింక్-1, 2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్ నుంచి సరస్వతి బరాజ్‌కు గడిచిన రెండు రోజుల్లో 3 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. సోమవారం సైతం 1, 3, 4, 5,7వ మోటర్లను నడిపించి టీఎంసీ నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలించారు. పెద్దపల్లి జిల్లా కాసిపేటలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో సోమవారం 1, 2, 5, 6, 7, 8వ మోటర్లను ఆన్‌చేశారు. ఇక్కడి డెలివరీ సిస్టర్న్ ద్వారా గోదావరి జలాలు మంథని మండలం సిరిపురంలోని పార్వతి బరాజ్‌లోకి చేరుతున్నాయి. అలాగే లింక్-2లో ఆరో ప్యాకేజీలో భాగంగా ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో సోమవారం మూడు మోటర్లను నడిపించి 9,450 క్యూసెక్కుల నీటిని ఏడో ప్యాకేజీలోని నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. ఇక్కడినుంచి జలాలు ఎనిమిదో ప్యాకేజీ లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్ సర్జ్‌పూల్‌కు చేరుతున్నాయి. ఇక్కడ ప్రస్తుతం 1, 3, 4వ మోటర్లను అధికారులు నడిపిస్తున్నారు. ఒక్కో పంపు 3,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా రోజుకు 9,450 క్యూసెక్కుల జలాలు ఎస్సారార్‌కు వెళ్తున్నాయి.

**ఎస్సారార్ నుంచి దిగువకు 9,083 క్యూసెక్కులు..** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతున్నది. ఆదివారం నాలుగు గేట్లు ఎత్తిన అధికారులు, సోమవారం సైతం అవే గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. నాలుగు రివర్స్ స్లూయిస్ గేట్లతోపాటు నాలుగు గేట్ల ద్వారా 9,083 క్యూసెక్కుల నీటిని ఎల్‌ఎండీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఎస్సారార్ జలాశయంలో 24.755 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎస్సారార్ రిజర్వాయర్ నుంచి ఎల్‌ఎండీకి 14,735 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, 4,688 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 9.349టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 41,056 | 12,046 |
| 202 | 68 |

ముడి చమురు (బ్రెంట్) 57.50 డాలర్లు

## భారత వృద్ధి అంచనాలో కోత

6.6 శాతం కాదు 5.4 శాతమే: మూడీస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** భారత వృద్ధి అంచనాను మరోసారి కోత విధించింది అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్. ప్రస్తుత సంవత్సరంలో గతంలో 6.6 శాతంగా ఉంటుందని అంచనావేసిన మూడీస్.. ఈసారి దీనిని 5.4 శాతానికి తగ్గించింది. దేశీయ ఆర్థిక పరిస్థితులు వేగవంతంగా కోలుకోకపోవడం ఇందుకు కారణమని విశ్లేషించింది. గడిచిన రెండేండ్లుగా మందకొడి వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్..ప్రస్తుత త్రైమాసికం నుంచి వృద్ధి బాట పడుతున్నప్పటికీ, అంచనావేసిన స్థాయిలో లేదని మూడీస్ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఏడాది 5.4 శాతం వృద్ధి అంచనావేస్తున్న మూడీస్.. 2021లో మాత్రం 5.8 శాతానికి చేరుకోనున్నదని పేర్కొంది. గతంలో 6.6 శాతంగాను, 6.7 శాతంగా వెల్లడించింది. ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధిరేటుకు కేంద్రం ఎలాంటి ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని, పన్ను రేట్లు తగ్గించకపోవడం మరో కారణమని విశ్లేషించింది. ఆహార ద్రవ్యోల్బణంతో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లాయని తెలిపింది.



# మూడోరోజు నష్టాలే

## సెన్సెక్స్ 202, నిఫ్టీ 68 పాయింట్ల క్షీణత

**ముంబై, ఫిబ్రవరి 17:** వరుసగా మూడోరోజు దేశీయ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. దేశీయ మందకొడి పరిస్థితులకు తోడు కరోనా వైరస్‌తో ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తంకావడంతో మదుపరుల్లో ఆందోళన తీవ్రతరమైంది. ఫలితంగా ప్రారంభం నుంచే నష్టాలకు మొగ్గుచూపిన పెట్టుబడిదారులు చివరి వరకు అదే తీరును కొనసాగించారు. ఒక దశలో 400 పాయింట్ల వరకు పతనం చెందిన బీఎస్‌ఈ సెన్సెక్స్ చివరకు 202.05 పాయింట్లు నష్టపోయి 41,055.69 వద్ద ముగియగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 67.75 పాయింట్లు పతనం చెంది 12,045.80 వద్ద స్థిరపడింది. నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఓఎన్‌జీసీ షేరు 3.20 శాతం పడిపోయి టాప్‌లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీలు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోగా.. ఎస్బీఐ, ఐటీసీ, హెచ్‌సీఎల్‌టెక్, ఎల్‌అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, పవర్‌గ్రిడ్, హీరో మోటోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, మారుతి, టెక్ మహీంద్రా, ఎంఅండ్‌ఎం, భారతీ ఎయిర్‌టెల్‌లు నష్టపోయాయి. కానీ, టైటాన్ 1.86 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. నెస్లె ఇండియా, టీసీఎస్, టాటా స్టీల్, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే చమురు అండ్ గ్యాస్ 2.39 శాతం, యుటిలిటీ 2.07 శాతం, పవర్ 1.76 శాతం, రియల్టీ 1.53 శాతం, హెల్త్‌కేర్ 1.50 శాతం చొప్పున పతనమయ్యాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వృద్ధి అంచనాల్లో కోత విధిస్తున్నట్లు మూడీస్ ప్రకటించడం కూడా మదుపరుల్లో ఆందోళనను పెంచింది. మరోవైపు కరోనా వైరస్‌తో చైనాలో 1,800 మంది మరణించడం, ఈ వైరస్ ప్రపంచదేశాలను గడగడలాడిస్తుండటం కూడా అంతర్జాతీయ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది.

### 11 ఏండ్ల కనిష్ఠానికి పీ-నోట్స్ పెట్టుబడులు

పార్టిసిపేటరీ నోట్స్(పీ-నోట్స్) ద్వారా దేశీయ క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చే పెట్టుబడులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గతేడాది డిసెంబర్ చివరినాటికి రూ. 64,537 కోట్లకు తగ్గాయి. గత 11 ఏండ్లలో ఇదే కనిష్ఠం. దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)లు నేరుగా పీ-నోట్స్ ద్వారా పెట్టుబడులు పెట్టడానికి అవకాశం కల్పించింది సెబీ. ఇందుకోసం ఎలాంటి అనుమతులు అవసరం లేదు. స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నివేదిక ప్రకారం..డిసెంబర్ చివరినాటికి ఈక్విటీ, డెబిట్, డెరివేటివ్ మార్కెట్లోకి రూ.64,537 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపింది. నవంబర్‌లో 13 నెలల కనిష్ఠ స్థాయి రూ.69,670 కోట్లకు తగ్గిన పెట్టుబడులు ఆ మరుసటి నెలలో మరింత తగ్గడం విశేషం. ఫిబ్రవరి 2009లో వచ్చిన రూ.60,948 కోట్ల పెట్టుబడుల తర్వాత ఇదే కనిష్ఠం. నవంబర్ చివరినాటికి ఈక్విటీల్లోకి రూ.52,486 కోట్ల పెట్టుబడులు రాగా, డెబిట్ మార్కెట్లోకి రూ. 11,415 కోట్లు, డెరివేటివ్‌లోకి రూ.636 కోట్లు వచ్చాయి.

# ఎయిర్‌టెల్ @10 వేల కోట్లు

## ఏజీఆర్ బకాయిలు చెల్లించిన సంస్థ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:**

తమ ఏజీఆర్ బకాయిల్లో రూ.10,000 కోట్లను చెల్లించినట్లు సోమవారం భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. సుప్రీం కోర్టు ఆగ్రహం నేపథ్యంలో టెలికం శాఖ చేస్తున్న ఒత్తిడితో బాకీలను చెల్లించే పనిలోపడ్డారు టెలికం ఆపరేటర్లు. భారతీ ఎయిర్‌టెల్‌తోపాటు వొడాఫోన్ ఐడియా తదితర సంస్థలకు తక్షణమే బకాయిలను చెల్లించాలంటూ ఈ నెల 14న టెలికం శాఖ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఏజీఆర్ బకాయిల విషయంలో తామిచ్చిన తీర్పుపై టెలికం శాఖ డెస్క్ అధికారి స్టే విధిస్తారా అంటూ గత శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం మండిపడిన నేపథ్యంలో సర్కిళ్లు, జోన్లవారీగా టెలికం శాఖ తాఖీదులతో స్పందించింది. వెంటనే బాకీలు తీర్చకపోతే లైసెన్స్ నిబంధనల ప్రకారం తదుపరి నోటీసులు ఇవ్వకుండానే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిజానికి గత నెల 23కల్లా ఏజీఆర్ బకాయిలన్నింటినీ తీర్చాలని టెలికం సంస్థలకు సుప్రీం గడువిచ్చింది. దీంతో ఈ నెల 20లోగా రూ.10,000 కోట్లను, కోర్టిచ్చిన గడువు వచ్చే నెల 17కల్లా మిగతా మొత్తాన్ని చెల్లిస్తామని టెలికం శాఖకు ఎయిర్‌టెల్ తక్షణమే తెలియజేసింది. ఈ క్రమంలోనే భారతీ ఎయిర్‌టెల్ (విలీన సంస్థ టెలినార్ ఇండియాసహా) తరఫున రూ. 9,500 కోట్లు, భారతీ హెక్సాకామ్ కోసం రూ.500 కోట్లు చెల్లించినట్లు ఓ ప్రకటనలో సంస్థ యాజమాన్యం తాజాగా తెలిపింది. స్వయం మదింపు ప్రకియ అనంతరం మిగతా బకాయిలను చెల్లిస్తామని స్పష్టం చేసింది. నెల రోజుల్లో ఇదంతా పూర్తి కాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం టెలికం శాఖకు భారతీ ఎయిర్‌టెల్ బకాయిలు రూ.35,586 కోట్లుగా ఉన్నాయి. ఇవన్నీ కూడా లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రం వినియోగ చార్జీల బాకీలే. కాగా, ఏజీఆర్ బకాయిల కేసును పరిష్కరించుకోవడంలో భాగంగా ప్రభుత్వానికి రూ.2,197 కోట్లు చెల్లిస్తున్నట్లు సోమవారం టాటా గ్రూప్ సంస్థ టాటా టెలీ సర్వీసెస్ లిమిటెడ్ ప్రకటించింది. ఎయిర్‌టెల్‌లో టాటా టెలీసర్వీసెస్‌ను విలీనం చేసిన సంగతి విదితమే.

### వొడాఫోన్ ఐడియాకు ఎదురుదెబ్బ

ఏజీఆర్ బకాయిల చెల్లింపుల్లో సుప్రీం కోర్టుకు వొడాఫోన్ ఐడియా చేసిన ప్రతిపాదన తిరస్కరణకు గురైంది. సోమవారం రూ.2,500 కోట్లు, శుక్రవారంలోగా మరో రూ.1,000 కోట్లను ఇస్తామని సంస్థ చేసిన అభ్యర్థనను సుప్రీం తోసిపుచ్చింది. అంతేగాక సంస్థపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని వొడా ఐడియా తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగీ చేసిన విజ్ఞప్తిని కూడా జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం కొట్టివేసింది. అయినప్పటికీ తమ ప్రతిపాదన ప్రకారం వెంటనే రూ.2,500 కోట్లు చెల్లిస్తామని, ఈ వారం ఆఖరుకల్లా మరో రూ.1,000 కోట్లను టెలికం శాఖకు అందజేస్తామని సోమవారం రాత్రి ఓ ప్రకటనలో వొడాఫోన్ ఐడియా తెలియజేసింది. మిగతా బకాయిలను ఎలా? చెల్లించగలమన్న దాన్ని సంస్థ బోర్డు నిర్ణయిస్తుందని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరించింది. సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) ప్రకారం టెలికం శాఖకు వొడాఫోన్ ఐడియా రూ.53,000 కోట్లకు పైగా బకాయిపడింది. ఇందులో రూ.24,729 కోట్లు స్పెక్ట్రం బకాయిలవగా, మరో రూ.28,309 కోట్లు లైసెన్స్ ఫీజు. మొత్తం 15 సంస్థలు టెలికం శాఖకు ఇవ్వాల్సిన ఏజీఆర్ బకాయిలు రూ.1.47 లక్షల కోట్లుగా ఉన్నా యి. ఇందులో స్పెక్ట్రం వినియోగ చార్జీల బకాయిలు రూ.55,054 కోట్లైతే, రూ.92,642 కోట్లు లైసెన్స్ ఫీజు బాకీలు. టెలికం సంస్థల వార్షిక సవరణ స్థూల ఆదాయం లెక్కింపులో నాన్-కోర్ బిజినెస్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్నీ కలుపాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీం కోర్టు గతేడాది అక్టోబర్‌లో సమర్థించడంతో ఏజీఆర్ బకాయిలు ఈ స్థాయిలో పెరిగాయి.



## ద్రవ్యలోటును తగ్గిస్తుంది

**ఏజీఆర్** బకాయిల చెల్లింపు.. జీడీపీలో ద్రవ్యలోటు తగ్గుదలకు దోహదం చేస్తుందని ఎస్బీఐ ఆర్థికవేత్త ఒకరు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో ద్రవ్యలోటును 3.8 శాతానికి కేంద్ర ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో ఏజీఆర్ బకాయిలు వసూలైతే అది 3.5 శాతానికే పరిమితం కాగలదని అంటున్నారు. మరోవైపు సుప్రీం కోర్టు ఇచ్చిన ఏజీఆర్ తీర్పు టెలికం రంగేతర ప్రభుత్వ సంస్థలకు వర్తించబోదనే అనుకుంటున్నట్లు చమురు శాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది జనవరి 23లోగా ఏజీఆర్ బకాయిలను తీర్చాలని నిరుడు అక్టోబర్ 24న సుప్రీం కోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. దీన్ని ఉల్లంఘించారంటూ ఈ నెల 14న అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతీ విదితమే. ఈ క్రమంలో టెలికం శాఖ నోటీసులు.. టెలికం సంస్థల బకాయిల చెల్లింపులు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన్ పైవిధంగా స్పందించారు. ఏజీఆర్ బకాయిల్లో గెయిల్ ఇండియా రూ.1.83 లక్షల కోట్లు, ఆయిల్ ఇండియా దాదాపు రూ.48,500 కోట్లు, పవర్ గ్రిడ్ రూ.21,953.65 కోట్లు, గుజరాత్ నర్మదా వ్యాలీ ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ రూ.15,020 కోట్లున్నాయి. ఈ చెల్లింపులపై ఆయా సంస్థలు న్యాయపోరాటం చేస్తున్నది తెలిసిందే. టెలికం రంగేతర సంస్థల ఏజీఆర్ బకాయిలు మొత్తం రూ.2.65 లక్షల కోట్లుగా ఉన్నాయి.

# ఆగొద్దు అంతే

## దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సంస్కరణలు వేగంగా కొనసాగాలి

### పీటీఐ ఇంటర్వ్యూలో ఆర్బీఐ గవర్నర్ దాస్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనం పోవాలంటే కేంద్ర ప్రభుత్వ సంస్కరణలు కొనసాగుతూనే ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. సోమవారం ఇక్కడ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జీడీపీ పురోగతికి నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని సూచించారు. 11 ఏండ్ల కనిష్ఠ స్థాయి నుంచి వృద్ధిరేటు కోలుకోవాలంటే ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే నిర్ణయాలు ఎన్నో తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మార్కెట్‌లో క్షీణించిన డిమాండ్, వినియోగ సామర్థ్యాన్ని తిరిగి బలపరిచేందుకు ఇటీవలి బడ్జెట్‌లో ప్రయత్నాలు జరిగాయన్నారు. ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020-21)గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భూ, కార్మిక సంస్కరణలు ముఖ్యమని, వ్యవసాయ మార్కెటింగ్‌లో ప్రభావవంతమైన చర్యలు తీసుకోవడం, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం ప్రధానమన్నారు. ఏపీఎంసీ చట్టంలో చెప్పుకోదగ్గ సవరణలు కూడా అవసరమేనన్నారు. ఇక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)ల ప్రగతికి చర్యల కొరత కనిపిస్తున్నదన్న దాస్.. రూ.25,000 కోట్ల తొలి లాంగ్ టర్మ్ రివర్స్ రెపో ఆపరేషన్ (ఎల్‌టీఆర్‌వో) కోసం రూ.1.94 లక్షల కోట్ల బిడ్లు దాఖలైయ్యాయని చెప్పారు.

### మందగమనాన్ని ఎప్పుడో గుర్తించాం

గతేడాది ఫిబ్రవరిలోనే దేశ ఆర్థిక మందగమనాన్ని గుర్తించామని దాస్ తెలిపారు. అందుకే జీడీపీని పరుగులు పెట్టించేందుకు తమవంతు సాయంగా వరుసగా ఐదు ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను తగ్గించామని చెప్పారు. కానీ డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న సంకేతాలు అందడంతో కోతలకు విరామం ఇచ్చామన్నారు. ఈ నెల ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలోనూ రెపో, రివర్స్ రెపోల జోలికి వెళ్లలేదని వివరించారు. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక జీడీపీ గణాంకాలు.. జూలై-సెప్టెంబర్‌లో నమోదైన 4.5 శాతం కంటే తక్కువగా ఉండొచ్చన్న అంచనాలు వినిపిస్తున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ కోలుకుంటుందని దాస్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) దేశ వృద్ధిరేటును 5 శాతంగానే అంచనావేసిన ఆర్బీఐ.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 6 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ఇక దేశ, విదేశీ ఆర్థిక విపత్కర పరిస్థితులు కార్పొరేట్ రంగంలో మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)పై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. అలాగే టెలికం సంస్థల ఏజీఆర్ బకాయిల అంశాన్ని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

### సార్స్ కంటే కరోనా పెద్దదే

చైనాలో విజృంభిస్తూ ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న కరోనా వైరస్‌పై దాస్ స్పందిస్తూ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం చాలా ఎక్కువేనని అభిప్రాయపడ్డారు. 2003లో తలెత్తిన సార్స్ సమస్య కంటే కరోనా తీవ్రంగా ఉందన్న ఆయన వృద్ధిరేటును ఈ వైరస్ పెద్ద దెబ్బే తీస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా పాత్ర కీలకమని, అలాంటి ఆ దేశ ఆర్థిక పరిస్థితులనే ఇప్పుడు కరోనా వైరస్ తలకిందులు చేసేలా భయపెడుతున్నదని వ్యాఖ్యానించారు. చైనా ఆర్థిక మందగమనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సహజంగానే ఉంటుందని గుర్తుచేశారు. ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ కరోనాపై ఆందోళన వెలిబుచ్చారని, దాని వల్ల అన్ని దేశాలు ఈ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వ్ బ్యాంక్‌గా తామూ వైరస్ వ్యాప్తిని, దాని ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని చెప్పారు.

## బ్రిటన్, ఫ్రాన్స్‌లను దాటేశాం

### ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ గతేడాది ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలను అధిగమించి ఈ ఘనతను సాధించినట్లు అమెరికా ఆధారిత వరల్డ్ పాపులేషన్ రివ్యూ తమ నివేదికలో వెల్లడించింది. నిరుడు బ్రిటన్ జీడీపీ విలువ 2.83 లక్షల కోట్ల డాలర్లుగా, ఫ్రాన్స్ 2.71 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్నాయన్న సంస్థ.. భారతీయ ఆర్థిక వ్యవస్థ విలువ 2.94 లక్షల కోట్ల డాలర్లుగా ఉందన్నది. ఫలితంగా భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ప్రకటించింది. కాగా, పర్చేజింగ్ పవర్ పారిటీ (పీపీపీ) నిబంధనల ప్రకారం భారత జీడీపీ విలువ 10.51 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్నది. ఇది జపాన్, జర్మనీల కంటే అధికం కావడం గమనార్హం. ఇక భారత జీడీపీ తలసరి ఆదాయం 2,170 డాలర్లుగా ఉందని, అమెరికాది 62,794 డాలర్లు అని చెప్పింది. దేశ ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం కీలకమని, దీని వాటా 60 శాతంగా ఉందని, ఉద్యోగాల్లో 28 శాతంతో ఉన్నదని వెల్లడించింది. తయారీ, వ్యవసాయ రంగాలూ దేశ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపింది.

## బీఎస్-6తో బర్గ్‌మ్యాన్ స్ట్రీట్

### మార్కెట్లోకి సుజుకీ స్కూటర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ సుజుకీ మోటర్‌సైకిల్ ..సోమవారం దేశీయ మార్కెట్లోకి బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన 125సీసీ సామర్థ్యం కలిగిన బర్గ్‌మ్యాన్ స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఢిల్లీ షోరూంలో ఈ స్కూటర్ ధరను రూ.77,900గా నిర్ణయించింది. ఫ్యూయల్ ఇంజెక్షన్ టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ స్టార్ట్ కలిగిన ఈ స్కూటర్‌తో సరికొత్త డ్రైవింగ్ అనుభవం లభించనున్నదని కంపెనీ ఎండీ కోయిచిరో హిరావ్ తెలిపారు. అల్యూమినియం ఫోర్-స్ట్రోక్ సింగిల్-సిలిండర్ 124 సీసీ ఇంజిన్ కలిగిన ఈ స్కూటర్ 8.7 పీఎస్‌ల శక్తినివ్వనున్నది. మరింత పొడువుగా సీటు, సౌకర్యవంతంగా అడుగు పెట్టుకోవడం, మొబైల్ చార్జింగ్ వంటి ఆధునీక ఫీచర్స్ వీటిలో ఉన్నాయన్నారు.

## జేఎస్‌డబ్ల్యూ చేతికి జీఎమ్మార్ ఒడిశా ప్లాంట్

### విలువ రూ.5,321 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** దేశీయ కుబేరుల్లో ఒకరైన సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ..జీఎమ్మార్ ఎనర్జీ లిమిటెడ్‌కు ఒడిశాలో ఉన్న 1,050 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను కొనుగోలు చేయబోతున్నది. ఒప్పందం విలువ రూ.5,321 కోట్లు. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య సోమవారం అంగీకార ఒప్పందం కుదిరింది. జీఎమ్మార్ కమలంగ ఎనర్జీ లిమిటెడ్ నిర్వహిస్తున్న 1,050 మెగావాట్లు(3X350 మెగావాట్లు) థర్మల్ ప్లాంట్..ఇక జీఎస్‌డబ్ల్యూ ఎనర్జీ చేతికి చేరబోతున్నది. ఈ కొనుగోలు ఒప్పందం పూర్తైన తర్వాత జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 5,609 మెగావాట్లకు చేరుకోనున్నది. ఈ ఒప్పందానికి రెగ్యులేటర్లు అనుమతించాల్సి ఉంటుంది. రూ.5,321 కోట్లుగా లెక్కకట్టిన జేకేఈఎల్ విలువలో కంపెనీ ప్రమోటర్లకు రూ.755 కోట్లు చెల్లించనున్న జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ..మరో రూ.615 కోట్లు ఇతర వాటి కోసం కేటాయించనున్నది. మిగతా బ్యాలెన్స్ రూ.3,951 కోట్ల కంపెనీ బకాయిలు జేఎస్‌డబ్ల్యూకి బదిలీకానున్నాయి. గతేడాది జేకేఈఎల్ 263 మెగావాట్ల విద్యుత్‌ను ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికి, 283 మెగావాట్ల విద్యుత్‌ను బీహార్ ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా రూ.2,195 కోట్ల ఆదాయాన్ని గడించింది.

## ఓయో నష్టం రూ.2,390 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రముఖ ఆతిథ్య సేవల సంస్థ ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ భారీ నష్టాలను ప్రకటించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 335 మిలియన్ డాలర్ల(రూ.2,390 కోట్లకు పైమాటే) నష్టం వచ్చింది. గతేడాది వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించడం వల్లనే లాభాల్లో గండి పడిందని పేర్కొంది. అంతక్రితం ఏడాది కూడా సంస్థ 52 మిలియన్ డాలర్లు లేదా రూ.370 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. నష్టాలు భారీగా పెరిగినప్పటికీ ఆదాయంలో మాత్రం సంస్థకు భారీ ఊరట లభించింది. 2018-19లో సంస్థ ఏకంగా 951 మిలియన్ డాలర్లు లేదా రూ.6,785 కోట్ల ఆదాయాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఆర్జించిన 211 మిలియన్ డాలర్లు లేదా రూ.1,500 కోట్లతో పోలిస్తే ఆరు రెట్లు పెరిగింది. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో భారత్ నుంచి 63.5 శాతం సమకూరుతుండగా, అదే ఇతర దేశాల నుంచి 36.5 శాతం లభించింది. భారత్‌తోపాటు ఇతర దేశాల్లోనూ వ్యాపారం ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోకపోవడంతో గతేడాది సంస్థ ఏకంగా 2వేల మందికిపైగా ఉద్యోగులను తొలగించింది.

# ఎంఎస్‌ఎంఈలకు రూ.50 వేల కోట్లు

## వచ్చే రెండేండ్లలో రుణాలు అందిస్తాం: ఐవోబీ ఈడీ ఏకే శ్రీవాత్సవ



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్యాంక్ ఈడీ అజయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:** దేశీయ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఎంఎస్‌ఎంఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్. ఈ రంగానికి ఇప్పటి వరకు రూ.31 వేల కోట్లకు పైగా రుణాలు అందించిన బ్యాంక్..వచ్చే ఏడాదిన్నర నుంచి రెండేండ్లలోగా వీటిని రూ.50 వేల కోట్లకు పెంచనున్నట్లు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. ఎంఎస్‌ఎంఈ రంగానికి రుణాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా 200 శాఖలను గుర్తించినట్లు, అలాగే 700 మంది ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చినట్లు హైదరాబాద్‌లో జరిగిన ఎంఎస్‌ఎంఈ కస్టమర్స్ అవుట్‌రిచ్ ప్రొగ్రామ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ వివరాలు వెల్లడించారు. బ్యాంక్ ప్రధానంగా రిటైల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ రంగాలకు అత్యధికంగా రుణాలు అందిస్తున్నదన్నారు. వీటిలో ఎంఎస్‌ఎంఈ వాటానే అధికమని పేర్కొన్న ఆయన..రూ.450 కోట్ల మేర గృహ రుణాలు, బంగారు-ఆభరణాల తాకట్టుపై రూ.3,200 కోట్ల రుణాలు అందించినట్లు, ఈ ఏడాది రూ.5 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సరాసరిగా 2 శాతంగా నమోదవుతున్న ఎన్‌ఐఎం వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి మూడు శాతానికి చేరుకునే దానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రస్తుత త్రైమాసికంలో బ్యాంక్ లాభాల్లోకి వచ్చే అవకాశం ఉన్నదన్న ఆయన..గతేడాదితో పోలిస్తే నికర ఎన్‌పీఏ ఆరు శాతం కంటే తగ్గిందన్నారు.

### 2020-21లో ఎఫ్‌పీవోకి బ్యాంక్

వచ్చే ఏడాది ఎఫ్‌పీవో ద్వారా నిధులను సేకరించేయోచనలో బ్యాంక్ ఉన్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. ఎంతమేర సేకరించే విషయంపై ఆయన స్పష్టతనివ్వకపోయినప్పటికీ త్వరలో జరుగనున్న బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

# కార్వీ లాంటి మోసాలకు చెక్

## త్వరలో నూతన మార్గదర్శకాలు: సెబీ చైర్మన్ త్యాగీ



**ముంబై, ఫిబ్రవరి 17:** కార్వీ బ్రోకింగ్ లాంటి మోసాలకు చెక్ పెట్టడానికి త్వరలో నూతన మార్గదర్శకాలను విడుదల చేయబోతున్నట్లు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్ అజయ్ త్యాగీ తెలిపారు. కార్వీ బ్రోకింగ్ సర్వీసెస్ లిమిటెడ్(కూఎస్‌బీఎల్) మాదిరిగా ఇతర సంస్థలు క్లయింట్లను మోసం చేసి తమ సొంత అవసరాలకు వాడుకుంటున్న సంస్థలపై నిఘా పెంచడానికి త్వరలో నూతన చట్టాన్ని తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. కేఎస్‌బీఎల్ తిరిగి చెల్లింపులపై వేచి చూసే దోరణి అవలంభిస్తున్నట్లు, ఈ నెల 14 నాటికి సంస్థ రూ.1,189 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. వీటిలో బ్యాంకులకు చెల్లించాల్సినవి రూ.511కోట్లు. మొత్తంగా సెక్యూరిటీలు రూ.183 కోట్లు తగ్గగా, ఫండ్లు రూ.495 కోట్లు తగ్గినట్లు గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. గతేడాది నవంబర్‌లోనే కేఎస్‌బీఎల్‌లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించి దీని లైసెన్స్‌లను రద్దుచేసినట్లు చెప్పారు. ఈ విషయంలో కార్వీతోపాటు ఎన్‌ఎస్‌ఈలకు కూడా నోటీసును జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ బకాయిల చెల్లింపుల విషయంలో సంస్థకూ ఊరట కల్పించే విషయాన్ని సూచించినట్లు, వీటిలో కార్వీకు అనుబంధ సంస్థల్లో వాటాను విక్రయించడం ద్వారా సమకూరిన నిధులను వచ్చే నెల చివరి వరకు ఈ బకాయిలకు చెల్లించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు ఆయన చెప్పారు. పెట్టుబడిదారుల శ్రేయస్సుకు పెద్దపీట వేయడం తోపాటు వీరి పెట్టుబడులను తిరిగి చెల్లించడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు, ఇందుకోసం ఏ చర్యలైనా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చారు.

### వచ్చే నెల చివర్లో పదవీ విరమణ

సెబీ చైర్మన్‌గా మూడేండ్ల పాటు విధులు నిర్వహించిన త్యాగీ వచ్చే నెల 31న పదవీ విరమణ చేయబోతున్నారు. సెబీ మార్గదర్శకాలకు లోబడి పారదర్శకంగా చర్యలు తీసుకున్నట్లు, సెబీ చాలా పెద్ద సంస్థయని, ప్రతిక్షణం సవాలుతో కూడుకొనియున్నదని వ్యాఖ్యానించారు.

### సీఎండీలను సగం సంస్థలే విడగొట్టాయి..

స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో సగం కంపెనీలు మాత్రమే చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పోస్ట్‌లను విడగొట్టాయని, అందుకోసం ఈ కాలపరిమితిని ఏప్రిల్ 2020 వరకు పొడిగించినట్లు త్యాగీ వెల్లడించారు. కేవలం 500 సంస్థల్లో 250 కంపెనీలు ఇదివరకు విడగొట్టాయి. అలాగే పెట్టుబడులపై సలహాలు ఇచ్చేవారు, సాండ్‌బాక్స్‌లపై కఠినమైన నిబంధనలను అమలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వ్యక్తిగత సలహాలు ఇచ్చేవారు డిస్ట్రిబ్యూషన్ సేవలను కొనసాగించరాదని స్పష్టం చేసింది.

# తెలంగాణ మేథోసంపత్తి అవార్డులు

## ఏప్రిల్ 22న ప్రదానోత్సవం • టాప్-3 రాష్ట్రాల్లో నిలవాలన్నదే లక్ష్యం: జయేశ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్రం మేథోసంపత్తి అవార్డులను ప్రకటించింది. దీనికి టీఎస్ఐపీఏ 2020 అని నామకరణం చేసింది. తెలంగాణకు చెందిన ఐపీ ఛాంపియన్ల కోసం ఈ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సంస్థలను గౌరవించాలన్న ఉన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నది. దీనికి సీఐఐ సహకారం అందిస్తున్నది. కొత్త వ్యాపార మార్గాలను అన్వేషించేవారిని ప్రోత్సహించడంలో భాగంగాఈ అవార్డుల్ని అందజేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలు, పెద్ద, మధ్యతరహా, చిన్న సంస్థలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు వంటి ఏడు విభాగాల్లో అందించనున్న ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది మార్చి 10. ఏప్రిల్ 22న ప్రపంచ మేథో సంపత్తి హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. బలమైన మేథోసంపత్తి (ఐపీ) వ్యూహంతో విజయవంతంగా ఎదిగిన సంస్థలను ప్రోత్సహించడంతో పాటు.. ఈ వ్యవస్థను అభివృద్ధి పర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పారు. మేథోసంపత్తి హక్కులను నమోదు చేయడంలో మొదటి మూడు రాష్ట్రాల్లో నిలవాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. మేథోసంపత్తి హక్కుల యజమానులను ప్రోత్సహించడానికి అవసరమయ్యే వ్యవస్థను అభివృద్ధిపరుస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ చైర్మ న్ రాజు మాట్లాడుతూ.. విజ్ఞానం ఆధారంగా పని చేసే వ్యవస్థను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తున్నదని తెలిపారు.

నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 18 ఫిబ్రవరి 2020 WWW. NTNEWS.COM /nt.zindagi

**గ్లోబల్ వార్మింగ్ ముప్పు నుంచి భవిష్యత్ తరాలను కాపాడాలన్నదే ఆయన లక్ష్యం. మానవాళికి ఆశ్రయమిస్తున్న భూగోళాన్ని రక్షించుకోవాలన్నదే ఆయన నినాదం. అందుకే ప్రతి ఒక్కరికీ వినిపించేలా.. అందరి కండ్లు తెరిపించేలా.. చెప్పాలనుకున్నారు. ప్రాణాలకు తెగించి, కఠోర శ్రమకోర్చి, ఎముకలు కొరికే చలి ఉండే ఉత్తర ధ్రువానికి (ఆర్కిటిక్ ఖండం) చేరుకొని ప్రపంచానికి సందేశమిచ్చారు. గతంలో ఏ ఒక్కరూ చేయని సాహసం చేసి పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని చాటి చెప్పారు. జీవితాన్ని, ఆస్తిని, సంపాదనను తృణప్రాయంగా వదులుకొని, నచ్చిన ఫ్యాషన్ డిజైనింగ్‌ను పక్కన పెట్టి, మూడు జతల వస్ర్తాలతో ప్రపంచమే తన ఇల్లుగా భావించి భూమాత రక్షణకు కదిలారు. ఆయనే డాక్టర్ సతీష్ శిఖా.**



చౌటుప్పల్‌లోని ప్రభుత్వ పాఠశాల పిల్లలతో అమెరికా మిస్ వరల్డ్ - 2017



పాఠశాల పిల్లలతో మిస్ వరల్డ్ ఫ్రాన్స్ - 2017



## పర్యావరణ వీరుడు..
# చిన్నారుల దేవుడు!

**ఓ రోజు** సతీష్ స్నేహితుల్లో ఒకరు తన కూతురిని వెంటబెట్టుకొని వచ్చాడు. కాళ్లు పనిచేయకుండా, కనీసం నిలబడలేని స్థితిలో ఉన్న ఆ అమ్మాయిని చూసి చలించిపోయారు సతీష్. అలాంటి స్థితిలో ఉన్న అమ్మాయిని చూస్తూ ఊరుకోలేకపోయారు. ఏదో చేయాలనుకున్నారు. ఆక్షణమే ఆమెలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకోసం తాను ప్రత్యేకంగా రూపొందించిన గౌన్‌ను వేలం వేయాలనుకున్నారు. వచ్చిన రూ. 94లక్షలను వాళ్లకందించారు. వెంటనే తన స్నేహితుడి కూతుర్ని 'నీ కోరిక ఏంటి?' అని అడిగితే.. తనకు ఇష్టమైన మ్యూజిక్ బ్యాండ్ 'ఫాలోడ్‌బాయ్' ఆటోగ్రాఫ్ ఇప్పించాలని కోరింది. 'సరే ఆటోగ్రాఫ్ తెస్తాను. నువ్వు నిలబడి నడిచే యత్నం చేయాలి' అంటూ షరతు పెట్టారు సతీష్. రెండు రోజులు శ్రమించి ఆటోగ్రాఫ్ సంపాదించారు. దాన్ని చూడగానే నిలబడటమే కష్టంగా ఉన్న ఆ అమ్మాయి.. సంతోషంతో నిల్చొని అడుగులేసే ప్రయత్నం చేసింది. ఆ పాప మొహంలో కనిపిస్తున్న నవ్వులు సతీష్‌ను ఆలోచనలో పడేశాయి. రాబోయే తరాల పిల్లలకు అలాంటి నవ్వులు దక్కాలంటే తన వంతుగా ఏదైనా చేయాలనుకున్నారు. అప్పుడే తన మనసులో ఓ ఆశయం ఊపిరి పోసుకుంది. చిన్నా పెద్దా అందరికీ భవిష్యత్తుకే పెద్ద సవాలుగా మారిన గ్లోబల్ వార్మింగ్‌పై పోరాటం చేయాలని భావించాడు. ఆ క్రమంలోనే '90 మిలియన్స్ స్మైల్స్' ఫౌండేషన్ ప్రాణం పోసుకుంది.

### ఫేమస్ ఫ్యాషన్ డిజైనర్..

హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో తల్లిదండ్రులతో ఉన్న సతీష్ శిఖా ఇంటర్ వరకు ఇక్కడే చదివారు. అనంతరం తనకిష్టమైన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుని ముంబైలో పూర్తి చేసుకొని, కెనడా వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఫ్యాషన్ డిజైనర్‌గా పాపులర్ అయ్యారు. సతీష్ రూపొందించిన ఒక్కో కలెక్షన్స్ రూ.కోట్లకు పైగా ధర పలికేవి. క్షణం తీరిక లేకుండా పని, చేతి నిండా డబ్బు, విలాసవంతంతమైన జీవితం గడిపారు. కెనడా పౌరసత్వం పొంది లగ్జరీ జీవితం గడుపుతున్న రోజుల్లో సతీష్ శిఖా జీవితాన్ని ఆ చిన్నారి మలుపుతిప్పింది. అతని జీవిత లక్ష్యాన్ని నిర్దేశించింది.

### కెనడా వదలి ఆచరణలోకి..

'మన భూమి.. మనం కాపాడుకుందాం' అనే నినాదంతో తన లక్ష్యాన్ని మొదలు పెట్టారు సతీష్ శిఖా. ఆశయానికి ఆటంకమని భావించి ఫ్యాషన్ డిజైనర్ కెరీర్‌ను పూర్తిగా వదులుకున్నారు. ఆస్తి పాస్తుల మోజుతో ఎక్కడ అడుగులు ఆగిపోతాయోనని వాటిని అనాథ శరణాలయానికి రాసిచ్చేశారు. ప్రపంచమే తన ఇల్లు అని భావించి ప్రయాణం మొదలు పెట్టారు. 72 దేశాల్లో పర్యటించి గ్లోబల్ వార్మింగ్‌పై ప్రజలను చైతన్యం చేయాలనుకున్నారు. విదేశాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రముఖులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుగా చేయాలనుకున్నారు. దీని కోసం దాదాపు 1.8 కిలోమీటర్ల పొడవు ఉండే గ్రీన్ సిల్క్ వస్త్రంపై ప్రముఖుల ఆటోగ్రాఫ్, సందేశాలను సేకరించారు సతీష్.



### ఉత్తర ధ్రువం వేదికగా..

దేశాల పర్యటనలో దేశాధ్యక్షులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, సినీ తారలు, క్రికెటర్లు.. పలు రంగాలకు చెందిన వారిని కలిశారు సతీష్ శిఖా. యాంజెలినా జోలి లాంటి హాలీవుడ్ సెలెబ్రిటీలతో పాటు మన దేశంలోని బాలీవుడ్, టాలీవుడ్, ఇతర ప్రముఖుల నుంచి సందేశాలను సేకరించారు. ఈ పొడవైన బ్యానర్‌తో అంటార్కిటికా ఖండం (సౌత్ పోల్)కు ప్రయాణమయ్యారు. ఎముకలు కొరికే చలి ఒకవైపు, అనారోగ్యం మరొకవైపు.. ఇవన్నీ ఆయన లక్ష్యం ముందు చిన్నగా కనిపించాయి. మైనస్ ఉష్ణోగ్రతల్లో 12 రోజుల పాటు స్కేటింగ్ చేస్తూ ఉత్తర ధ్రువాన్ని చేరుకున్నారు. తాను రూపొందించిన గ్రీన్ సిల్క్ వస్ర్తాన్ని ప్రదర్శిస్తూ 'గ్రీన్ ఈజ్ ద సొల్యూషన్ ఫర్ గ్లోబల్ వార్మింగ్' అని ప్రపంచానికి సందేశం ఇచ్చారు సతీష్ శిఖా.

### 90 మిలియన్ స్మైల్స్ ఫౌండేషన్..

ఈ ఫౌండేషన్‌ను మరొక మానవతావాది స్రవంతి గొట్లతో కలిసి ప్రారంభించారు సతీష్. పేద కుటుంబంలో ఉన్న చిన్నారులు, అనాథ బాలబాలికలకు ఈ ఫౌండేషన అండగా ఉంటున్నది. 'విష్, గోల్, హెల్ప్..' ఈ మూడు నినాదాలతో పిల్లలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. సంక్షేమ హాస్టళ్లు, అనాథ ఆశ్రమాల్లో విద్యార్థినులకు ఈ ఫౌండేషన్ నుంచి సహాయ సహకారాలు అందిస్తున్నారు సతీష్ శిఖా. తను నిర్దేశించిన మోటోతో దశల వారీగా చిన్నారుల ఆశలు, ఆశయాలు నెరవేర్చుతున్నారు సతీష్. ఇందులో కొన్ని డబ్బుతో కూడుకున్నవి, మరికొన్ని వస్తురూపంలో, మరికొన్ని కౌన్సెలింగ్‌కు సంబంధించినవి ఉంటాయి. వలంటీర్ల సాయంతో ఈ ప్రక్రియను పూర్తి చేసి చిన్నారుల జీవితాల్లో సంతోషం నింపుతున్నారు. వీధిబాలలకు పౌష్టికాహారం అందించడం, వారికి అనారోగ్య సమస్యలు వస్తే చికిత్స అందించడం చేస్తున్నారు. నాణ్యమైన శానిటరీ ప్యాడ్స్‌ని బాలికలకు అందిస్తున్నారు. ఇలా అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు. మురికివాడల్లో ఉండే పిల్లలకు ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది సతీష్ శిఖానే. ముంబై, ఢిల్లీ, జైపూర్, ఆగ్రా, చెన్నై వంటి నగరాల్లోని పేదపిల్లలకు అన్నివిధాలుగా చేయూతనందిస్తున్నారు.

### ప్రపంచ వ్యాప్తంగా సేవలు..

'90 మిలియన్ స్మైల్స్' ఫౌండేషన్ అనేది ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. కెన్యా, మంగోలియా, సెర్బియా, టాంజానియా దేశాల్లో ఈ ఫౌండేషన్ ద్వారా సేవలు అందుతున్నాయి. ఆయా దేశాల్లో అనాథాశ్రమం, పాఠశాల, వైద్యశాల ఈ ఫౌండేషన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు ఈ ఫౌండేషన్‌లో భాగస్వాములుగా ఉన్నారు. మిస్ వరల్డ్ ఫ్రాన్స్ -2018 అరోరే కిచెనిన్, మిస్ యూనివర్స్ స్వీడెన్-2014 కామిలా హాన్సన్, మిస్ బొలివియా యూనివర్స్ క్లౌడియా ఆర్సే లెమైత్రీ, మిస్ వరల్డ్ కెనడా-2010 డినైస్ గ్యారిడో, మిస్ వరల్డ్ ఆస్ట్రేలియా -2018 ఎస్మా వోలోడర్.. ఇలా ఎంతోమంది సెలబ్రెటీలు ఈ ఫౌండేషన్‌కు అంబాసిడర్లుగా ఉన్నారు.

### మాతో చేతులు కలుపండి..

మీకేం కావాలని అడిగితే.. ఇటీవల ఒక విద్యార్థిని 'నాకు అమ్మ కావాలి'అని రాసింది. ఇలా ప్రతి ఒక్కరిదీ ఒక్కో కోరిక. ఇలాంటి వారికి సరైన సహకారం లేక ఎంతో చింతిస్తుంటారు. చిన్న మద్దతు ఉంటే వారు జీవితంలో సంతోషంగా ఉంటారు. ఎంతో రాణిస్తారు. అలాంటి మద్దతు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. డబ్బుతో కూడుకున్నవైనా, ఆరోగ్య సమస్యలైనా, ఇతర సమస్యలైనా వారు ఎదుర్కొంటే మా దృష్టికి తీసుకురండి. అలాంటి వారిని వెతికేందుకే కరపత్రాలను పంచుతూ వారి కోరికలను తీర్చుతున్నాం. వలంటీర్లు ముందుకు వస్తే మరింత మందికి సేవలందించడం సాధ్యమవుతుంది. www.90millionsmiles.com ద్వారా ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములవ్వాలని కోరుకుంటున్నా.

**- సతీష్ శిఖా, 90మిలియన్ స్మైల్స్ ఫౌండర్**

...✍ సిద్ధార్థ్ బీసగోని, స్టేట్ బ్యూరో
📷 జి.భాస్కర్

# ఏ నీరు మంచిది?



**మినరల్ వాటర్ ప్రస్తుతం పల్లెల్ని సైతం తాకింది. లాభనష్టాలేం పట్టించుకోకుండా చాలామంది వీటినే తాగుతున్నారు. ఈ వాటర్ తాగితే లాభమా? నష్టమా?**

- మినరల్ వాటర్ ఎముకల చుట్టూ ఉండే క్యాల్షియాన్ని తినేస్తుందని వైద్యులు చెబుతున్నారు. క్యాల్షియం తగ్గితే క్రమంగా ఎముకలు పటుత్వాన్ని కోల్పోతాయి. ఎముకల అరుగుదల మొదలవుతుంది. దీంతో కీళ్లనొప్పులు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- కొన్ని వాటర్ ప్లాంట్లలో నీటిని శుద్ధి చేసే క్రమంలో అందులోని క్లోరిన్ శాతాన్ని తగ్గిస్తారు. దీని కారణంగా శరీరానికి కావాల్సిన క్లోరిన్ అందదు. దీంతో ఎక్కువ రోజులు అలాంటి నీళ్లు తాగే వారికి రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు.
- కొన్ని కంపెనీలు నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు శుద్ధి చేసే క్రమంలో పలు కెమికల్స్ కలుపుతుంటాయి. ఆ నీటిని తాగితే జీర్ణవ్యవస్థ నెమ్మదిస్తుంది. చర్మ సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి. లివర్ పాడైపోయే అవకాశాలు ఎక్కువ. క్యాన్సర్ కూడా వచ్చే అవకాశాలు ఎక్కువని నిపుణులు చెబుతున్నారు.
- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వారి నివేదిక ప్రకారం వాటర్ ప్లాంట్లలో ప్యూరిఫై చేసిన నీటిలో పీహెచ్(పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) 7 శాతం ఉండాలి. కానీ 3 శాతం మాత్రమే ఉంటుందని నిపుణుల అంచనా. అందుకని మినరల్ వాటర్ ఆరోగ్యానికి మంచిది కాదని వారు సూచిస్తున్నారు.
- పూర్వం మట్టి కుండల్లో నీటిని నిల్వ ఉంచేవారు. అవే తాగేవారు. ఆ నీటిని తాగితే శరీరానికి కావాల్సిన విటమిన్లు అందేవి.
- మినరల్ వాటర్ బదులుగా బోరు నీరు, మున్సిపల్ వాటర్ ఇలా ఏ నీటినైనా వేడి చేసి వడకట్టి తాగితే మంచిది.

# వీల్‌చైర్ డ్యాన్స్!





**డ్యాన్స్ చేయాలంటే కాళ్లు అవసరం లేదు. అలా ఎలా చేస్తారని అనుకుంటున్నారా? స్టైల్ సినిమాలో లారెన్స్ సహాయంతో ప్రభుదేవా డ్యాన్స్ చేసినట్లు కాదు. ఎవరి సాయం లేకుండా వీల్‌చైర్‌లో కూర్చొనే.. శిక్షణ కూడా ఇస్తున్నది.**

ఆమె పేరు విక్కీ సిమ్మండ్స్. ఆమెకు డ్యాన్స్ అంటే ప్రాణం. అయితే.. వెన్నెముకకు గాయమవడంతో ఆమె వీల్‌చైర్‌కే పరిమితమైంది. అయినా డ్యాన్స్‌పై ఆసక్తి మాత్రం తగ్గలేదు. ఇప్పుడు తన స్నేహితురాలితో కలిసి వీల్‌చైర్‌లోనే చక్కగా డ్యాన్స్ చేస్తున్నది. అదెలాగంటే.. విక్కీకి మూడేండ్ల క్రితం వెన్నెముకకు గాయమైంది. అంతకుముందు అన్ని పనులు చకచకా చేసుకునేది. ఇప్పుడు వీల్‌చైర్‌కే పరిమితమవ్వడం వల్ల పసిపిల్లలా అన్ని పనులూ మొదటినుంచి నేర్చుకోవాల్సి వచ్చింది. ఓర్పుతో స్నానం చేయడం, వంట చేసుకోవడం లాంటి అన్ని పనులు నేర్చుకున్నది. తర్వాత యువ డ్యాన్సర్‌గా పేరున్న విక్కీ మరలా డ్యాన్స్ మొదలుపెట్టాలనుకున్నది. స్టూడియోలో తన ఫ్రెండ్ సహాయంతో డ్యాన్స్ మొదలుపెట్టింది. ఏడాది తర్వాత ఈ జంట ఇతరులకు నేర్పాలనుకున్నారు. ఈ డ్యాన్స్‌ను లిబరేట్ డ్యాన్స్ అని అంటారు. వయసుతో పనిలేకుండా అన్ని రకాల వారికి 'ది లిబరేట్' క్లాసులు ప్రారంభించారు. వీరిలో అవయవాలు పనిచేయని డ్యాన్సర్లు కూడా ఉన్నారు. వారు ఎప్పటికీ డ్యాన్స్ చేయలేమని అనుకున్న నేపథ్యంలో విక్కీ డ్యాన్స్ క్లాసులు ఆశలు కలిగించాయని శిక్షణ తీసుకునే వారిలో కొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా విక్కీ తన కలను నెరవేర్చుకోవడమే కాకుండా ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నది.

# బియ్యంలో మట్టిగడ్డలా?



- బియ్యంలో మట్టిగడ్డలు ఎక్కువగా ఉంటే బియ్యంలో కొన్ని నీళ్లు పోసి అందులో కాస్తంత ఉప్పు వేస్తే మట్టిగడ్డలు నానుతాయి. ఆ తర్వాత ఆ నీటిని పారబోస్తే సరి.
- వంకాయ ముక్కలు వేసిన నీళ్లలో రెండు చెంచాలు పాలు కలిపితే అవి నల్లగా మారవు.
- ఎండబెట్టిన అల్లంపొట్టు, ఇలాయిచీ పొట్టును టీ పొడిలో కలిపి చాయి కాస్తే మరింత రుచిగా ఉంటుంది.
- గారెలు కరకరలాడాలంటే పిండి రుబ్బేటప్పుడు కొద్దిగా అన్నం అందులో వేసి రుబ్బితే సరి. కరకరలాడే గారెలు రెడీ.
- పచ్చిమిర్చి వాడిపోతే వాటికి కొంచెం ఉప్పు, జీలకర్ర చేర్చి రుబ్బితే మిరప చట్నీ రెడీ.
- చపాతీ పిండి తడిపేటప్పుడు గోరు వెచ్చని నీటిని వాడితే చపాతీలు సాఫ్ట్‌గా వస్తాయి.
- దోస, పకోడి లేదా మురుకులు కరకరలాడాలంటే పిండిలో కొన్ని పాలు పోసి కలపాలి.
- వడియాల పిండిలో కాస్తంత నిమ్మరసం కలిపితే వడియాలు తెల్లగా వస్తాయి.
- వర్మిసెల్లి(సేమియా)ని ఎండలో ఆరబెట్టి నిల్వ ఉంచితే ఫ్రెష్‌గా ఉంటాయి.

# పొదుపు మీ చేతుల్లోనే



**నెల నెలా సంపాదిస్తున్నా.. చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదా? మీకు తెలియకుండానే మీ జేబులు ఖాళీ అవుతున్నాయా? ఈ చిట్కాలు పాటిస్తేయ పొదుపు చేసుకోవచ్చు.**

- జీతం తీసుకునే ముందే నెలవారీ బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. ప్రణాళిక ప్రకారం డబ్బును అవసరాలకు వినియోగించాలి. వృథాలను అరికడితే డబ్బును ఆదా చేసినట్లే.
- షాపింగ్‌కు వెళ్లినప్పుడు క్రెడిట్ కార్డులు తీసుకెళ్లవద్దు. ఏదో కొందామని వెళ్లి మరికొన్ని వస్తువుల్ని కొనుక్కొని వస్తుంటారు. షాపింగ్ వెళ్లే ముందే ఏది కొనాలో కచ్చితంగా నిర్ణయించుకొని, అంతే డబ్బును వెంట తీసుకెళ్లాలి.
- ప్రతీదీ ఒకే ఖాతా నుంచి ఖర్చు చేయాలనుకోవద్దు. అదనంగా మరో బ్యాంకు ఖాతా ఉంచుకోవాలి. కొంత డబ్బును ఆ ఖాతాలో జమ చేసుకోవాలి. ఇది డబ్బును ఖర్చు పెట్టడం, పొదుపు చేయడంలో ప్రధానం.
- సాధారణంగా ఎవరైనా నెలలో మొదటి రెండు వారాలపాటు ఎక్కువ ఖర్చు చేస్తుంటారు. ఇలా చేయకుండా గడిపితే ఆ తర్వాత డబ్బును ఆదా చేయవచ్చు. ఇతరులతో కలిసి బయటికి వెళ్లి గొప్పల కోసం ఎప్పుడూ ఇతరుల కోసం ఖర్చు చేయవద్దు. అవసరాన్ని బట్టి మాత్రమే ఖర్చు చేయాలి.
- పొదుపు చేయాలనే ఆలోచన ఉన్నవారు ముందుగా అప్పులన్నీ తీర్చేయాలి. ఆ తర్వాత ప్రశాంతంగా కొంతమొత్తమైనా మన దగ్గర డబ్బు ఉందనే భావన కలుగుతుంది. ఓ వైపు అప్పులు పేరుకుపోయి ఉండి ఎంత దాచినా మనసుకు ప్రశాంతత దొరకదు.

**నేను బాధితురాలిని కాదు. ముఖం దాచుకోవాల్సింది నేను కాదంటూ యాసిడ్ దాడికి గురైన లక్ష్మి అగర్వాల్ హక్కుల కోసం పోరాడుతూ మాట్లాడిన మాటలు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని దాడికి గురైన మహిళలను ఆరెంజ్ కేఫ్ రెస్టారెంట్‌కి యజమానులుగా మార్చింది ఓ సంస్థ.**




## ఆరెంజ్ కేఫ్..
# ఇక్కడ వీరే యజమానులు

ఆరెంజ్ కేఫ్ రెస్టారెంట్. వారణాసిలోని దుర్గాకుండ్ ప్రాంతం. ఈ రెస్టారెంట్‌ను ఫిబ్రవరి 14న ప్రారంభించారు. దీన్ని 'రెడ్ బ్రిగేడ్ ట్రస్ట్' నడిపిస్తున్నది. 'ది ఆరెంజ్' అనేది యునెస్కో 'ఆరెంజ్ వరల్డ్ క్యాంపెయిన్'కు సూచన. ఇది మహిళలపై లింగ ఆధారిత హింసను సూచించే 16 రోజుల క్రియాశీలత. ప్రతి ఏడాది నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 10 వరకు కొనసాగుతుంది. ఇది మహిళలకు ఆత్మరక్షణ ఇచ్చే ఎన్జీఓ. ఇక్కడ మగవాళ్ళెవరూ పనిచేయరు. వంట, సర్వర్, కౌంటర్ ఇలా అన్ని పనులు మహిళా యజమానులే చూసుకుంటారు. నెలలో వచ్చిన ఆదాయాన్ని సమానంగా పంచుకుంటారు. ఈ ఆరెంజ్ కేఫ్ లక్నో, ఆగ్రాలోని ప్రసిద్ధ షెరోస్ హ్యాంగ్ అవుట్ కేఫ్ నుంచి ప్రేరణ పొందింది. కేఫ్ లోపలి భాగాన్ని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం విజువల్ ఆర్ట్స్ విభాగం రూపొందిస్తుంది. యాసిడ్ దాడికి గురైన మహిళల గురించి ఈ సంస్థ మొదట సెర్చ్ చేసింది. జాన్‌పూర్ నుంచి రేఖ, బరేలీకి చెందిన సోమవతి, రాయ్ బరేలీకి చెందిన విమ్లా, వారణాసికి చెందిన బాదం దేవి ఈ నలుగురు గురించి ఆరా తీసింది. వారి కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకున్నది. వారికి శిక్షణ ఇచ్చి జీవితానికి భరోసా కల్పించారు. ఈ నలుగురి వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చినా వయసుతో సంబంధం లేకుండా కలిసి పనిచేసుకుంటున్నారు. ఒకప్పుడు కుటుంబానికి భారమైన వీరు ఇప్పుడు డబ్బు సంపాదించి తల్లిదండ్రులు, బిడ్డలను సంతోషంగా చూసుకుంటున్నారు. వారికి ధైర్యాన్నిచ్చేందుకు చాలామంది కస్టమర్లు ఆరెంజ్ రెస్టారెంట్‌కి వెళ్తున్నారు. ఇలా అయినా వారిని ఆదుకుంటున్నామని కస్టమర్లు సంబురపడుతున్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 18 ఫిబ్రవరి 2020



# ఫైటర్ పైలెట్‌గా కంగనా



ప్రయోగాత్మక కథాంశాలతో ప్రతి సినిమా ద్వారా కథానాయికగా తనను తాను సరికొత్త పంథాలో ఆవిష్కరించుకునేందుకు తపిస్తుంటుంది కంగనా రనౌత్. పాత్రల పరంగా సవాళ్లను స్వీకరిస్తూ ప్రతిభను చాటుకుంటున్నది. తాజాగా మరో ప్రయోగానికి సిద్ధమైంది కంగనా రనౌత్. ఎయిర్‌ఫోర్స్ పైలెట్‌గా గగనసీమ నుంచి శత్రువులతో పోరాటానికి సిద్ధమైంది. ఆమె కథానాయికగా 'తేజస్' పేరుతో ఓ సినిమా తెరకెక్కుతున్నది. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోమవారం కంగనా రనౌత్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నది. ఇందులో యుద్ధపైలెట్స్ ధరించే ఫ్లయింట్ సూట్‌లో కళ్లద్దాలు ధరించి డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నది కంగనా రనౌత్. రోనీ స్క్రూవాలా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సర్వేష్ మేవర దర్శకత్వం వహిస్తున్నారు. ధైర్యవంతురాలైన ఫైటర్ పైలెట్ పాత్రలో కంగనా రనౌత్ కనిపిస్తుందని చిత్రబృందం చెబుతున్నది. యుద్ధ విమానాలు నడపటంలో మహిళా పైలెట్స్‌కు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 2016లో అనుమతినిచ్చింది. ఆ సంఘటనల స్ఫూర్తితో ఈసినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం. వేసవిలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి వచ్చే ఏడాది సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం వెల్లడించింది.



నాని

# సోది ఆపు.. దమ్ముంటే నన్ను ఆపు

పూల్స్ మాత్రమే రూల్స్ గుడ్డిగా ఫాలో అవుతారు. అప్పుడప్పుడు నాలాంటోడు కొద్దిగా రూల్స్ బ్రేక్ చేస్తుంటాడని చెబుతున్న పోలీస్. న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడటానికి నువ్వు వస్తున్నావనగానే విజిల్స్ వేయడానికి నేనేమీ నీ ఫ్యాన్ కాదని పోలీస్‌కు సవాల్ విసిరే ఓ కిల్లర్. వారిద్దరు ఆడిన ఆటలో గెలుపు ఎవరిని వరించిందో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'వి'. నాని, సుధీర్‌బాబు హీరోలుగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రాజు, శిరీష్, హర్షిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు.సోమవారం టీజర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ టీజర్‌లో కిల్లర్‌గా నాని మాస్ లుక్ వైవిధ్యంగా కనిపిస్తుండగా పోలీస్‌గా సుధీర్‌బాబు స్టైలిష్ అవతారంలో మెప్పిస్తున్నారు. 'యూ ఆర్ ఏ సైకో' అని నివేథా థామస్ అడగ్గా 'అమ్మో నిజమా భయమేస్తుంది' అంటూ నాని చెప్పిన సంభాషణ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. చివరలో 'ఏంట్రా గేమ్స్ ఆడుతున్నావా' అని సుధీర్‌బాబు ప్రశ్నించగా 'సోది ఆపు.. దమ్ముంటే నన్ను ఆపు' అంటూ సవాల్ విసురుతూ నాని చెప్పే డైలాగ్ శక్తివంతంగా ఉంది. తన పంథాకు భిన్నంగా మొదటిసారి పూర్తిస్థాయి యాక్షన్ కథాంశంతో దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి ఈసినిమాను రూపొందిస్తున్నారు. ఉగాది సందర్భంగా మార్చి 25న విడుదలకానుంది.ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అదితిరావ్ హైదరీ, నివేథాథామస్ కథానాయికలు. తమన్ నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు.

**కుటుంబ విలువలు, భావోద్వేగాల ప్రధానంగా సాగే సెటైరికల్ ఎంటర్‌టైనర్ ఇది. మా జీవితాలతో పాటు సమాజంలో మేము చూసిన వాస్తవ ఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ సినిమాను తెరకెక్కించాం' అని అన్నారు దర్శకద్వయం సుజోయ్, సుశీల్. వారు దర్శకత్వం వహిస్తూ అప్పిరెడ్డితో కలిసి నిర్మించిన చిత్రం 'ప్రెషర్‌కుక్కర్'. సాయిరోనక్, ప్రీతి అస్రాని జంటగా నటించారు. ఈ నెల 21న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో సుజోయ్, సుశీల్ పాత్రికేయులతో ముచ్చటించారు**



సుజోయ్, సుశీల్

# భయం ఉంటేనే మంచి సినిమా చేస్తాం

చదువులు, ర్యాంకుల పేరుతో యువతరంపై ఒత్తిడి పెరుగుతున్నది. విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే పిల్లల్ని విదేశాలకు పంపించాలనే సంస్కృతి పెరిగింది. అలాంటి ఒత్తిడిలతో నిరంతరం సతమతమయ్యే ఓ మధ్య తరగతి యువకుడి కథ ఇది.ఈ క్రమంలో అతడు ఎలాంటి సంఘర్షణను ఎదుర్కొన్నాడు? తన కలల్ని వీడి మరో దారిలో అతడు ఎందుకు ప్రయాణించాల్సివచ్చింది? అనే అంశాన్ని వి నోదాత్మక పంథాలో ఈసినిమాలో ఆవిష్కరించాం. విదేశాల్లో స్థిరపడిన పిల్లల కారణంగా వృద్ధాప్యంలో అసరా లేక తల్లిదండ్రులు ఎలాంటి కష్టాల్ని ఎదుర్కొంటారోననే సందేశాన్ని అంతర్లీనంగా చూపించాం. స్వదేశంలో ఉంటూ జీవితంలో గెలవవచ్చునని ఓ యువకుడు ఎలా నిరూపించడాన్నది స్ఫూర్తివంతంగా ఉంటుంది. హితభోద చేసినట్లుగా కాకుండా వ్యంగ్యాస్త్రంగా ఈ సినిమాను రూపొందించాం. ప్రథమార్థం ఆహ్లాదభరితంగా ఉంటుంది. ద్వితీయార్థం ఎమోషనల్‌గా సాగుతుంది.

**భయాలు ఉండాలి...**

స్టార్ హీరోతో సినిమా చేస్తే విడుదల చేయడం సులభమవుతుంది. పేరున్న హీరోల చిత్రాలకు ఓపెనింగ్స్ బాగుంటాయనే నమ్మకం పంపిణీదారుల్లో ఉంటుంది. కొత్త హీరోలు నటించిన సినిమాలు విడుదలచేయడానికి పంపిణీదారులు సాహసం చేయరు. ఈ సినిమాతో మేము తెలుసుకున్న వాస్తవమిదే. ఆ రిస్క్‌ను దాటాలనే ఆలోచనతో చాలా మందికి ఈ సినిమా చూపించాం. కథ నచ్చడంతో అభిషేక్ పిక్చర్స్ వారు సినిమా విడుదలచేయడానికి ముందుకొచ్చారు. కష్టం, భయాలు ఉంటేనే మంచి సినిమా చేయగలుగుతాం.

**కంటెంట్ ఈజ్ కింగ్**

ప్రస్తుతం తెలంగాణ నేపథ్య కథాంశాలతో సినిమాల్ని తెరకెక్కించే ట్రెండ్ పెరిగింది. ఆ ఫార్ములాను ఫాలో అవుతూ విజయాన్ని అందుకోవాలని అనుకోలేదు. తెలంగాణలోనే పుట్టిపెరిగాం. నిజజీవితంలో మేము తెలంగాణ యాసతోనే మాట్లాడుతుంటాం. మాకు తెలిసిన భాషలోనే సినిమా చేయాలనే తెలంగాణ నేపథ్యాన్ని ఎంచుకున్నాం.ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నాయి. కంటెంట్‌ఈజ్ కింగ్ అనే భావన బలపడింది. మంచి సినిమా చేస్తే ఆదరిస్తారనే నమ్మకంతో రూపొందించాం.

# శ్రీకాంత్‌కు పితృవియోగం



పరమేశ్వరరావు

హీరో శ్రీకాంత్ తండ్రి మేక పరమేశ్వరరావు(72) ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల 45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. 1948 మార్చి 16న కృష్ణాజిల్లా మేకవారిపాలెంలో జన్మించారు పరమేశ్వరరావు. వృత్తిరిత్యా కర్ణాటకలోకి గంగావతి జిల్లా బసవపాలెంలో స్థిరపడ్డారు. పరమేశ్వరరావుకు భార్య ఝూన్సీతో పాటు కుమారులు శ్రీకాంత్, అనిల్, కుమార్తె నిర్మల ఉన్నారు. తండ్రి మరణంతో విషాదంలో మునిగిపోయిన శ్రీకాంత్‌ను చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులు పరామర్శించారు. పరమేశ్వరరావు అంత్యక్రియలు సోమవారం మహాప్రస్థానంలో జరిగాయి.

# ఆ తపన స్ఫూర్తినిస్తున్నది

సంగీత దర్శకుడిగా చిత్రసీమలో అడుగుపెట్టి పద్నాలుగేళ్లు అవుతోంది. దాదాపు ముప్పై ఐదు చిత్రాలకు స్వరకర్తగా పనిచేశా. కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలతో పాటు ప్రేమకథలు, థ్రిల్లర్ చిత్రాలతో నా ప్రయాణం సంతృప్తికరంగా సాగుతుంది' అని అన్నారు శేఖర్‌చంద్ర. 'నచ్చావులే', 'మనసారా', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' '118' వంటి చిత్రాలతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారాయన. సోమవారం హైదరాబాద్‌లో శేఖర్ చంద్ర ముచ్చటిస్తూ 'ఇటీవల నేను సంగీతాన్ని అందించిన '118','సవారి' సినిమాల్లోని పాటలు పెద్ద విజయాన్ని సాధించాయి. '118'లోని 'చందమామే' పాట విని 'నాతో పాటు మా కుటుంబం మొత్తానికి ఫేవరేట్ సాంగ్ ఇచ్చావు' అని కల్యాణ్‌రామ్ ప్రశంసించారు. కెరీర్‌లో పెద్ద హీరోల సినిమాలకు సంగీతాన్ని అందించలేకపోయాననే అసంతృప్తి ఉంది. ప్రయోగాత్మక కథాంశాలతో కొత్త దర్శకులు చేస్తున్న సినిమాలకు వినూత్నంగా నేను అందిస్తున్న సంగీతం ఆ లోటును భర్తీచేస్తున్నది. స్వరాల్ని సమకూర్చడంలో ప్రతి సినిమాలో వైవిధ్యత ఉండాలని కోరుకుంటాను. ఆ తపన కొత్త తరహా బాణీలను అందించడానికి స్ఫూర్తినిస్తున్నది. నాన్న హరిఅనుమోలు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. సినీ రంగంలో అడుగుపెట్టాలనుకుంటున్నట్లు చెప్పగానే తొలుత భయపడ్డారు. సంగీతం పట్ల నాలో ఉన్న ఇష్టం, తపనను గుర్తించి ప్రోత్సహించారు. ప్రస్తుతం 'వలయం'తో పాటు 'హుషారు' టీమ్‌తో మరో సినిమా, అదిత్‌అరుణ్ కొత్త చిత్రాలకు పనిచేస్తున్నాను. ఏ.ఆర్ రెహమాన్ స్ఫూర్తితో సంగీత దర్శకుడినయ్యాను' అని తెలిపారు.



శేఖర్‌చంద్ర

# లోకల్‌బాయ్ యుద్ధం



ధనుష్, మెహరీన్

ధనుష్ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'పటాస్'. దురై సెంథిల్‌కుమార్ దర్శకుడు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. ఈ చిత్రాన్ని 'లోకల్‌బాయ్' పేరుతో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సీహెచ్ సతీష్‌కుమార్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. మెహరీన్, స్నేహ కథానాయికలు. ఈ నెల 28న విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ప్రాచీన యుద్ధవిద్య అడిమురై గొప్పతనాన్ని ఓ తండ్రీ కొడుకులు ఎలా చాటిచెప్పారు?తండ్రి లక్ష్యాన్ని తనయుడు ఎలా నెరవేర్చాడన్నది ఆకట్టుకుంటుంది. ధనుష్ ద్విపాత్రాభినయం చేశారు. తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు.



# జాన్వీ ద్విపాత్రాభినయం

'ధడక్' చిత్రంతో తొలి అడుగులోనే అందం, అభినయంతో ఆకట్టుకున్నది జాన్వీకపూర్. ఈ విజయంతో హిందీచిత్రసీమలో వరుస అవకాశాల్ని దక్కించుకుంటూ కథానాయికగా బిజీగా మారిపోయింది. విభిన్నమైన కథాంశాల్ని ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్న ఆమె తాజా చిత్రం 'రూహీ అఫ్జానా'లో తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్నది. రాజ్‌కుమార్‌రావ్, వరుణ్‌శర్మ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. సినిమాలోని కొత్త స్టిల్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నది జాన్వీ. ఇందులో బైక్‌పై కూర్చొన్న రాజ్‌కుమార్, జాన్వీకపూర్, విష్ణుశర్మ దేనినో చూస్తూ భయపడుతున్నట్లుగా ఉన్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటున్నది. తొలుత ఈ సినిమాను ఏప్రిల్ 24 విడుదలచేయాలని చిత్రబృందం భావించింది. 'ఆంగ్రేజీమీడియం' నిర్మాతలతో కుదిరిన ఒప్పందం కారణంగా జూన్ 5వ తేదీకి వాయిదా వేశారు. 'ఘోస్ట్ స్టోరీస్' తర్వాత జాన్వీ నటిస్తున్న హారర్ చిత్రమిది.







నమస్తే తెలంగాణ
# జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 18 ఫిబ్రవరి 2020



క్యాన్సర్.. అంటే ఒకప్పుడు మరణం తప్ప మార్గం లేదు. ఆ తరువాత జీవిత కాలాన్ని పొడిగించగలిగారు వైద్యులు. ఇప్పుడు తొలిదశ క్యాన్సర్‌ని పూర్తిగా నిర్మూలించడం కూడా సాధ్యమేనంటున్నది క్యాన్సర్ వైద్య రంగం. ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు మెరుగైన చికిత్సలు వస్తూనే ఉన్నాయి. క్యాన్సర్ వైద్యంలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన పరిణామాలపై చర్చించడానికి ప్రతి రెండేళ్లకోసారి హైదరాబాద్ అపోలో హాస్పిటల్ క్యాన్సర్ కాంక్లేవ్ పేరుతో ఒక అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. ఇటీవల జరిగిన ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ నిపుణులు దీనిలో పాల్గొని ఆధునిక క్యాన్సర్ చికిత్సా పద్ధతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్యాన్సర్ నిపుణులు ఏమంటున్నారంటే..

... రచన ముదుంబై

# క్యాన్సర్‌ని భయపెడుతున్న కొత్త థెరపీలు!

## ఇమ్యునోథెరపీ.. అయాన్ రేడియోథెరపీ



డాక్టర్ స్టీఫెన్ గ్లుక్
క్యాన్సర్ ఇమ్యునోథెరపీ స్పెషలిస్ట్, సుమ్మిట్ యూనివర్సిటీ, న్యూజెర్సీ, యుఎస్ఎ

**రాజుగారు..** ఆయనకు రాచపుండు అయింది... ఏ లోయ లోకో వెళ్లి ప్రత్యేకమైన మూలికలు తెస్తే తప్ప ఆయనకు చికిత్స చేయడం సాధ్యం కాదు.. అవి తేవడానికి వెళ్తాడు యువరాజు... ఇలా కథల్లో వింటూనే ఉంటాం. ఇది నిజమే. ఆ రాచపుండే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మానవాళిని భయపెడ్తున్న క్యాన్సర్. దీనికి ఇప్పుడు మనం భయపడుతున్నాం గానీ.. ఇది ఇప్పటిది కాదు. రెండు వేల సంవత్సరాల నుంచి ఈ క్యాన్సర్ కణుతులు మనల్ని బాధపెడుతూనే ఉన్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాన్ని ఎదుర్కోవడానికి మానవ ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. మొదట్లో క్యాన్సర్ ట్యూమర్‌ని తొలగించడానికి శస్త్రచికిత్స తప్ప మరో ప్రత్యామ్నాయ చికిత్స ఉండేది కాదు. ఆ తరువాత కీమోథెరపీ, రేడియోథెరపీ వచ్చాయి. వాటిలో కూడా నిరంతరం కొత్త మందులు, కొత్త థెరపీలు వస్తూనే ఉన్నాయి. సరికొత్త రేడియోథెరపీలు, టార్గెటెడ్ థెరపీలు, సైడ్ ఎఫెక్టులు తగ్గించే కీమో మందులు క్యాన్సర్ రోగుల్లో కొత్త ఆశలు కలిగిస్తున్నాయి. ఇప్పుడు క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదు. తొందరగా గుర్తిస్తే దాని బారి నుంచి బయటపడేసే అద్భుత చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్ని మనదేశంలోకి రాకపోయినా వేరే దేశాల్లో అయినా క్యాన్సర్ పేషెంట్లకు కోటి ఆశలందిస్తున్నాయి.

### క్యాన్సర్ మూలం...?

మన శరీరంలో నిరంతరం కణాలు విభజన చెందుతూ కొత్త కణాలు పుడుతుంటాయి. మరోవైపు కణాలు చనిపోతుంటాయి. ఈ కణాల విభజనను కొన్ని జన్యువులు కంట్రోల్ చేస్తుంటాయి. ఈ జన్యువుల్లో మార్పులు కలిగినప్పుడు కణవిభజన కంట్రోల్ తప్పి, ఆగకుండా విభజన చెందుతూ కొత్త కణాలు పుడుతూనే ఉంటాయి. ఈ కొత్త కణాలే ఒక గడ్డగా తయారవుతాయి. అంటే ఏ క్యాన్సర్‌కైనా దాని మూలం కణాల్లో జరిగే జన్యుమార్పుల్లోనే ఉందన్నమాట. అదనంగా ఏర్పడిన కణాల గడ్డను సర్జరీ ద్వారా తొలగించడం ఒక పద్ధతైతే రేడియేషన్‌ని పంపించి ఆ కణాలను చంపేయడం మరో పద్ధతి. ఇంకోవైపు కీమోథెరపీ ద్వారా మందులిస్తూ అదనపు కణాల అంతు చూస్తున్నారు.

### కొత్త అధ్యయనాలు.. సరికొత్త చికిత్సలు

శస్త్రచికిత్స ద్వారా క్యాన్సర్ కణితిని తొలగించేటప్పుడు కొంత ఆరోగ్యకరమైన కణజాలాన్ని కూడా తీసేయాల్సి వస్తుంది. దాంతో సైడ్ ఎఫెక్టుల అవకాశం ఎక్కువ. క్యాన్సర్ సర్జరీలోకి రోబోటిక్స్ ప్రవేశించిన తరువాత క్యాన్సర్ సర్జరీ సులువు అయింది. అంతేగాక సైడ్ ఎఫెక్టులనూ తగ్గించగలిగారు. 20-30 ఏళ్ల క్రితం క్యాన్సర్‌కు కారణమవుతున్న మాలిక్యులర్ టార్గెట్స్‌ని గుర్తించారు. దాంతో వాటి ఆధారంగా కొత్త చికిత్సల రూపకల్పన సులువైంది. ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ లాంటివి సక్సెస్ అవుతున్నాయి. వ్యాధి నిరోధక శక్తిని చైతన్యవంతం చేసి, క్యాన్సర్ కణాలను చంపేదే ఇమ్యునోథెరపీ. మెలనోమా, లంగ్ క్యాన్సర్లకు దీన్ని ఎక్కువగా వాడుతున్నారు. రేడియోథెరపీలో కూడా సాధారణ రేడియేషన్ మాత్రమే కాకుండా ప్రొటాన్, ఫొటాన్ ఎనర్జీని ఉపయోగించి క్యాన్సర్ కణాలను చంపేస్తున్నారు. దీనిలోనే న్యూక్లియర్ చికిత్సలో భాగంగా హెవీ పార్టికల్ రేడియేషన్ థెరపీ ఇప్పుడు మంచి ఫలితాలను ఇస్తోంది.

### ముల్లును ముల్లుతోనే తీసే ఇమ్యునోథెరపీ

మన శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థ అత్యంత శక్తివంతమైనది. మన శరీరానికి సంబంధించని ఏ పదార్థం, జీవి, కణం మనలోపలికి ప్రవేశించినా వెంటనే యాక్టివేట్ అయి, వాటిని నాశనం చేస్తుంది. కాని క్యాన్సర్ కణాలు మన శరీర సొంత కణాల నుంచే తయారవుతాయి. కాబట్టి శరీరం వాటిని హానికరమైనవిగా భావించదు. అయితే క్యాన్సర్ ఏదైనా సరే కణాల కేంద్రకంలో ఉండే డీఆక్సీరైబో న్యూక్లిక్ ఆమ్లం (డీఎన్ఎ)లో మ్యుటేషన్లు (మార్పులు) సంభవించడం వల్లనే పుడుతుంది. డీఎన్ఎలో ఉండే జన్యువుల్లో ఈ మార్పులు కలుగుతాయి. పొగాకు, స్మోకింగ్, అల్ట్రావయొలెట్ కిరణాలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, కాలుష్య పదార్థాల వంటి



క్యాన్సర్ కారకాల వల్ల ఈ మార్పులు ప్రేరేపించబడుతాయి. గొంతు క్యాన్సర్, మలద్వార క్యాన్సర్, గైనిక్ క్యాన్సర్ల వంటి వాటిలో వైరస్‌లు మ్యుటేషన్లకు కారణమవుతాయి. ఊపిరితిత్తులు, చర్మం, మెలనోమా లాంటి క్యాన్సర్లన్నీ మ్యుటేషన్ల వల్లనే ఏర్పడుతాయి.

మార్పులు చెందని సాధారణ డీఎన్ఎ సాధారణమైన ప్రొటీన్లను (జన్యువులు) తయారుచేస్తుంది. కాని మార్పులు చెందిన డీఎన్ఎ మ్యుటేటెడ్ ప్రొటీన్లనే తయారుచేస్తుంది. ఇలాంటప్పుడు వీటిని వ్యాధి నిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) వీటిని గుర్తిస్తుంది. ఈ ప్రొటీన్లు యాంటిజెనిక్, ఇమ్యునోజెనిక్‌గా ఉంటాయి. కాబట్టి ఇమ్యున్ సిస్టమ్ యాక్టివేట్ అవుతుంది. క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా చర్యలు జరపడం ప్రారంభిస్తుంది. కాని ఈ చర్యలను కొన్ని ప్రొటీన్లు అడ్డుకుంటున్నాయని ఇటీవలే గుర్తించారు. ఆ రెండు ప్రొటీన్లు సిటిఎల్ఎ-4, పిడి1. ఈ ప్రొటీన్లను అడ్డుకునే దిశగా మందులను అభివృద్ధి పరిస్తే క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చని అమెరికాకు చెందిన డాక్టర్ జేమ్స్ పాట్రిక్ ఎలిసన్, జపాన్‌కి చెందిన టసుకు హాంజో అనే సైంటిస్టులు కనుక్కున్నారు. వీళ్లకు 2018లో నోబెల్ బహుమతి కూడా లభించింది.

సిటిఎల్ఎ-4, పిడి1 ప్రొటీన్లను ఇమ్యునో చెక్ పాయింట్లంటారు. అంటే వ్యాధి నిరోధక వ్యవస్థ యాక్టివేట్ కాకుండా ఆపుతాయి. అందువల్ల అది క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పనిచేయలేకపోతుంది. అదే ఇమ్యూన్ సిస్టమ్‌ను తిరిగి యాక్టివేట్ చేయగలిగితే మన సొంత కణాలతోనే క్యాన్సర్‌పై దాడి చేయవచ్చునేదే ఇమ్యూన్ థెరపీ.

### చికిత్స ఎలా చేస్తారు?

ఇమ్యునో చెక్‌పాయింట్లయిన ఈ ప్రొటీన్ల పనిని బ్రేక్ చేయడానికి మెడిసిన్స్ ఇస్తారు. ఇందుకోసం మోనోక్లోనల్ యాంటిబాడీస్‌ని ఉపయోగిస్తారు. మెడిసిన్‌ను ఇన్‌ఫ్యూజన్స్‌గా ఇస్తారు. మోనోక్లోనల్ యాంటిబాడీలు యాంటిజెనిక్, ఇమ్యునోజెనిక్ కాదు. కాబట్టి వాటివల్ల సాధారణంగా సైడ్ ఎఫెక్టులు ఉండవు. ఈ ఇన్‌ఫ్యూజన్స్‌ని ప్రతి రెండు మూడు వారాలకు ఒకసారి ఆరునెలల పాటైనా ఇవ్వాలి. పేషెంటు పరిస్థితి, క్యాన్సర్ దశ, తీవ్రత లాంటి వాటి ఆధారంగా డోసేజిలో మార్పులుంటాయి. ఈ మందులు ఇమ్యూన్ సిస్టమ్‌ని యాక్టివేట్ చేస్తాయి. అయితే కొన్నిసార్లు అరుదుగా ఇమ్యూన్ సిస్టమ్ ఆటో ఇమ్యూనిటీని ప్రేరేపిస్తుంది. అంటే క్యాన్సర్ కణాలతో పాటు ఇతర సొంతకణాల పైన కూడా దాడిచేస్తుందన్నమాట. అందువల్ల చర్మంపై దద్దుర్లు రావడం, డయేరియా, ఊపిరాడకపోవడం, లివర్‌లో సమస్యలు, థైరాయిడ్ సమస్యలు రావొచ్చు. అయితే ఇవి తాత్కాలికమే. కొన్ని వారాలు మాత్రమే ఉంటాయి. అప్పుడు కూడా ఆయా లక్షణాలను మందుల ద్వారా కంట్రోల్ చేయొచ్చు. ఈ సైడ్ ఎఫెక్టులు కూడా క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పనిచేయడానికి తోడ్పడుతాయని ఇటీవలి అధ్యయనాలు చెప్తున్నాయి.

### ఎవరికి ఇవ్వొచ్చు?

దీన్ని దాదాపు అన్ని క్యాన్సర్లకు ఇవ్వొచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్, తల, మెడ క్యాన్సర్లు, గొంతు, గైనిక్ క్యాన్సర్లయిన రొమ్ము, అండాశయ క్యాన్సర్లు, లివర్, కిడ్నీ, రెక్టల్ క్యాన్సర్లకు మంచి ఫలితాలిస్తున్నాయి. అయితే రెండు, మూడు దశల్లో ఉన్న క్యాన్సర్లకు కూడా ఇది బాగా పనిచేస్తుంది. నాలుగో దశలో పూర్తిగా నయం చేయలేము. దీనికి సైడ్ ఎఫెక్టులుండవు కాబట్టి ఇది కీమోథెరపీ కన్నా తక్కువ హానికరం. ఇది 6 ఏళ్ల నుంచి అందుబాటులో ఉంది. పదేళ్లుగా అధ్యయనాలు జరుగుతున్నాయి. 2018లో ప్రొటీన్లను బ్రేక్ చేయడం కనుక్కున్నాక ఇమ్యునోథెరపీ కొత్త పుంతలు తొక్కింది. ట్యూమర్ ఇమ్యునోజెనిక్‌గా ఉంటేనే ఇమ్యునోథెరపీ ఇవ్వడం సాధ్యమవుతుంది.

### ఫ్లాష్ రేడియోథెరపీ..

క్యాన్సర్ చికిత్సలన్నింటిలోనూ పరిశోధనలు ముమ్మరమయ్యాయి. రేడియోథెరపీలో వచ్చిన అధునాతన చికిత్సలు క్యాన్సర్ చికిత్స గతినే మార్చివేశాయి. రేడియోథెరపీలో కొత్తగా వచ్చిన ఫ్లాష్ థెరపీ మరింత మేలైన వైద్యాన్ని తీసుకొచ్చింది. సాధారణంగా రేడియోథెరపీ కోసం చాలా తక్కువ డోసులో రేడియేషన్‌ను ఉపయోగిస్తాం. కాని చాలా హై డోస్‌ను తక్కువ సమయం మాత్రమే డెలివరీ అయ్యేట్టుగా ఇచ్చేదే ఫ్లాష్ రేడియోథెరపీ. కేవలం ఫ్రాక్షన్ ఆఫ్ సెకండ్‌లో చికిత్స అయిపోతుంది. నార్మల్ టిష్యూ డ్యామేజ్ తగ్గుతుంది. ఆటోమేటిగ్గా సైడ్ ఎఫెక్టులూ తగ్గుతాయి. ఇంతకుముందు ప్రతి పేషెంట్‌నూ ఒక్కలాగే ట్రీట్ చేసేవాళ్లం. ఇప్పుడు ప్రతి పేషెంట్‌కు నిర్దుష్టమైన జెనెటిక్ ప్రొఫైల్ ఉంటుంది. దాని ఆధారంగా చికిత్స ఇస్తున్నారు. లంగ్ క్యాన్సర్ క్యూర్ రేటు పెరగడానికి ఇమ్యునోథెరపీ ఎంతో ఉపయోగపడింది. 10-15 శాతం సర్వైవల్ రేటు పెరిగింది.



డాక్టర్ విజయానంద్ రెడ్డి
చైర్మన్, క్యాన్సర్ కాంక్లేవ్
డైరెక్టర్, అపోలో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్స్
హైదరాబాద్

## రేడియోధార్మిక అయాన్లతో..

రేడియేషన్ థెరపీ దుష్ప్రభావాలు తగ్గించే సరికొత్త చికిత్స హెవీ అయాన్ థెరపీ (హెచ్ఐటి). ఇందుకోసం కార్బన్, ఆక్సిజన్, సిలికాన్ అయాన్లను ఉపయోగిస్తారు. ఇవి పాజిటివ్ అయాన్లు. క్లినికల్‌గా ఎక్కువగా కార్బన్ అయాన్‌నే ఉపయోగిస్తారు. ఇది కూడా సాధారణ రేడియోథెరపీ లాంటిదే. కాని మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది. సాధారణంగా ఇప్పుడు వాడుతున్న రేడియేషన్ థెరపీలో మూడు రకాలున్నాయి. ఫొటాన్, ప్రొటాన్, హెవీ అయాన్ రేడియోథెరపీ.

### ఎలా ఇస్తారు..?

వాయువులు మెషిన్ ద్వారా ట్రావెల్ చేస్తూ రేడియేషన్‌ను టార్గెటెడ్‌గా పంపిస్తాయి. అంటే క్యాన్సర్ కణజాలం పైకి మాత్రమే రేడియేషన్ వెళ్తుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కి 4 ఫ్రాక్షన్లుగా ఇస్తారు. ఒక ఫ్రాక్షన్‌ను ఎక్కువ డోస్‌తో కూడా ఇస్తున్నారు. ఒకటిన్నర నెల పాటు ఈ రేడియోథెరపీ ఇవ్వాల్సి ఉంటుంది.

ఫొటాన్ల కన్నా ప్రొటాన్ థెరపీ వల్ల సైడ్ ఎఫెక్టులు తక్కువ. అదేవిధంగా ఈ రెండింటి కన్నా హెచ్ఐటి ద్వారా సైడ్ ఎఫెక్టులు మరింత తక్కువ. ఫొటాన్ రేడియేషన్ పెద్ద ఎత్తులో మొదలై క్యాన్సర్ దగ్గరికి వెళ్లేసరికి మందగిస్తుంది. అందుకే దీనికి హై డోస్ ఇవ్వాలి. అందువల్ల నార్మల్ కణజాలం డ్యామేజ్ అవుతుంది. కాబట్టి సైడ్ ఎఫెక్టులు ఎక్కువ. కార్బన్ అయాన్ ట్యూమర్ దగ్గర మాత్రమే ఎక్కువ డోస్‌లో ఉండి తరువాత క్రమంగా తగ్గిపోతుంది. కార్బన్ అయాన్ లోపలికి ప్రవేశించిన తరువాత క్యాన్సర్ ట్యూమర్ దగ్గర మానిప్యులేట్ అవుతుంది. కాబట్టి నార్మల్ కణజాలం దెబ్బతినదు. ఇది క్యాన్సర్ కణాల డీఎన్ఎను డ్యామేజ్ చేసి కణాలు చనిపోయేలా చేస్తుంది. ఇలా డ్యామేజ్ అయిన డీఎన్ఎ అంత తొందరగా రిపేర్ కాదు. సెల్ డెత్ అవకాశం ఎక్కువ. నార్మల్ టిష్యూ డ్యామేజ్ ఉండదు కాబట్టి సైడ్ ఎఫెక్టులు దాదాపుగా ఉండవు. హెచ్ఐటి బయలాజికల్ ఎఫికసీ ఎక్కువగా ఉంటుంది. ఇమ్యునోథెరపీ తరువాత కూడా దీన్ని ఇవ్వొచ్చు.



డాక్టర్ సంగీత కాకోటే
న్యూక్లియర్ మెడిసిన్, హెవీ అయాన్ రేడియేషన్ థెరపీ స్పెషలిస్ట్
గున్మా యూనివర్సిటీ ,జపాన్

### ఎవరికి?

సంప్రదాయిక రేడియోథెరపీ ఉపయోగించలేని పరిస్థితి ఉంటే ఇక ఏమీ చేయలేకపోయేవాళ్లం. కాని ఇప్పుడు సర్జరీ చేయలేనివి, ఇతర రేడియోథెరపీ పనిచేయని పరిస్థితుల్లో కూడా హెవీ అయాన్ థెరపీతో మంచి ఫలితాలను అందించవచ్చు. ఎముకకు వచ్చే సార్కోమాను నార్మల్ రేడియేషన్‌తో ట్రీట్ చేయడం కొంచెం కష్టం. ఇలా సంప్రదాయిక రేడియేషన్ ఇవ్వడం కష్టమైనా, సర్జరీ చేయలేని పరిస్థితి ఉన్నా హెచ్ఐటి మంచి ఫలితాలనిస్తుంది. ఉదాహరణకు రెక్టల్ ఏరియాలో వచ్చిన క్యాన్సర్‌కు ఆపరేషన్ చేయడం కష్టం. హెచ్ఐటి ద్వారా రేడియోథెరపీతో మంచి చికిత్స అందించవచ్చు.

ఫొటాన్ రేడియేషన్ రెస్పాన్స్ తక్కువగా ఉంటే కూడా ఈ థెరపీ సరిపోతుంది. ఫొటాన్ థెరపీతో రెస్పాండ్ కాకుంటే మెలనోమా, హెడ్ అండ్ నెక్ లాంటివి అప్పుడు హెచ్ఐటి ఉపయోగిస్తారు. రికరెంట్ కేసుల్లో కూడా ఇవ్వొచ్చు.

హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లు సాధారణంగా ఫొటాన్ రేడియేషన్‌కి చాలా సెన్సిటివ్‌గా ఉంటాయి. అంటే సులువుగా చికిత్స చేయొచ్చు. ముఖ్యంగా హెడ్ అండ్ నెక్ ఏరియాలో వచ్చే స్క్వామస్ కార్సినోమా ఫొటాన్‌కు సెన్సిటివ్‌గా ఉంటుంది. అంటే ఈ రేడియేషన్‌తో ఆ క్యాన్సర్‌ని సులువుగా నిర్మూలించవచ్చు.

మాలిగ్నెంట్ మెలనోమా, గ్రంథుల నుంచి పుట్టే అడినాయిడ్ సిస్టిక్ కార్సినోమాలకు హెచ్ఐటి మంచిది. వీటికి సాధారణంగా సర్జరీ చేస్తారు. కాని కొన్నిసార్లు సర్జరీ చేయలేము. హెడ్ అండ్ నెక్ ఏరియాలో వచ్చి, ఏ కన్ను వరకో వెళ్తే సర్జరీ చేయలేం. ఇలాంటప్పుడు కార్బన్ అయాన్ ట్రీట్‌మెంట్ బాగా ఉపయోగపడుతుంది. అడినాయిడ్ సిస్టిక్ కార్సినోమాకు ఫొటాన్ రేడియేషన్ కూడా ఇవ్వడం కష్టం. ఇది దానికి రెసిస్టెంట్‌గా ఉంటుంది. లివర్ క్యాన్సర్ కణితి పెద్దగా ఉంటే ఫొటాన్ రేడియేషన్‌తో రెస్పాండ్ కాదు. కొన్నిసార్లు ఆపరేషన్ కూడా కష్టం అవుతుంది. ఇలాంటప్పుడు నాలుగు సిట్టింగ్స్‌లో ఇచ్చే కార్బన్ అయాన్ ట్రీట్‌మెంట్ మేలు చేస్తుంది. ఇది నాలుగో దశలో ఉన్న క్యాన్సర్‌కు కూడా పనికొస్తుంది.




### ఎక్కడెక్కడ?

జపాన్‌తో పాటుగా చైనా, జర్మనీ, ఇటలీ వంటి దేశాల్లో ఈ ట్రీట్‌మెంట్ ఉంది. అమెరికాలో కూడా లేదు. 1995 నుంచి జపాన్ ఈ ట్రీట్‌మెంట్ వాడుతోంది. ఏ సాలిడ్ ట్యూమర్‌కైనా ఇది ఉపయోగపడుతుంది. అయితే ఇది 1 శాతం పేషెంట్లకు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రపంచవ్యాప్తంగా 13 సెంటర్లు మాత్రమే ఉన్నాయి. హెవీ అయాన్ థెరపీని కార్బన్ అయాన్‌తో పాటు, ఇమ్యునోథెరపీని కలిపి ఇవ్వాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లినికల్ ట్రయల్స్‌లో ఉంది. ఒక గ్రూప్‌కి కేవలం కార్బన్ అయాన్, మరొక గ్రూప్‌కి కార్బన్ అయాన్‌తో పాటు ఇమ్యునోథెరపీ ఇచ్చి చూశారు. పూర్తి స్థాయి ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది.



## అమ్మల్లో పొట్ట తగ్గాలంటే..

పిల్లలు పుట్టగానే కొంతమంది మహిళలకు పొట్ట పెరిగే ఉంటుంది. ఇందుకోసం కొంతమంది బెల్టులు కూడా వాడుతుంటారు. కాని ప్రెగ్నెన్సీ తరువాత పొట్ట రాకుండా ఉండాలంటే భోజనం తరువాత నడవడం ఉత్తమ పరిష్కారం. సాధారణంగా ప్రసవం తరువాత పొట్ట నార్మల్‌కి రాలేదంటే కొవ్వు పెరుగుతున్నదనే అర్థం. సాధారణంగా భోజనం తరువాత అలాగే కూర్చుని ఉండడమో లేదా పడుకోవడమో చేస్తుంటారు. బిడ్డల్ని కన్న తల్లులు కూడా తిన్న తరువాత ఇలాగే కాస్త నడుం వాలుస్తుంటారు. వాళ్లో పొట్ట పెరగడానికి ఇదే ముఖ్య కారణం. తిన్న తరువాత కాసేపు నడవడమే పొట్టలోని కొవ్వు తగ్గే మార్గం. భోజనం తరువాత కనీసం పావుగంట పాటైనా అటూ ఇటూ నడవాలి. దీనివల్ల ఇటు పొట్ట తగ్గుతుంది. అటు శరీరమూ ఆరోగ్యంగా ఉంటుంది. మరో ముఖ్య విషయం ఏంటంటే, కొంతమంది రెండు పూటలకి సరిపడా వంట ఉదయమే చేసేస్తారు. కాని పొద్దున వండినవి సాయంత్రానికి తినడం కన్నా ఎప్పటివప్పుడు వేడిగా, తాజాగా తినడం వల్ల ఆరోగ్యంతో పాటు, పొట్ట ఎత్తు కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు.

## పసిపిల్లల ఆహారమా.. విషమా..?!



చంటిబిడ్డలకు ఘనాహారం అలవాటు చేసేటప్పుడు రెడీమేడ్‌గా దొరికే పొడర్లను వాడుతుంటాం. కాని వీటిలో అనేక రకాల విషతుల్యమైన రసాయనాలు ఉన్నాయని ఇటీవలి పరిశోధనల్లో తేలింది. ప్రతీ ఫుడ్‌లోనూ కనీసం ఒక్క రసాయనమైనా హానికరమైంది ఉంటోందంటున్నారు అధ్యయనకారులు. అయితే ఈ రసాయనాలు చాలా తక్కువ మొత్తంలో ఉంటున్నాయి. కానీ కొద్దికాలం వాడుతూ ఉంటే క్రమంగా వీటి దుష్ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో అమ్ముతున్న 95 శాతం ఆహారపదార్థాల్లో ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ రకాల హానికర రసాయనాలు ఉంటున్నాయి. వీటిలో లెడ్, ఆర్సెనిక్, మెర్క్యురీ, కాడ్మియం లాంటివి కనిపిస్తున్నాయి. మొత్తం 168 బేబీ ఫుడ్స్‌ని టెస్ట్ చేయగా వాటిలో నాలుగింటిలో ఒక ఫుడ్‌లో ఈ భార లోహాలు ఉన్నట్టు బయటపడిందని హెల్దీ బేబీస్ బ్రైట్ ఫ్యూచర్స్ (హెచ్‌బిబిఎఫ్) సంస్థ అధ్యయనం చెప్తున్నది. ఆర్సెనిక్, లెడ్ లాంటి ఈ లోహాలు నాడీకణాల డెవలప్‌మెంట్‌కి హాని చేస్తాయంటున్నారు బోస్టన్ కాలేజ్‌కి చెందిన పీడియాట్రీషియన్ డాక్టర్ ఫిలిప్ లాండ్రిగన్. అయితే ఈ లోహాలు రైస్‌తో తయారుచేసిన ఆహార పదార్థాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. అందువల్ల ఇలాంటి టాక్సిక్ కెమికల్స్‌కి దూరంగా ఉండాలంటే పిల్లలకు ఓట్స్‌కి సంబంధించిన ఆహారం ఇవ్వాలని సూచిస్తున్నారు. బియ్యానికి సంబంధించిన పదార్థాలు లేని మల్టీగ్రెయిన్, ఓట్‌మీల్ లాంటివి అలవాటు చేయాలంటున్నారు. ఏది ఏమైనా బయట తయారుగా ఉన్నవి కొని పిల్లలకు పెట్టేకన్నా మన నానమ్మలు, అమ్మమ్మలు చెప్పిన విధంగా పప్పులు, బియ్యం, డ్రైఫ్రూట్స్, కూరగాయలు, పండ్ల లాంటి వాటితో ఇంట్లో చేసుకునే ఆహార పదార్థాలనే పసిపిల్లలకు పెట్టడం మంచిదంటున్నారు నిపుణులు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)-యూ ఆర్ రావు శాటిలైట్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

## ఇస్రోలో 182 పోస్టులు



- **మొత్తం ఖాళీలు:** 182
- **పోస్టులు:** టెక్నీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్, టెక్నికల్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, సైంటిఫిక్ అసిస్టెంట్, హిందీ టైపిస్ట్, కుక్, ఫైర్‌మెన్ తదితరాలు.
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్-మెకానిక్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, ప్లంబర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రోప్లేటింగ్, మెకానికల్ తదితరాలు.
- **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడుల్లో/ సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా (ఇంజినీరింగ్), డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** https://www.isro.gov.in

## బీఎస్ఎఫ్‌లో

**బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వాటర్ వింగ్ (బీఎస్ఎఫ్) లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 317
- **పోస్టులు:** ఎస్ఐ (మాస్టర్), ఎస్ఐ (ఇంజిన్ డ్రైవర్), ఎస్ఐ (వర్క్‌షాప్), హెచ్‌సీ (ఇంజిన్ డ్రైవర్), హెచ్‌సీ (మాస్టర్), టెక్నీషియన్, ఎలక్ట్రానిక్స్, మెషినిస్ట్, కార్పెంటర్, ప్లంబర్, సీటీ క్రూ.
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన వెలువడిన తేదీ (ఫిబ్రవరి 15-21) నుంచి 30 రోజుల్లోపు పంపాలి.
- **వెబ్‌సైట్:** https://bsf.gov.in

## ఈసీఐఎల్‌లో

**ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 5
- **పోస్టులవారీగా ఖాళీలు:** టెక్నికల్ ఆఫీసర్-1, సైంటిఫిక్ అసిస్టెంట్-2, జూనియర్ అసిస్టెంట్-2 ఉన్నాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** http://www.ecil.co.in

## ఎస్‌టీపీఐలో సైంటిస్టులు

**ఢిల్లీలోని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు:** మెంబర్ టెక్నికల్ స్టాఫ్ (సైంటిస్ట్ బీ)
- **మొత్తం ఖాళీలు:** 11
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, ఎంబీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 9
- **వెబ్‌సైట్:** https://www.stpi.in

## బీఐఎస్‌లో టెక్నికల్ పోస్టులు

**బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 50
- **విభాగాలవారీగా ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్ (ల్యాబొరేటరీ)-30, సీనియర్ టెక్నీషియన్-20 ఉన్నాయి.
- **విభాగాలు:** కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఫిట్టర్, వెల్డర్ పోస్టులు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, మెట్రిక్యులేషన్, డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, స్కిల్/ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 8
- **వెబ్‌సైట్:** https://bis.gov.in

# సీఎం టీ-10 కప్ విజేత ప్రెస్‌క్లబ్

ఫైనల్లో టీఎన్‌జీవోపై ఉత్కంఠ విజయం.. క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు.. ఎల్బీ స్టేడియంలో పండుగ వాతావరణం



సోమవారం ఎల్బీ స్టేడియంలో నందిని, దీప్తి, నిఖత్ జరీన్‌కు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు 66వ పుట్టిన రోజును పురస్కరించుకుని అంతటా పండుగ వాతావరణం నెలకొన్నది. సోమవారం ఎల్బీ స్టేడియం వేదికగా ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన సీఎం టీ-10 కప్ ఫైనల్లో ప్రెస్‌క్లబ్ జట్టు మూడు పరుగుల తేడాతో టీఎన్‌జీవోపై అద్భుత విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రెస్‌క్లబ్ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లకు 79 పరుగులు చేసింది. టీఎన్‌జీవో బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ మణి(32 బంతుల్లో 51 పరుగులు) అర్ధసెంచరీతో అదరగొట్టాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీఎన్‌జీవో జట్టు 7 వికెట్లకు 76 పరుగులకు పరిమితమైంది. శేఖర్ మూడు వికెట్లతో రాణించాడు. విజేత, రన్నరప్ ట్రోఫీలను రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అందజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేల జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టాలీవుడ్ తల్వార్స్ జట్టు విజయం సాధించింది. ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గ్యాదరి కిషోర్, సైది రెడ్డి, జీవన్ రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆకట్టుకున్నారు.



### క్రీడాకారులకు సన్మానం

తెలంగాణ తరపున జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో మెరిసిన క్రీడాకారులను రాష్ట్ర క్రీడా శాఖ ఘనంగా సన్మానించింది. ఇటీవలి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పతకాలు సాధించిన 21 క్రీడాకారులకు తోడు పలు అంతర్జాతీయ టోర్నీల్లో రాణించిన 80 మందికి క్రీడా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. యువ బాక్సర్ నిఖత్ జరీన్, జిమ్నాస్ట్ అరుణా రెడ్డి, అథ్లెట్లు దీప్తి, నందిని, చెస్ క్రీడాకారుడు భరత్‌కోటి సన్మానం పొందిన వారిలో ఉన్నారు.

### మొక్కలు నాటి, రక్తదానం చేసి:

రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం ఉదయం ఒలింపిక్ భవన్ పరిసరాల్లో క్రీడాకారులతో కలిసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించి దివ్యాంగ క్రీడాకారులకు ఇండియన్ క్రిస్టియన్ మిషన్ సంస్థ సహాయం చేసిన వీల్ చైర్లను మంత్రి అందజేశారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# హంపిదే కెయిన్స్ కిరీటం

చివరి రౌండ్‌లో హారికతో గేమ్ డ్రా.. రెండు నెలల వ్యవధిలో రెండో టైటిల్



> పెద్ద టోర్నీలో గెలువడం చాలా సంతోషంగా ఉంది. ర్యాపిడ్ ప్రపంచ చాంపియన్‌షిప్ విజయం మెరుపు ఫామ్ వల్ల వచ్చింది కాదని ఈ కప్ నాకు గుర్తు చేసింది. మేలో ఇటలీలో జరిగే మేజర్ టోర్నీ గ్రాండ్‌ప్రిక్స్‌లో పోటీకి దిగుతా. ఆ తర్వాత భారత్‌లో జరిగే పీఎస్‌పీబీ టోర్నీలో ఆడతా.
> - కోనేరు హంపి

**సెయింట్ లూయిస్:** భారత గ్రాండ్‌మాస్టర్, తెలుగు చెస్ ప్లేయర్ కోనేరు హంపి మరోసారి అంతర్జాతీయ టోర్నీలో టైటిల్‌తో మెరిసింది. గతేడాది డిసెంబర్‌లో ర్యాపిడ్ ప్రపంచ చాంపియన్‌గా అవతరించి చరిత్ర సృష్టించిన ఆమె.. ప్రస్తుతం కెయిన్స్ కప్‌ను సొంతం చేసుకొని రెండు నెలల వ్యవధిలో రెండో టైటిల్‌ను చేజిక్కించుకుంది. సోమవారం ఇక్కడ జరిగిన కెయిన్స్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతో మ్యాచ్‌ను కోనేరు హంపి సమం చేసుకుంది. దీంతో టోర్నీని ఆరు పాయింట్లతో ముగించి అగ్రస్థానాన నిలిచింది. టోర్నీలో ఆరంభం నుంచి అద్భుతంగా ఆడిన హంపి.. హారికతో మ్యాచ్‌ను సమం చేసుకుంటే చాలు విజేతగా నిలిచే స్థితికి చేరుకుంది. దీంతో తొమ్మిదో రౌండ్‌లో ఎలాంటి కష్టం లేకుండా డ్రా చేసుకొని.. కెయిన్స్ కప్‌ను, 45వేల డాలర్ల ప్రైజ్‌మనీని హంపి సొంతం చేసుకుంది. ప్రపంచ చాంపియన్ వెన్‌జున్ జు(చైనా) 5.5పాయింట్లతో రెండు, రష్యాకు చెందిన అలెగ్జాండ్రా కొస్టెనుక్(5పాయింట్లు) మూడో స్థానంలో నిలిచారు. టోర్నీలో వరుస డ్రాలు నమోదు చేసిన ద్రోణవల్లి హారిక 4.5పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ విజయంతో ఎలో రేటింగ్ పాయింట్స్ మెరుగవడంతో హంపి ప్రపంచ జాబితాలో రెండో స్థానానికి చేరింది.

# 10కి పడిన కోహ్లీ



**దుబాయ్:** ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ 10వ ర్యాంకుకు పడిపోగా.. మంచి ఫామ్‌లో ఉన్న ఓపెనర్ కేఎల్ రాహుల్ రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. తాజా టీ20 ర్యాంకింగ్స్‌ను ఐసీసీ సోమవారం వెల్లడించింది. ఇటీవల దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో 136పరుగులతో ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్(687పాయింట్లు) రాణించడంతో విరాట్ కోహ్లీ (673) ఓ మెట్టు దిగి పదో స్థానంలో నిలవాల్సి వచ్చింది. భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ(662) 11వ ర్యాంకులో కొనసాగగా.. పాకిస్థాన్ స్టార్ బాట్స్‌మన్ బాబర్ ఆజం టాప్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు.బౌలింగ్ విభాగంలో భారత అగ్రశ్రేణి పేసర్ జస్ప్రీత్ బుమ్రా 12వ ర్యాంకులో విండీస్ పేసర్ కాట్రెల్‌తో సంయుక్తంగా నిలిచాడు. ఆఫ్ఘన్ స్టార్ రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# దుబాయ్ టోర్నీ బరిలో సానియా

**దుబాయ్:** గాయం కారణంగా ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభంలోనే నిష్క్రమించిన భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా రాకెట్ పట్టేందుకు మళ్లీ సిద్ధమైంది. గాయం నుంచి కోలుకోవడంతో దుబాయ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో ఫ్రెంచ్ ప్లేయర్ కరోలీన్ గ్రేసియాతో కలిసి సానియా మంగళవారం బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో మీర్జా జోడీ కుద్రియత్సేవ (రష్యా) - కటారినా సెబోట్నిక్ (స్లోవేనియా) ద్వయంతో తలపడనుంది. 'సుదీర్ఘ విరామం తర్వాత పునరాగమనం చేసినా గ్రాండ్‌స్లామ్ టోర్నీలో గాయం కారణంగా వైదొలగడం బాధాకరమైన విషయం. అయితే, మా ఫిజియో ఎంతో కష్టపడి నన్ను దుబాయ్ టోర్నీకి సిద్ధం చేశారు. ప్రాక్టీస్ చేయడం ప్రారంభించా. పోటీ కోసం ఎదురుచూస్తున్నా' అని సానియా చెప్పింది. దాదాపు రెండేండ్ల విరామం తర్వాత జనవరిలో బరిలోకి దిగిన తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గాయం కారణంగా సానియా మీర్జా మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో మధ్యలోనే తప్పుకుంది.

# కప్పు కొడితే చరిత్రే..




మహిళల టీ20 ప్రపంచకప్‌పై హర్మన్‌ప్రీత్ వ్యాఖ్య

భారత్ గట్టి పోటీదారు అని వెల్లడి

## మూడేండ్లలో ఎంతో మార్పు

2017 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓటమి పాలవడం బాధించినా.. ఆ తర్వాత నుంచి లభిస్తున్న ఆదరణకు ఉబ్బితబ్బిబ్బవుతున్నట్లు హర్మన్ పేర్కొంది. మూడేండ్ల క్రితం జరిగిన ఆ టోర్నీలో ఆతిథ్య ఇంగ్లండ్ చేతిలో మిథాలీ సేన 9 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఆ ఓటమి కాస్త బాధించినా.. ఈ మూడేండ్లలో జట్టు ఎంతో మెరుగైందని ఈ బిగ్‌హిట్టర్ పేర్కొంది. ప్రస్తుతం జట్టులో దూకుడుగా ఆడే ప్లేయర్లకు కొదవలేదని.. మెగాటోర్నీలో ఇది తమకు ఎంతగానో ఉపయోగపడనుందని హర్మన్ చెప్పింది. బిగ్‌బాష్ లీగ్‌లో ఆడిన భారత తొలి ప్లేయర్‌గా చరిత్రకెక్కిన హర్మన్.. ఒత్తిడిలోనూ స్థిరమైన నిర్ణయాలు తీసుకోగలిగితే జట్టుకు తిరుగుండదని తెలిపింది. కప్పు వేటలో టీమ్‌ఇండియా గట్టి పోటీదారని అన్న హర్మన్.. జట్టులో ప్రతి ఒక్కరూ తమ చిరకాల కల నెరవేర్చుకోవాలనే పట్టుదలతో ఉన్నారని వివరించింది. ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో శుక్రవారం భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది.

**సిడ్నీ:** సీనియర్ ప్లేయర్లు మిథాలీ రాజ్, జులన్ గోస్వామి స్థానాలను భర్తీచేయడం కష్టమే అయినా.. అందుబాటులో ఉన్న వనరులతో రాబోయే టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటుతామని భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. ఈనెల 21 నుంచి ఆస్ట్రేలియా వేదికగా ప్రారంభం కానున్న విశ్వసమరంలో భారత జట్టు తొలి మ్యాచ్‌లో శుక్రవారం ఆతిథ్య ఆసీస్‌తో తలపడనుంది. హైదరాబాదీ స్టార్ మిథాలీ గతేడాది పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించగా.. వెటరన్ పేసర్ జులన్ చాన్నాళ్లుగా ఈ ఫార్మాట్‌కు దూరంగా ఉంటున్నది. ప్రస్తుతం భారత మహిళల జట్టు సగటు వయసు 22.8 ఏండ్లుగా ఉంది. మెగాటోర్నీలో పాల్గొంటున్న జట్ల కెప్టెన్లతో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న హర్మన్.. ప్రపంచకప్ కోసం తమ జట్టు సన్నద్ధమైన తీరు గురించి చెప్పుకొచ్చింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

### అనుభవజ్ఞులు లేకున్నా..

మా సీనియర్ ప్లేయర్ల సేవలు అందుబాటులో లేకపోవడం పెద్దలోటే కానీ, యువ క్రికెటర్లు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని తహతహలాడుతున్నారు. ఇటీవలి కాలంలో వాళ్ల చక్కటి ఆటతీరు కనబరుస్తున్నారు. మెగాటోర్నీలోనూ అదే జోరు కొనసాగిస్తారని ఆశిస్తున్నాం. రెండేండ్ల క్రితం జట్టులో అందరి కంటే చిన్నాదాన్నైన నేనే.. ఇప్పుడు అత్యంత అనుభవజ్ఞురాలిని. అయితే జట్టు సభ్యులంతా బాధ్యతలు భుజానెత్తుకునేందుకు సిద్ధంగా ఉండటం శుభపరిణామం. జట్టు సరైన కూర్పుతో ముందుకు సాగుతున్నది. ప్రతి ఒక్కరు తమకు ఇచ్చిన పని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.

### ఆ ఆదరణ అద్భుతం..

మా జట్టు రోజురోజుకూ మెరుగవుతున్నది. అందరూ సానుకూలంగా కనిపిస్తున్నారు. మేం ట్రోఫీ గెలిస్తే పేరు ప్రఖ్యాతలతో పాటు మహిళల క్రికెట్‌లో గుణాత్మకమైన మార్పు వస్తుందని అనుకుంటున్నాం. ఈ విషయం అందరికీ తెలుసు. 2017లో వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓడినా.. ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ఆశ్చర్యమేసింది. ఒత్తిడికి లోనుకాకుండా ఉండటం ముఖ్యమని మా తల్లిదండ్రులు చెప్పారు. మేం గెలిస్తే చరిత్ర తిరుగరాసినవాళ్లమవుతాం. అందుకోసం మా శాయశక్తులు కృషిచేస్తాం. గత రెండేండ్లలో మహిళల టీ20 చాలెంజ్‌లో భాగంగా మేం కొన్ని మ్యాచ్‌లు ఆడాం. దాన్నే ఇక ముందు కూడా కొనసాగిస్తాం. ప్రపంచకప్ నెగ్గడం ప్రతి ఒక్కరి కల. అది సాధ్యమైతే దేశంలో అమ్మాయిల ఆలోచన విధానంలో మార్పు వస్తుంది. మహిళల ఐపీఎల్ నిర్వహిస్తే మాకు లబ్ధి చేకూరుతుంది.



# బౌల్ట్ పునరాగమనం

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ ఏస్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ టెస్టు జట్టులో పునరాగమనం చేశాడు. గతేడాది ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టు సందర్భంగా కుడి చేతి గాయంతో జట్టుకు దూరమైన అతడు చాన్నాళ్ల తర్వాత తిరిగొచ్చాడు. శుక్రవారం నుంచి టీమ్‌ఇండియాతో జరుగనున్న తొలి టెస్టు కోసం ఆ దేశ క్రికెట్ బోర్డు సోమవారం 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఇందులో బౌల్ట్‌తో పాటు ఆరడుగుల ఎనిమిదంగులాల యువ పేసర్ కైల్ జెమీసన్ కూడా చోటు దక్కించుకున్నాడు. జట్టులో ఏకైక స్పిన్నర్‌గా ఎజాజ్ పటేల్‌కు స్థానం దక్కింది. 'బౌల్ట్‌లాంటి అనుభవం కలిగిన పేసర్ ఉండటం జట్టులో ఉత్సాహాన్ని నింపుతుంది. వెల్లింగ్టన్ పిచ్ నుంచి బౌన్స్ రాబట్టగలిగే సత్తా జెమీసన్‌లో ఉంది కాబట్టే అతడిని ఎంపిక చేశారు. ఎజాజ్ పటేల్‌కు తిరిగి స్వాగతం పలుకుతున్నాం' అని ఆ జట్టు కోచ్ గారీ స్టెడ్ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించిన వికెట్ కీపర్ టామ్ బ్లండెల్, ఇంగ్లండ్ పర్యటనలో అదరగొట్టిన డారిల్ మిషెల్ కూడా జట్టులో చోటు నిలబెట్టుకున్నారు.

**న్యూజిలాండ్ జట్టు:** విలియమ్సన్ (కెప్టెన్), బ్లండెల్, బౌల్ట్, గ్రాండ్‌హోమ్, జెమీసన్, లాథమ్, డారిల్, నికోల్స్, ఎజాజ్ పటేల్, సౌథీ, టేలర్, వాగ్నర్, వాట్లింగ్.

# భారత్‌లోనే బాలికల హాకీ ప్రపంచకప్

**లుసానె:** వచ్చే ఏడాది జరుగనున్న బాలికల హాకీ ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. టోర్నీ వేదికను త్వరలోనే ప్రకటించనున్నట్లు పేర్కొన్న ఎఫ్ఐహెచ్.. మెగాటోర్నీలో 16 జట్లు పాల్గొంటాయని తెలిపింది. యూరప్‌కు చెందిన ఆరు జట్లు, ఆసియా నుంచి 4, ఆఫ్రికా, ఓసియానియా, పాన్ అమెరికా నుంచి రెండేసి జట్లు ఈ టోర్నీలో పాల్గొననున్నాయి. క్రితం సారి (2016లో) లక్నో వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత బాలికల జట్టు 2-1తో బెల్జియంను చిత్తుచేసి చాంపియన్‌గా అవతరించింది.

# 'పట్టు' పడతారా

నేటి నుంచి ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్.. బజరంగ్, వినేశ్, దీపక్‌పైనే అందరి దృష్టి



వినేశ్

> పురుషుల, మహిళల విభాగాల్లో భారత బృందం బలంగా ఉంది. ప్రతిష్ఠాత్మక టోక్యో ఒలింపిక్స్ జరుగనున్న ఏడాది కావడంతో ప్రతి టోర్నీ ముఖ్యమే. విశ్వక్రీడలకు ముందు వీలైనన్ని ఎక్కువ విజయాలు సాధించాలనుకుంటున్నా.
> - వినేశ్ ఫోగట్

**న్యూఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పునియా, వినేశ్ ఫోగట్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటేందుకు రెడీ అవుతున్నారు. దేశ రాజధానిలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ ఆరు రోజుల పాటు సాగనుంది. రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన నలుగురు రెజ్లర్లు, ఇద్దరు అధికారులు టోర్నీలో పాల్గొనడంపై మొదట్లో కాస్త అనిశ్చితి నెలకొన్నా.. ప్రభుత్వ అనుమతి లభించడంతో వారికి మార్గం సుగమమైంది. ప్రధాన పోటీదారు అయిన చైనా 'కరోనా' కారణంగా చాంపియన్‌షిప్‌కు దూరంగా ఉండిపోయింది. చైనీయులకు వీసాలు ఇచ్చేందుకు భారత్ అంగీకరించకపోవడంతో ఆ దేశానికి చెందిన 40 మంది రెజ్లర్లు టోర్నీకి దూరమయ్యారు. కేడీ జాధవ్ రెజ్లింగ్ స్టేడియంలో తొలి రెండు రోజులు పురుషుల గ్రీకో రోమన్ పోటీలు, ఆ తర్వాత రెండు రోజులు మహిళల పోటీలు.. చివరి రెండు రోజులు పురుషుల ఫ్రీ స్టయిల్ పోటీలు నిర్వహించనున్నారు.

### మనవాళ్లు 30 మంది

2017లో ఈ టోర్నీకి ఆతిథ్యమిచ్చిన భారత్.. 2019లో చైనా వేదికగా జరిగిన చాంపియన్‌షిప్‌లో 16 పతకాలు సాధించింది. ప్రపంచ రెండో ర్యాంకర్ బజరంగ్ (65 కేజీలు) క్రితంసారి స్వర్ణం సాధించగా.. వినేశ్ (56 కేజీలు) రజతంతో సరిపెట్టుకుంది. ఇప్పటికే టోక్యో ఒలింపిక్స్ బెర్త్ ఖరారు చేసుకున్న వీరిద్దరూ విశ్వ క్రీడలకు ముందు తమ దూకుడు కొనసాగించాలని భావిస్తున్నారు. ఇటీవల ఇటలీలో జరిగిన ర్యాంకింగ్ సిరీస్‌లో స్వర్ణం నెగ్గిన వినేశ్ ఈ పోటీల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొంది. వీరితో పాటు ఇప్పటికే టోక్యో టికెట్లు దక్కించుకున్న దీపక్ పునియా (86 కేజీలు), రవి కుమార్ దహియా (57 కేజీలు) సహా మన దేశానికి చెందిన 30 మంది రెజ్లర్లు పోటీలో ఉన్నారు. ప్రతిష్ఠాత్మక టోక్యో ఒలింపిక్స్‌కు ముందు తిరిగి టచ్‌లోకి వచ్చేందుకు ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ (65 కేజీలు)కు ఇది చక్కటి అవకాశం కాగా.. అన్షు మాలిక్ (57 కేజీలు), అశు (60 కేజీలు), సోనమ్ మాలిక్ (65 కేజీలు) వంటి యువ రెజ్లర్లు తమ సత్తాచాటేందుకు ఇదే సరైన వేదిక. ఏడాది కాలంగా పెద్దగా ప్రభావం చూపలేకపోతున్న సాక్షి ఈ టోర్నీలోనైనా విజృంభిస్తుందా చూడాలి. గత టోర్నీలో 62 కేజీల విభాగంలో బరిలోదిగి కాంస్యం నెగ్గిన సాక్షి.. ఈ సారి 65 కిలోల కేటగిరీలో పోటీ పడనుంది.

### స్టార్లకు కొదవలేదు

చైనా రెజ్లర్లు చాంపియన్‌షిప్‌కు దూరమైనా.. టోర్నీలో అంతర్జాతీయ స్టార్లకు కొదవలేదు. జపాన్‌కు చెందిన స్టార్ రెజ్లర్, ప్రపంచ చాంపియన్ కెనిచిరో ఫుమిటా, కజకిస్థాన్ స్టార్ నూర్ ఇస్లామ్ సనాయేవ్ పోటీలో ఉన్నారు. వీరితో పాటు పురుషుల విభాగంలో రెండు సార్లు ప్రపంచ చాంపియన్ రై హన్ సూ (దక్షిణ కొరియా), ఐదుసార్లు ఆసియా చాంపియన్ ఎల్‌మురాత్ తస్మురాదోవ్ (ఉజ్బెకిస్థాన్).. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్ టినీ బెకావో (కిర్గిస్థాన్) బరిలో ఉన్నారు.

> మన రెజ్లర్లకు ఇది చక్కటి అవకాశం. సొంత అభిమానుల మధ్య బరిలో దిగడం ఎప్పుడూ సంతోషంగానే ఉంటుంది. కాస్త ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి మాకు ప్రోత్సాహాన్నం దిస్తారని ఆశిస్తున్నా.
> - బజరంగ్ పునియా

# కెప్టెన్సీకి డుప్లెసిస్ వీడ్కోలు



**జొహన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ ఫాఫ్ డుప్లెసిస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కొత్త తరం నాయకుల చేతుల్లో దేశ క్రికెట్ సురక్షితంగా ఉంటుందని భావించిన డుప్లెసిస్ సోమవారం తన నిర్ణయాన్ని వెల్లడించాడు. 2017లో ఏబీ డివిలియర్స్ నుంచి సారథ్య బాధ్యతలు అందుకున్న ఫాఫ్ రెండేండ్ల పాటు మూడు ఫార్మాట్లలో దక్షిణాఫ్రికా జట్టును ముందుండి నడిపించాడు. కెప్టెన్‌గా తప్పుకున్నా.. సీనియర్ ఆటగాడిగా కెప్టెన్, కోచ్‌లకు సహాయసహకారాలు అందిస్తానని అతడు పేర్కొన్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లకు విశ్రాంతి తీసుకున్న 35 ఏండ్ల డుప్లెసిస్.. తాజాగా తన మనసులో మాట బయట పెట్టాడు. 'కొత్త నాయకత్వంలో యువ ఆటగాళ్లు సరైన మార్గంలో పయనిస్తున్నప్పుడు అన్ని ఫార్మాట్ల సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడం మంచిదని భావిస్తున్నా. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ తర్వాత ఎక్కువ రోజులు అంతర్జాతీయ క్రికెట్ ఆడలేకపోవచ్చు. దేశానికి నాయకత్వం వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇది చాలా కఠిన నిర్ణయమే కానీ జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే సారథ్య బాధ్యతల నుంచి తప్పుకుంటున్నా' అని డుప్లెసిస్ పేర్కొన్నాడు.

# స్పెయిన్‌లో సత్తాచాటుతారా..

నేటి నుంచి బార్సిలోనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

**బార్సిలోనా:** భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ఒలింపిక్ ర్యాంకింగ్ పాయింట్లు సాధించే క్రమంలో వరల్డ్ టూర్ సూపర్-300 బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ టోర్నీకి సిద్ధమయ్యారు. ఇటీవలి కాలంలో పెద్దగా ప్రభావం చూపలేకపోతున్న మన షట్లర్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న మాస్టర్స్ టోర్నీలో సత్తాచాటాలని భావిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆడిన మూడు టోర్నీల్లో సైనా ఒక్కదాంట్లోనే తొలి రౌండ్ అడ్డంకిని దాటగలిగితే.. శ్రీకాంత్ మూడింట తొలి రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాడు. లండన్ (2012) ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన సైనా.. తొలి రౌండ్‌లో యోనే లీ (జర్మనీ)తో, ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్.. మొదటి రౌండ్‌లో భారత్‌కే చెందిన శుభంకర్‌తో తలపడనున్నారు. వీరితో పాటు పారుపల్లి కశ్యప్, హెచ్‌ఎస్ ప్రణయ్, సౌరభ్ వర్మ, సాయిప్రణీత్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.